మార్క్సిస్టు

మే
2020

169

సంపుటి : 15 సంచిక : 1 వెల రు. 10/-

## ఈ సంచికలో........

కోవిడ్19: ఆర్థికరంగంపై ప్రభావం
పెట్టుబడి గుప్పిట్లో ప్రపంచ ప్రజారోగ్యం
కరోనా వైరస్‌నుపయోగించుకుని మతవిద్వేష ప్రచారం
సింధు ప్రజల విస్తృత వాణిజ్యం
పేరుకే స్వదేశీ అంతా విదేశీనే
ప్రపంచ కార్మికోద్యమ నిర్మాణంలో ఎంగెల్స్ పాత్ర
భారత దేశంలో సైద్ధాంతిక పోరాటం: ప్రత్యేకతలు
మార్క్సిస్టు అధ్యయన కేంద్రాల ప్రాధాన్యత
సామ్రాజ్యవాద వ్యతిరేక యుద్ధం



epaper.prajasakti.com

భారత కమ్యూనిస్టు పార్టీ శత వార్షికోత్సవ వ్యాసావళి

# సామ్రాజ్యవాద వ్యతిరేక యుద్ధం

**1939**లో ప్రారంభమైన రెండో ప్రపంచ యుద్ధ ప్రభావం భారతదేశ రాజకీయాలపై కూడా తీవ్రంగా పడింది. భారతదేశ ప్రతినిధులలో ఏఒక్కరితోనూ సంప్రదించకుండా బ్రిటిష్ వైస్రాయ్ భారతదేశం కూడా ప్రపంచ యుద్ధంలో పాల్గంటున్నట్టు ప్రకటించారు. ఈ ప్రకటన వెలువడంతోనే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయి. జీవన వ్యయాలు పెరగడంతో ప్రజలు అసంతఅప్తికి గురయ్యారు. కమ్యూనిస్టు పార్టీ వెంటనే యుధాన్ని వ్యతిరేకిస్తూ ప్రకటనని విడుదల చేసింది. 'ది కమ్యూనిస్ట్' అనే తన అధికారిక పత్రికలో 'జాతి విపత్కర పరిస్థితులలో' ఉన్న ఈ సమయంలో, 'చొరవ తీసుకోండి. కార్యాచరణకు పూనుకొండి' అని పిలుపునిచ్చింది.

కమ్యూనిస్టు పార్టీ చొరవతో బంబాయి కార్మిక వర్గం యుద్ధ వ్యతిరేక సమ్మెకు పిలుపునిచ్చింది. ఇందులో 90000 మంది కార్మికులు పాల్గన్నారు. రెండో ప్రపంచయుద్ధ కాలంలో జరిగిన మొదటి సమ్మె ఇదే. దాని తరువాత కరువు భత్యం కోసం మరో సమ్మె జరిగింది. ఇందులో 175000 మంది జౌళి కార్మికులు పాల్గన్నారు. ఈ సమ్మె 40 రోజుల పాటు కొనసాగింది. తీవ్రమైన అణచివేత, నాయకుల నిర్బంధాల మధ్య ఈ సమ్మెలు జరిగాయి. జౌళి కార్మికులకు మద్దతుగా అన్ని రంగాలలో పనిచేస్తున్న మొత్తం కార్మికులంతా ఒక రోజు సమ్మె చేసారు. బంబాయిలో మొదలయిన ఈ సమ్మె తరువాత, దేశంలోని అనేక ప్రాంతాలలో సమ్మెల పరంపర కొనసాగింది. ఈ కాలంలో కమ్యూనిస్టు పార్టీ పొలిట్ బ్యూరో, ' భారత కమ్యూనిస్టు పార్టీ విధానం, యుద్ధ కాలంలో కర్తవ్యాలు' అనే ఒక ప్రకటనను విడుదల చేసింది. ఇందులో పార్టీ యుద్ధకాలంలో అనుసరించ వలసిన ఎత్తుగడల గురించి వివరంగా తెలియచేసింది. 'తమ దేశం స్వాతంత్రం పొందాలంటే యుధాన్ని భేషరతుగా వ్యతిరేకించడం, ఆ విధంగా మితవాదానికి అండగా ఉండే బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని బలహీన పరచడం, ప్రపంచవ్యాప్తంగా ఉన్న విప్లవ శక్తులను బల పరచడం ' భారతదేశ ప్రజలు కర్తవ్యమని' స్పష్టంగా తెలిపింది. అనేక ప్రముఖ నగరాలలో, పారిశ్రామిక కేంద్రాలలో కార్మికులు సమ్మెలు చేసారు. పనులకు వెళ్లకుండా ర్యాలీలను చేపట్టారు. ఈ రాలీలలో మధ్యతరగతి, కింది తరగతుల కార్మికులు వేల సంఖ్యలో పాల్గన్నారు. కమ్యూనిస్టు పార్టీ, ఇతర వామపక్షవాదులు ఈ కార్మిక సంఘాలకు ముందుండి, యుద్ధవ్యతిరేక ప్రచారానికి నాయకత్వం వహించారు. కాంగ్రెస్‌లో ఉన్న సాధారణ సభ్యులలో ఒక తరగతి, కాంగ్రెస్ కమిటీలు ఈ కార్యక్రమాలలో వారికి సహకరించాయి.

బ్రిటిష్ వారు ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని ఆసరా చేసుకుని కొన్ని రాయితీలు పొందాలనుకునే మితవాద కాంగ్రెస్ నాయకులకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన శక్తివంతమైన ఆందోళనలు, పోరాటాలు వారిపై ఒత్తిడిని పెంచాయి. కమ్యూనిస్టులు నిరంతరం ఒత్తిడి చేస్తుండడంతో కాంగ్రెస్ ప్రభుత్వాలు రాజీనామాలు చేయక తప్పలేదు. ది కమ్యూనిస్ట్ (1939 నవంబర్) పత్రికలో ప్రచురించిన ఒక వ్యాసంలో, 'సామ్రాజ్యవాదం ఎటువంటి రాయితీలు ఇవ్వడానికి సిద్ధంగాలేదు' అని పార్టీ స్పష్టంగా రాసింది. అంతేకాదు, బ్రిటిష్ వారు పరిస్థితిని తమకనుకూలంగా ఎలా ఉపయోగించుకుంటారో సరిగ్గా అంచనా వేసింది: " తరచుగా నిషేధ ఉత్తర్వ్యూలను ఇస్తూ, కాంగ్రెస్, సోషలిస్టుపార్టీ, కమ్యూనిస్ట్ పార్టీ, కిసాన్ సభ, కార్మిక సంఘ కార్యకర్తలను నిర్బంధింసస్తూ, తీవ్రవాద పత్రికలను అణచివేస్తుంది. జాతీయెాద్యమంలోని విప్లవమూలాలను నాశనం చేస్తుంది. మతతత్వ శక్తులను ప్రోత్సహించడం ద్వారా కాంగ్రెస్‌ను బ్లాక్మెయిల్ చేసి, ఆత్మన్యూన్యతకు గురిచేసి, తద్వారా పరిస్థితులు తమకనుకూలంగా మార్చుకునే ప్రయత్నాలు చేస్తుంది. జాతీయ శక్తులన్నిటిని క్రమ క్రమంగా విచ్ఛిన్నం చేస్తుంది. పోరాటాన్ని అణచి పెట్టడానికి, అదుపు చేయడానికి, ఒక చట్ట పరిధిలో ఉంచడానికి జాతీయ నాయకులు చేసే ప్రయత్నాలు, జాతీయెాద్యమంలో ఘర్షణలను పెంచి, జాతీయెాద్యమ శక్తులను బలహీన పరుస్తుంది". విస్తఅతంగా సమ్మెలకు పిలుపులివ్వడం, ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు చేయడమే కాక ప్రజలలో 'కరపత్రాలు పంచడం, వీధులలో చిన్న చిన్న సమావేశాలు వేయడం, స్టడీ గ్రూపులు ' ఏర్పాటు చేయడం' ద్వారా యుద్ధం యొక్క నిజ స్వరూపాన్ని బట్టబయలు చేయాలని, తద్వారా కార్మిక వర్గ చైతన్యాన్ని పెంచి, దాని పాత్రని, కర్త్వవ్యాలను తెలియచేయాలని కమ్యూనిస్టు పార్టీ భావించింది. కార్మిక వర్గం తన పోరాటాలను కేవలం జీతాల పెరుగుదల, అధికధరలను వ్యతిరేకించడం వంటి ఆర్థిక డిమాండ్లకే పరిమితం చేయ కూడదని, అలా పరిమితం చేయడమంటే రాబోయే రాజకీయ పోరాటానికి ధైర్యంగా నాయకత్వాం వహించడాన్ని కార్మిక వర్గం వదులుకోవడమేనని కమ్యూనిస్టు పార్టీ భావించింది.'' ఈ అవగాహనతోనే వారు కార్మికులను సంఘటిత పరచడానికి అలుపెరగకుండా శ్రమించారు. యుద్ధం యొక్క సామ్రాజ్యవాద స్వరూపాన్ని కార్మికులకు తెలియచేసారు. వారి రోజువారీ డిమాండ్లకు యుద్ధ వ్యతిరేక ప్రచారాన్ని జోడించి వారిలో చైతన్యాన్ని నింపే ప్రయత్నం చేసారు.

ఉదాహరణకి, ఇనుము, జౌళి, రైల్వేస్ కార్మికుల(1940) కిచ్చిన కమ్యూనిస్టు పార్టీ మేనిఫెస్టోలో ప్రభుత్వం డిమాండ్ చేసిన యుద్ధ చందాలకు, పెరుగుతున్న ధరల, ఎందుకూ చాలని వేతన డిమాండను జోడించి తద్వారా కార్మికులు యుద్ధ వ్యతిరేక పోరాటాలు చేయడానికి ఉత్సాహపరిచింది. ప్రభుత్వ గఅహ విభాగం కమ్యూనిస్టుల కార్యకలాపాల వ్యూహంలోని సామర్థ్యాన్ని గుర్తించింది. "కమ్యూనిస్టులు, తమతోపాటు సోషలిస్టులను, కార్మికులను, రైతులను కలుపుకుని ఒక ఉమ్మడి కార్యాచరణని రూపొందించి, అందరికి 25% వేతనాలు పెంచాలని, కరువు భఅతిని పెంచాలని, రైతులకు కవులు తగ్గించాలని, పన్నులు తగ్గించాలనే డిమాండ్లను పెట్టారు. వాటితో పాటు అనేక కేంద్రాలలో రాజకీయ సూచనలను కూడా కలిపారు. 'యుద్ధ వ్యతిరేక ప్రచారానికి కార్మికుల, రైతుల డిమాండ్లను చేర్చడం ప్రజలను విస్తఅతంగా సమీకరించడానికి ఉపయోగపడింది. 'ఈ ప్రణాళిక తమ సూచనలను ప్రజలలోకి తీసుకెళ్లేందుకు కమ్యూనిస్టు పార్టీకి ఉపయోగ పడింది' అని గఅహ విభాగం తమ రహస్య

(మిగతా 32వ పేజీలో)



epaper.prajasakti.com

## ఈ సంచికలో...

**1. సామ్రాజ్యవాద వ్యతిరేక యుద్ధం........** 2

**2. కోవిడ్19: ఆర్థికరంగంపై ప్రభావం**

వి.శ్రీధర్.............4

**3. పెట్టుబడి గుప్పిట్లో ప్రపంచ ప్రజారోగ్యం**

దడాల సుబ్బారావు .......... 7

**4. కరోనా వైరస్‌నుపయోగించుకుని మతవిద్వేష ప్రచారం**

హర్ష్ మందర్ ............ 12

**5. సింధు ప్రజల విస్తృత వాణిజ్యం**

ఎంవిఎస్ శర్మ ............ 15

**6. పేరుకే స్వదేశీ అంతా విదేశీనే**

ఎ కోటిరెడ్డి ............ 17

**7. ప్రపంచ కార్మికోద్యమ నిర్మాణంలో ఎంగెల్స్ పాత్ర**

ఎంసి వెంకటేశ్వర్లు ...... 22

**8. భారత దేశంలో సైద్ధాంతిక పోరాటం: ప్రత్యేకతలు**

దేవీప్రసాద్ చటోపాధ్యాయ ..... 25

**9. మార్క్సిస్టు అధ్యయన కేంద్రాల ప్రాధాన్యత**

తమ్మినేని వీరభద్రం .... 30

**సంపాదకుడు:**

**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**

**పాటూరు రామయ్య**

**బి.వి. రాఘవులు**

**తమ్మినేని వీరభద్రం**

**ఎస్. వీరయ్య**

**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**ఫోన్: ఎడిటర్ : 9490099333**
**మేనేజర్: కె.హరికిషోర్: 9490098977, 9494101091**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org

# కరోనా నేర్పుతున్న పాఠం

కరోనా మహమ్మారి పుట్టి అయిదు మాసాల్లోనే ప్రపంచమంతా వ్యాపించింది. ఇప్పటికి 35 లక్షల మందికి పైగా వ్యాధిబారిన పడ్డారు. రెండున్నర లక్షల మంది వరకు మరణించారు. 11.5 లక్షల మంది కోలుకోగా 21.6 లక్షల మంది ఇంకా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

ఈ మహమ్మారికి దేశాల మధ్య తారతమ్యం లేదు. కాని వ్యాధి కొన్ని దేశాల్లో తీవ్రంగా ప్రబలింది, మరికొన్ని దేశాల్లో కట్టడి చేయబడింది. కొన్ని దేశాల్లో అత్యధిక మరణాలు సంభవిస్తే కొన్ని దేశాలు మరణాల సంఖ్యను పరిమితం చేయగలిగాయి. ప్రపంచంలో కొమ్ములు తిరిగిన దేశాలుగా చెప్పబడుతున్న చాలా దేశాలు కరోనా ముందు కళ్లు తేలేశాయి. డాలర్ల స్వర్గంగా, ఆధునిక టెక్నాలజీకి ఆలవాలంగా చెప్పబడే అమెరికాలో కరోనా కల్లోలం సృష్టిస్తోంది. ప్రపంచంలోని మొత్తం కేసుల్లో మూడోవంతు అంటే సుమారు 12 లక్షలు ఈ అగ్రరాజ్యంలోనే ఉన్నాయి. కరోనా మరణాల్లో కూడా నాలుగోవంతు పైన, సుమారు 69 వేలు ఇక్కడే ఉన్నాయి. అభివృద్ధి చెందిన ఐరోపాలో సగం మంది కన్నా ఎక్కువ మృతులున్నారు. అక్కడ కూడా బాగా అభివృద్ధి చెందినట్లు చెబుతున్న బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, స్పెయిన్‌లలోనే కరోనా కేసులూ, మృతులూ అత్యధికం. కానీ అభివృద్ధిలో వెనుకబడినప్పటికీ అనేక దేశాలు నేడు కరోనాను కట్టడి చేయగలిగాయి. కరోనా మొదటి దెబ్బ తిన్న చైనా ఇంతలోనే సర్వ శక్తులూ కూడదీసుకుని దాని బారినుండి ప్రజలను రక్షించుకుంది. ఈరోజు చైనాలో కరోనాతో బాధపడుతున్న వారు కేవలం 481 మంది మాత్రమే అంటే పరిస్థితిని అది ఎంత సమర్ధవంతంగా ఎదుర్కొందో అర్థం చేసుకోవచ్చు.

అంతేకాదు కరోనా భారిన పడిన ధనిక దేశాలకు నేడు వర్ధమాన దేశాలే మందులు, వైద్యం ఇతరత్రా సహాయం అందించే పరిస్థితి నెలకొంది. అమెరికా ఒకవైపు అగ్రరాజ్య దురహంకారంతో చైనాపై విరుచుకుపడుతోంది. ఆంక్షలు పెడతానని బెదిరిస్తోంది. కరోనా చికిత్సకు ఉపయోగపడే హైడ్రోకోరోక్విన్ మాత్రలు తమకు పంపకపోతే ఆంక్షలు పెడతానని భారత దేశాన్ని బెదిరించింది. చైనా నుండి తమిళనాడుకు రావలసిన కరోనా కిట్లను దారికాచి దోచుకుపోయింది. క్యూబాపై దశాబ్దాలుగా అమెరికా అమలు చేస్తున్న ఆంక్షల సంగతి తెలిసిందే. అయినప్పటికీ ఈ దేశాలు తమ తమ దేశాల్లో కరోనాతో పోరాడుతూనే మానవతా దృష్టితో అమెరికాకూ, యూరప్‌కూ మందులు, వైద్య పరికరాలు పంపుతున్నాయి. క్యూబా అనేక దేశాలకు వైద్యులను పంపుతోంది.

ఎందుకిలా జరుగుతోంది? ప్రపంచీకరణ పేరుతో ఏ దేశాలయితే ఇతర రంగాలతోబాటు కీలకమైన వైద్య రంగాన్ని ప్రయివేటీకరించాయో ఆ దేశాలు కరోనా కట్టడిలో విఫలమయినాయి. విశేషమేమిటంటే ప్రయివేటీకరణ ఏ మేరకు జరిగితే ఆ మేరకు వైఫల్యం కనిపిస్తోంది. గొప్పగా ప్రచారం చేసుకునే ప్రయివేటు వైద్యం కరోనా మహమ్మారి వ్యాపించిన కీలక సమయంలో అజాపజా లేకుండా పోయింది. అమెరికాలో వైద్యం మొత్తం ప్రయివేటీకరించబడింది. అందువల్ల ఎంత టెక్నాలజీ ఉన్నా, డబ్బు ఉన్నా అది కరోనాను ఎదుర్కోవడంలో అది విఫలమయింది. ఐరోపాలో వైద్యం ప్రభుత్వ రంగంలో ఉన్న స్కాండినేవియన్ దేశాలు కరోనాను ఎదుర్కోగలిగాయి. కానీ ప్రయివేటు వైద్యాన్ని నమ్ముకున్న బాగా అభివృద్ధి చెందిన ఐరోపా దేశాలు అమెరికాలాగే చతికిలబడ్డాయి. చివరికి స్పెయిన్ ప్రభుత్వం కరోనాపై కట్టడి కోసం ఆ దేశంలోని ప్రయివేటు వైద్యాన్ని జాతీయీకరించాల్సి వచ్చింది. మన దేశంలో కూడా కరోనాపై పోరాటంలో ఘనత వహించిన కార్పొరేట్ వైద్యం చేతులెత్తేసింది. ప్రభుత్వ వైద్యమే నేడు ఈ మహమ్మారితో పోరాడుతోంది. క్యూబా, వియత్నాం, చైనా వంటి ప్రజా ప్రభుత్వాలున్న దేశాల్లో ప్రభుత్వాలు అన్ని వనరులనూ ప్రజాప్రయోజనాలకోసం సమీకరించడం ద్వారా ప్రజలకు రక్షణ కల్పించగలుగుతున్నాయి.

అందువల్ల ప్రపంచీకరణ విధానాలు విఫలమైనాయని కరోనా మహమ్మారి మనకు పాఠం నేర్పుతోంది. ఈ విధానాలు ప్రపంచాన్ని తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టాయి. ప్రపంచీకరణ విధానాలను ఓడించడం ద్వారా మాత్రమే కరోనా నుండీ, దాని దుష్ఫలితాలనుండీ మనం బయటపడగలం.

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.10,** సంవత్సర చందా: **రూ.100,** పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**



epaper.prajasakti.com

# కోవిడ్19: ఆర్థికరంగంపై ప్రభావం

వి.శ్రీధర్

ప్రపంచ ఆర్థికవ్యవస్థ గతంలో ఏనాడూ కనీవిని ఎరుగని 'గిరాకీ' పతనం దిశగా పయనిస్తున్నది. అనేక మితవాద ప్రభు త్వాలు ద్రవ్య వినిమయాన్ని భారీగా పెంచేందుకు ప్రయత్నిస్తున్నాయి. కానీ ప్రధాని నరేంద్రమోడి నేతృత్వంలోని భారత్ మాత్రం ద్రవ్య వినిమయంలో ప్రపంచ బ్యాంకు లక్ష్మణరేఖను దాటనంటున్నది.

మానవాళి జీవితాలు, జీవనాలపై కరోనా మహమ్మారి అసాధారణమైన దాడి చేస్తున్నది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను మాంద్యంలోకి నెట్టేస్తున్నది. దాని తీవ్రత 1930ల నాటి మహా సంక్షోభాన్ని తలపిస్తున్నది. ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవటంలో భారతదేశం వైఖరి భిన్నంగా వుంది. ప్రపంచీకరణపై విజయగీతాలు ఆలపించిన అనేక బడా ఆర్థికవ్యవస్థల నాయకత్వాలు సహితం ఎంతోకొంత చొరవతో మార్పు చేసుకుంటు న్నాయి. తమ దేశ అవసరాలకు అనుగుణంగా తమ ద్రవ్య విధానాన్ని విస్తరించుకుంటున్నాయి. అమెరికా, బ్రిటన్, ఇటలీ, జర్మనీ, జపాన్, సింగపూర్, ఆస్ట్రేలియా,యూరోపియన్ యూని యన్‌లు ఆ మార్గంలోనే వున్నాయి. ప్రమాదాన్ని ఎతుర్కొనేందుకు గణనీయంగా తమ ద్రవ్య విధానంలో మార్పులు ప్రకటిస్తున్నాయి. తమ సాంప్రదాయ వైఖరులకు భిన్నంగా చర్యలు చేపడుతున్నాయి. భారీగా నిధులను కేటాయిస్తున్నాయి. కానీ ప్రధాని మోడీ నాయకత్వంలోని భారతదేశం మాత్రం అలాంటి చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా లేదు. పైగా అలాంటి ప్రతిపాదనలను దృఢంగా వ్యతిరేకిస్తున్నది.

కరోనా వైరస్ గురించి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలపై దాని ప్రభావం గురించి అంచనా వేయటంలోనే పెద్ద అనిశ్చితస్థితి నెలకొని వుందనేది వాస్తవం. ఉత్పత్తులు, వుపాధులు, జీవితాలు, ప్రజా వైద్యంపై దాని ప్రభావమేమిటో ఇప్పటికి ఎవరికీ తెలియదు. కానీ సరఫరా గొలుసులు తెగిపోతాయని, ఫలితంగా ప్రపంచ వుత్పత్తి సామర్థ్యం తీవ్రంగా గాడితప్పుదతుందని అందరూ ఆమోదిస్తారు. ప్రజలు, ప్రభుత్వాల వ్యయ ప్రాధాన్యతలు మారిపోతాయని, ఏదో విధమైన లాక్‌డౌన్‌లకు ప్రపంచవ్యాపితంగా ప్రజలు అలవాటు పడతారనికూడా అందరూ అంగీకరిస్తారు. చైనాదేశపు ఈ సంత్సరం తొలి త్రైమాసికపు జాతీయ స్థూల ఆదాయం 40శాతం వరకూ తగ్గవచ్చని జెపి మోర్గాన్ సంస్థ తాజా అంచనాలు తెల్పుతున్నాయి. అమెరికాలో రెండవ త్రైమాసికపు జాతీయ స్థూల ఆదాయంలో 14 శాతం తగ్గిపోవచ్చని అదే సంస్థ అంచనా వేస్తున్నది. యూరపు ఆర్థిక వ్యవస్థలో 25 శాతం తరుగుదల వుండవచ్చు. కరోనా మహమ్మారి ప్రభావిత కేంద్రం చైనా నుండి ఇటలీ, స్పెయిన్, జర్మనీ, అమెరికా, బ్రిటన్ (పశ్చిమానికి)ల వైపు మారేకొద్దీ ఆర్థికరంగంపై దాని ప్రభావం మనకు అర్థమౌతుంది. ఆనాటికి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మహా సంక్షోభపు సుడిగుండం అంచులకు చేరుతుంది. దీనితో పోలిస్తే ఒక దశాబ్ద కాలంగా వెంటాడుతున్న ప్రపంచ ఆర్థిక సంక్షోభం చాలా అల్పమైనదిగా గమనించగలం. గిరాకీ పడిపోతుంది. సరఫరా గొలుసులు ఛిద్రమౌతాయి. పెరుగు తున్న వైద్య అవసరాలకు అనుగుణంగా జాతీయ ప్రాధాన్యతలు గణనీయంగా మారతాయి. పై పరిణామాల మూలంగా పలు ప్రధాన ఆర్థిక వ్యవస్థల ఎగుమతులు తీవ్రంగా తగ్గిపోతున్న తీరు కొది కాలంలోనే స్పష్టమౌతుంది.

### కుంగిపోతున్న గిరాకి

భారత ఆర్థిక వ్యవస్థ ఈపాటికే మందగమనంలో కొనసాగుతున్నది. అది రెండు కారణాల మూలంగా తీవ్రమైన దాడులకు గురికావచ్చు. మొదటిది. దేశంలో ఆందోళనకరమైన స్థాయిలో 'గిరాకి"పడిపోతున్నట్టు అనేక ఆధారాలు వున్నాయి. అయినప్పటికీ, మోడీ ప్రభుత్వం ఆ వాస్తవాన్ని గట్టిగా తిరస్కరిస్తున్నది. పైగా దాన్నొక సైద్ధాంతికంగా నమ్మదగని సమస్యగా కొట్టిపారేస్తున్నది. దేశంలో కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు ప్రజలు భౌతికదూరం పాటిస్తున్నారు. లాక్ డౌన్ అమలుతో ఇళ్లకే పరిమితమై ఒంటరి జీవితాలకు పరిమితమౌతున్నారు. ఈ పరిస్థితుల్లో ఆర్థికవ్యవస్థ తీవ్రమైన వత్తిడికిలోనయ్యే అవకాశం వుంది. ఉదాహరణకు, ఈ పాటికే అమలౌతున్నట్లు చెప్పబడుతున్న 'ఇంటి -నుండే- పని' విధానానికి అనేక పరిమితులున్నాయి. ఆ పద్ధతి కేవలం సంఘటిత సంస్థలకు మాత్రమే పరిమితం. ఇదే పరిస్థితి ఎక్కువకాలం కొనసాగితే అనేక వ్యాపారాలు దీర్ఘకాలం మనలేవు. అనేకం శాశ్వితంగా మూతబడే ప్రమాదం వుంది. 2016 నోట్ల రద్దు, సంవత్సరం తరువాత జియస్‌టిల అమలుతో అలాంటి వినాశకర పరిస్థితినే మనం చూశాం. ఆకస్మికంగా, బలవంతంగా మూసివేయబడిన అనేక చిన్న, అసంఘటిత వ్యాపారాలు, సంస్థలు తిరిగి కోలుకుని ఆర్థిక వ్యవస్థలోకి ఎగబాకలేవు. ఈ క్రమంలో అనేక సంస్థలు వుత్పత్తులకు, సేవలకు గిరాకీ మరింతగా దిగజారవచ్చు.

ఇలాంటి సమస్య కేవలం చిన్న లేదా అసంఘటిత వ్యాపారాలు, సంస్థలకే పరిమితమౌతుందని భావించటం సరికాదు. ఉదాహరణకు భారత రైల్వే విభాగం మార్చి 16తర్వాత 155 జతల రైళ్లను రద్దుచేసింది అంతకు ఒక వారం ముందు కంటే ప్రయాణీకుల సంఖ్య 55శాతం తగ్గింది. ఈ కాలంలో ఆదాయాలు 50శాతం తగ్గాయి. అప్పటికే దీర్ఘకాలంగా మంచానపడ్డ ఆటోమొబైల్ రంగం కరోనా దెబ్బతో తిరిగి కోలుకుంటుందన్న ఆశ కల్గటం లేదు. పూనా, జంషెడ్‌పూర్‌లలో టాటా మోటార్స్ విడిభాగాల సరఫరాదారుడు ' ఫ్రంట్ లైన్ ' పత్రిక బాధ్యులతో ఇలా చెప్పాడు: "లాక్ డౌన్ అమలుతో నా వ్యాపారం పూర్తిగా మూతబడింది. లాక్‌డౌన్ ఎత్తేశాక ఆరు నెలల్లో వ్యాపారం కోలుకుంటుందని ఆశిస్తున్నాను. కానీ అదెప్పుడు జరుగుతుందో ఇప్పుడే చెప్పలేను."

ఉత్పత్తి సామర్థ్యం రీత్యా అత్యధిక భారత సంఘటిత పరిశ్రమలు భారీ పరిశ్రమల లక్షణాలు కలిగివున్నట్లు పైకి కన్పిస్తాయి. కానీ



epaper.prajasakti.com

కార్మికుల వినియోగం, వేతనాలు చెల్లింపుల కోణంలో పరిశీలిస్తే వాస్తవంగా అవి చిన్న అసంఘటిత పరిశ్రమల కోవలోకే వస్తాయి. అందుకే ఆటోరంగంలోని అత్యధిక కార్మికులు తాత్కాలిక కార్మికులుగానే బతుకులీడుస్తున్నారు. ఉద్యోగంచేసే కాలంలో వారికి ఎలాంటి రక్షణలు, ప్రయోజనాలు వుండవు. ఒక వేళవున్నా అవి నామమాత్రమే. కరోనా విస్తరించి, చొచ్చుకుపోయేకొద్దీ దినసరి కార్మికుల్లో అత్యధికులు తమ వుపాధులు కోల్పోతారు. వెన్వెంటనే బలిపీఠం ఎక్కబోయేది అసంఘటిత వృత్తుల్లో పనిచేస్తున్న కార్మికులే. పట్టణ ప్రాంతాల్లో వందలాది సేవలందిస్తూ బతుకు బండి లాగిస్తున్నవారు అనేకులున్నారు. ఇంటి పనివారు, క్షురకులు, రిక్షాలు లాగేవారు, వాచ్‌మెన్‌లు, డ్రైవర్లు వంటి వారందరికీ లాక్‌డౌన్ ఒక మరణ శాసనం వంటిది. ఈ పోటీ ఆర్థికవ్యవస్థలో అమెజాన్ వంటి బహుళజాతి కంపెనీల్లో డెలివరి ఏజంట్లుగా పనిచేస్తున్న శ్రామికులందరి భవిష్యత్ కూడా ఇలాగే వుండబోతున్నది. ఇలాంటి గౌరవ ప్రదమైన జీవనాధార వృత్తులు ఎలాంటి రక్షణలకూ నోచుకోలేదు. లాక్‌డౌన్ కాలంలో భారతీయులు అందరూ ఇళ్లలోనే వుండాలని, మూతబడిన సంస్థల్లోని కార్మికులందరికీ యజమానులు వేతనాలు చెల్లింపులను కొనసాగించాలని ప్రధాని మోడీ విజ్ఞప్తులు ఆ ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పులనూ తేజాలవు.

మరొక ముఖ్యమైన అంశం. సంక్షోభం వల్ల ఆర్థిక వ్యవస్థ సరఫరా గొలుసులు విస్తారంగా స్థానభ్రంశం చెందుతాయి. వస్త్రాలువంటి ఎగుమతి ఆధారిత పరిశ్రమలు గిరాకీ పడిపోయి తీవ్ర ఇబ్బందుల పాలౌతాయి. ఈ పరిణామం గొలుసుకట్టు ప్రతిచర్యలకు, మొత్తం సరఫరా గొలుసు విచ్ఛిన్నానికి దారితీయవచ్చు. ఉదాహరణకు వస్త్ర పరిశ్రమ సంక్షోభంతో నూలు, అద్దకం వగైరా పరిశ్రమలు మూతపడవచ్చు. దేశ వ్యాపితంగా విడిభాగాలు, ముడిసరుకుల సరఫరాదారులపై ఆధారపడి నడుస్తున్న మిషన్ పరికరాల పరిశ్రమలు ఘోరంగా దెబ్బతినవచ్చు. అలాంటి పరిశ్రమల్లో గిరాకి పెరిగిన సూచనలున్నప్పటికీ, తక్కువ వ్యవధిలో వాటిని పునరుద్ధరించటం కష్ట సాధ్యమౌతుంది.

### భౌతిక దూరంతోనే సమస్య పరిష్కారం కాదు

భౌతికదూరంతోనే సర్వం పరిష్కా రం కాదు. మానవత్వంతో కూడిన పరిష్కారాలు చూపకుండా, ఏవిధమైన లాక్‌డౌన్‌నూ అమలు చేయటం సాధ్యంకాదు. లాక్‌డౌన్ అనేది పూర్తిగా తాత్కాలికమైన చర్య మాత్రమే. అందుకే అత్యంత బలహీనులు/నిర్భాగ్యుల పట్ల రెండు అంశాల్లో శ్రద్ధ తీసుకోవాల్సివుంది : వారికి ఆదాయ మద్దతు సమకూర్చే చర్యలు చేపట్టాలి. కనీస జీవనానికి అవసరమైన నిత్యావసర సరకులు అందుతాయన్న భరోసా కల్పించాలి. ఈ రెండు అంశాలూ సంపూర్ణంగా ఆచరణ సాధ్యమైనవే. దేశంలోని పౌరుల బ్యాంకు ఖాతాలను గురించి ప్రధాని మోడి ప్రభుత్వానికి ఈపాటికే విస్తారమైన సమాచారం వుంది. ఆ ఖాతాల్లోకి కొంత నగదును జమచేసేందుకు పెద్ద ఆటంకాలేమీ వుండవు. కేంద్ర ప్రభుత్వం సార్క్ దేశాల అగ్రనేతలతో సంప్రదింపులతో తలమునకలౌతున్నారు. అంతకంటే రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సంప్రదింపులు జరిపివుంటే ఎంతో వుపయోగకరంగా వుండేది. అలాచేయటం ద్వారా ఒక ఆచరణాత్మక ప్రణాళిక తయారయి వుండేది. కేంద్ర, రాష్ట్రాల మధ్య సమన్వయం, పరస్పర సహకారం మెరుగుపడి వుండేవి. పైన తెల్పిన రెండు లక్ష్యాలు సాధించబడేవి.

> **❝ ఉత్పత్తి సామర్థ్యం రీత్యా అత్యధిక భారత సంఘటిత పరిశ్రమలు భారీ పరిశ్రమల లక్షణాలు కలిగివున్నట్లు పైకి కన్పిస్తాయి. కానీ కార్మికుల వినియోగం, వేతనాలు చెల్లింపుల కోణంలో పరిశీలిస్తే వాస్తవంగా అవి చిన్న అసంఘటిత పరిశ్రమల కోవలోకే వస్తాయి. అందుకే ఆటోరంగంలోని అత్యధిక కార్మికులు తాత్కాలిక కార్మికులుగానే బతుకులీడుస్తున్నారు. ఉద్యోగంచేసే కాలంలో వారికి ఎలాంటి రక్షణలు, ప్రయోజనాలు వుండవు. ఒక వేళవున్నా అవి నామమాత్రమే. ❞**

### కేరళ వుదాహరణ

మార్చి 19న ప్రధానిమోడి దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. అంతకు కొద్ది ముందుగా కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రకటన వెలువడింది. మోడీ శ్రద్ధ పెట్టివుంటే విజయన్ ప్రకటనలోని పూర్తిగా భిన్నమైన విధానాన్ని గమనించగల్గేవాడు. తమ రాష్ట్రంలో కరోనా మహమ్మారిని ఎదుర్కొనేందుకు కేరళ ప్రభుత్వం రు.20,000కోట్ల మొత్తాన్ని కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. అది కేవలం ప్రజల ఆదాయాలకు అండగా నిల్చేందుకు మాత్రమే కాదు. ఈ అత్యవసర పరిస్థితిలో తమ పౌరుల వైద్యం, ఆహారం, పలు రకాల వస్తు సరఫరాలకు భరోసానిస్తూ ఆ మొత్తం కేటాయించబడింది. ఆర్థికంగా వెనుకబడిన రాష్ట్రమైన ఒరిస్సా ప్రభుత్వం కూడా లాక్‌డౌన్‌లో ఇబ్బంది పడుతున్న తన ప్రజలకు ఆదాయపరమైన మద్దతును సమకూర్చేందుకు, అత్యవసర సేవలను అందించేందుకు భరోసానిస్తూ తగు మొత్తాన్ని కేటాయించింది.

ప్రపంచ వ్యాపితంగా అనేక దేశాలు కరోనాను ఎదుర్కొనటంలో ద్రవ్యపరమైన చర్యలను ప్రధాన ఆయుధంగా చేపట్టాయని స్పష్టమౌతున్నది. అందుకు అతి తీవ్రమైన మితవాద ప్రభుత్వాలు కూడా మినహాయింపు కాదు. ఇంగ్లండు వంటి పలు దేశాలు తమ ప్యాకేజి పరిమాణాన్ని వుదారంగా పెంచాయి. తన ప్రజలకు భరోసా కల్పించే మోతాదులో ద్రవ్య ప్యాకేజిని కేటాయించేందుకు సమ్మతించక పోవటం, అందులోనూ ఆర్థికంగా అత్యంత బలహీనులను ఆదుకునేందుకు తగు మొత్తాలను కేటాయించకపోవటం బాధ్యతా రాహిత్యమే కాదు. పరిస్థితులు చేసిందేమిటి ? ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో సహాయ ప్యాకేజిని గురించి పరిశీలించేందుకు ఒక టాస్క్ ఫోర్సును నియమిస్తున్నట్లు మన ప్రధాని మోడి ప్రకటన మాత్రమే చేశారు.

చిన్నస్థాయి సంస్థల రుణాలను, మొండి బకాయిల (యన్‌పిఎ)వర్గీకరణ నియమాలను గణనీయంగా సడలింపబడను న్నట్లు సంకేతాలున్నాయి. కరోనా బాధిత పేద లకు ఆదాయపరమైన మద్దతును అందించేం దుకు నేరుగా నగదు అందించను న్నట్లు వూహాగానాలున్నాయి. చివరలో ప్రస్తావిం చిన అంశం అనేక వంచనలతో కూడి వుంటు ంది. ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో వేలాది పేదల అనుభవాలను మనం గమనం లోకి తీసుకోవాలి. వారిలో అనేక మంది ఆధార్‌కార్డు ద్వారా తమ గుర్తింపును నిరూపించుకోలేక పోతున్నారు. ప్రధానమంత్రి కిసాన్ పథకం అనుభవం అంతకంటే సమస్యాత్మకంగా వుంది. అనేక మంది లబ్దిదారులు తమకోసం వాగ్దానం చేయబడిన మొత్తాలను పొందలేక పోతున్నారు. ప్రస్తుతం నడుస్తున్న కరోనా వంటి అత్యవసర పరిస్థితుల్లో మోడీ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలను భాగస్వాములను చేసివుండవలసింది. వాస్తవంగా బాధితులకు అవసరమైన సరఫరాలను, సేవలను, మద్దతును రాష్ట్ర ప్రభుత్వాలే మెరుగ్గా అందించగల స్థితిలో వున్నాయి.

కరోనా బాధితులకు ప్రభుత్వం



epaper.prajasakti.com

**"కరోనా క్రమంగా విస్తరిస్తూ, సమాజంలో వేళ్లూను కొనే కొద్దీ మహమ్మారి మన దేశంలో 3వ దశకు చేరు కుంటుంది. ఆ దశలో భారతదేశం అతి పెద్ద ప్రమాదానికి లోనౌతుంది. దిగ్భ్రాంతికి గురౌతుంది. అపుడు తగినన్ని ఆసుపత్రి పడకలు, వెంటిలేటర్లు, ఐసియు సౌకర్యాలు అందుబాటులోకి రావాలి. అంటే అపుడు వున్నత స్థాయి వైద్యం అందుబాటులోకి తేవటం అత్యంత కీలకమౌతుంది."**

అందించదలచిన సహాయచర్యలు అవసరాలకు తగినంతగా లేవు. ఉదాహరణకు, రుణాలు చెల్లింపులను వాయిదా వేయటం ద్వారా మూతబడిన చిన్న సంస్థల యాజమాన్యాలు తిరిగి వాటిని పునరుద్ధరించేందుకు వూతమిచ్చే విగా లేవు. గిరాకి పడిపోతున్న నేపధ్యంలో అమల్లోవున్న ద్రవ్య విధానం ద్వారా వడ్డీ చెల్లింపుల్లో కోతలుగాని, బ్యాంకు నియమావళిని సడలించటం ద్వారా రుణ చెల్లింపుల నియమాల సడలింపులుగానీ చిన్న సంస్థలను బతికించలేవు. గిరాకీని పెంచాలంటే ఆదాయాలను పెంచే చర్యలను చేపట్టాలి. ఉదాహరణకు, మహాత్మా గాంధి గ్రామీణ వుపాధి హామి పథకం గిరాకీని పెంచుతుంది. తగినంత పని కల్పించగల్గితే ఈ సంక్షోభ కాలంలోనూ ప్రజల కొనుగోలుశక్తిని పెంచి గిరాకీని నిలబెట్టగలదు. అదేవిధంగా ప్రస్తుతం పారామెడికల్ సిబ్బంది, వైద్య నిపుణుల నియామకాల కోసం చేసిన ఆరోగ్య పథకాల వ్యయం కూడా అలాంటి ఫలితాలనే సాధిస్తుంది. అందుకు కావలసింది కూసింత వూహాశక్తి. పేదల జీవనాల స్వభావంపట్ల అవసరమైన శ్రద్ధ చూపటం, తీవ్రంగా నష్టపోయిన బాధితులకు వుపశమనం కల్పించేందుకు కొంత సానుభూతితో వ్యవహరించటం చేయాలి. ఈ విధానం పూర్తిగా లోపరహితం కాదు. సరైన ప్రాధాన్యతలను ఎంపిక చేసుకోవటం ద్వారా లోపాలను తగ్గించుకోవచ్చు. ఈ పరిస్థితుల్లో అదనంగా ఎంతో కొంత చేయాలన్న ప్రయత్నంలో వున్న ప్రభుత్వాలను ఎవరూ నిందించలేరు.

**చైనా గురించి**

కోవిడ్ 19ని చైనా కట్టడిచేస్తున్న విధానాల నుండి మన పాలకులు ఎలాంటి అనుభవాలను నేర్చుకుంటున్న సూచనలేవీ కన్పించటం లేదు. వైరస్‌వల్ల మొదట దెబ్బతిన్నది చైనా ఆర్థికవ్యవస్థ. అయినప్పటికీ మహమ్మారిని కేవలం దేశంలోని ఒక్క ప్రావిన్స్‌కే కట్టడి చేయగల్గారు. అంతేగాక, గిరాకిని పునరుద్ధరించేందుకు వీలుగా నిధుల కేటాయింపులను భారీగా పెంచారు. వారు ద్రవ్యపరమైన చర్యలపైనే ప్రధానంగా ఆధారపడ్డారు. ఈ వ్యూహం అమలు కోసం 394 బిలియన్ డాలర్ల (షుమారుగా రు.29.94 లక్షల కోట్లు) విలువైన స్థానిక ప్రభుత్వ బాండ్లను జారీచేశారు. బాహ్య వాతావరణం వెన్వెంటనే సహకరించే అవకాశం లేదని వారు గమనించారు. అందుకే అంతర్గత గిరాకిని పునరుద్ధరించేందుకే వారు ప్రాధాన్యత యిస్తున్నట్లు అర్థమౌతున్నది.

'మేకిన్ ఇండియా'(భారత్‌లో సరు కుల ఉత్పత్తి )కి అతిగా ప్రచారం చేస్తున్నారు. ప్రపంచ మార్కెట్ల కోసం వుద్దేశించిన 'వుత్పత్తి' కోసమే ఆ విధానం రూపొందించబడింది. పలు వైరుధ్యాలవల్ల ఈ పథకం జటిలంగా మారి ంది. దాని అమలుపై ఎలాంటి ఆశలకూ అవకాశం లేదు. కుప్పకూలిపోతున్న స్థానిక 'గిరాకీ'ని కనీసం పరిగణనలోకి తీసుకునేందుకు కూడా మోడీ ప్రభుత్వం సిద్ధంగా లేదు. ఆ పరిస్థితిని పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలే లేవు. భారత్ ప్రమాదపు అంచులకు చేరినట్లు ఖరారయ్యింది.

**మౌనమే ఆభరణంగా మోడి ప్రసంగం**

ఆరోగ్య సంక్షోభాన్ని ధైర్యంగా, స్థైర్యంగా ఎదుర్కొనేందుకు దేశ ప్రజలందరూ సిద్ధం కావాలంటూ మోడి టెలివిజన్ వుపన్యా సం భారతీయుల హృదయాలను హత్తుకుంది. ఆయన తన ప్రసంగంలో అత్యంత ప్రాధాన్యత గల ఒక అంశాన్ని చెప్పకుండా వదిలేశాడు. ఈ భయానక వైరస్ నుండి భారత్ తప్పించుకోజాలదన్న వాస్తవం అంతకు అనేక వారాల ముందే మోడి ప్రభుత్వానికి తెలుసు. ఈ కాలమంతా తన ప్రభుత్వం ఏం చేస్తున్నదన్న అంశాన్ని ఆయన తన ప్రసంగంలో ప్రస్తావించలేదు. ఎందుకు ? ఉదాహరణకు వ్యాధి ప్రమాదం గురించి ప్రజలకు తెలియజెప్పి జాగృతం చేసేందుకు, భారత ప్రభుత్వం ఒక పారదర్శకమైన వ్యాధి నిర్ధారణ పరీక్షల వ్యవస్థను ఎందుకు నెలకొల్పలేదు ? అలా చెయ్యటం చాలా ఖరీదైన అంశంగా ఈ ప్రభుత్వాన్ని బలపరిచేవారు తొందరపాటుతో వాదిస్తున్నారు. ఆ పరీక్షల ఖరీదు ఒక రోగికి రు.2000లు అవుతుందని గత అనుభవం చెబుతున్నది. ఒక కోటి భారతీయులను పరీక్షించేందుకు రు. 2000 కోట్లు ఖర్చవుతుంది. భారీ ఆర్డరు పెడితే బహుశా అంతకంటే చాలా తక్కువకు రావచ్చు. అలాంటి పరీక్షల వ్యవస్థను నెలకొల్పేందుకు మోడీ ప్రభుత్వం సంసిద్ధతను వ్యక్తం చేయటంలేదు. కానీ రు.12000ల కోట్లు సహాయ ప్యాకేజి ఇవ్వాలన్న ప్రైవేటు విమానయాన సంస్థల యాజమాన్యాల విజ్ఞాపన పట్ల ప్రభుత్వం స్పందన సానుకూలంగా వుంది.

కరోనా క్రమంగా విస్తరిస్తూ, సమాజంలో వేళ్లూనుకొనే కొద్దీ మహమ్మారి మన దేశంలో 3వ దశకు చేరుకుంటుంది. ఆ దశలో భారతదేశం అతి పెద్ద ప్రమాదానికి లోనౌతుంది. దిగ్భ్రాంతికి గురౌతుంది. అపుడు తగినన్ని ఆసుపత్రి పడకలు, వెంటిలేటర్లు, ఐసియు సౌకర్యాలు అందుబాటులోకి రావాలి. అంటే అపుడు వున్నత స్థాయి వైద్యం అందుబాటులోకి తేవటం అత్యంత కీలకమౌతుంది.

'అదృష్టం' పైనే అంతిమ భారంవేసి కరోనా మహమ్మారిని అధిగమించవచ్చని మోడీ ప్రభుత్వం ఆశిస్తున్నట్లు అర్థమౌతున్నది. వ్యాధి 3వ స్థాయికి చేరితే మన ఆర్థికవ్యవస్థ, మన ప్రజలు గరిష్ట మూల్యాన్ని చెల్లించుకోవలసి వస్తుంది. ఊహించని అలాంటి పరిస్థితి ఎదురైతే మన దేశంలో 'గిరాకీ' వేగంగా దిగజారుతుంది. ఉత్పత్తి, సరఫరా నిర్మాణాలు, గొలుసులు తిరిగి కోలుకోవటం అసాధ్యమన్న స్థాయిలో గాడి తప్పుతాయి.

గత అనేక మాసాల అనుభవాలను పరిశీలించుకుంటే ప్రభుత్వ పెద్దలు ఖజానాపై అధిక భారం మోపుతూ 'ప్రత్యేక సహాయ ప్యాకేజిలు' అందించారు. ఈ కరోనా కష్ట కాలంలో కూడా అదే నమూనా సహాయక చర్యలు అమలు కావచ్చు. సంపన్నులు చెల్లించాల్సిన పన్నులను గణనీయంగా తగ్గించారు. టెలికా ం పరిశ్రమల చక్రవర్తులు రాయితీల కోసం ఈపాటికే క్యూలు కట్టారు. తరవాత విమానయాన మారాజుల వంతు కావచ్చు. ఇలాంటి ఎందరో అస్మదీయులు 'కరోనా నామస్మరణతో' సహాయం కోసం క్యూ కడతారు. నోట్లరద్దు , జియస్‌టి అమలు కాలాల్లో సాధారణ భారతీయులను మన పాలకులు విచక్షణా రహితమైన అవమానాలకు, నిర్లక్ష్యానికి గురిచేశారు. కోట్లాది వైరస్ బాధితులు కూడా అదేవిధమైన దుస్థితిని ఎదుర్కోబోతున్నారు.

**(అనువాదం: వై సిద్ధయ్య)**




epaper.prajasakti.com

వైద్యరంగం

# పెట్టుబడి గుప్పిట్లో ప్రపంచ ప్రజారోగ్యం

కీ.శే డా॥ వై రాధాకృష్ణ మూర్తి

(2010 ఏప్రిల్‌లో రాసిన వ్యాసం)



రుడోల్ఫ్ విర్‌షెవ్ (1831–1902) అనే ఆయన 19వ శతాబ్దపు ప్రఖ్యాత వైద్యశాస్త్రవేత్త. పెథాలజీలో ఆయన అనేక ఆవిష్కరణలు చేశారు. విర్‌షెవ్ సెల్, విర్‌షెవ్ యాంగిల్, విర్‌షెవ్ నోడ్ – తెలియని వైద్యుడు ఉండడు.

1848 యూరప్‌లో కార్మిక విప్లవాల కాలం. కమ్యూనిస్టు మ్యానిఫెస్టో విడుదలైన కాలం. విరషెవ్ రాజకీయ అభిప్రాయాలు, కార్యకలాపాలకు గాను జర్మన్ పాలకుడు బిస్మార్క్ ఆయనను 8 సంవత్సరాలు బెర్లిన్ నుండి బహిష్కరించాడు. తిరిగి వచ్చిన తర్వాత వెర్‌షెవ్ అనేక వైద్య శాస్త్ర సంబంధ ఆవిష్కరణలు చేశాడు. బెర్లిన్ కౌన్సిల్‌లోనూ, జర్మన్ రీచ్‌స్టాగ్ (పార్లమెంట్)లోనూ 1880–83 మధ్య సభ్యుడిగా ఉన్నాడు. అనేక వైద్యశాస్త్ర గ్రంథాలు రాయడంతోపాటు "సోషల్ మెడిసన్" అనే కొత్త ఆలోచనలకు రూపకల్పన చేశాడు.

వైద్యం గురించి ఆయన చెప్పిన మాటలివి: "వైద్యం ఒక సామాజిక శాస్త్రం. అత్యంత విస్తృతస్థాయిలో–వైద్యమే–రాజకీయం. వైద్యం ఒక మానవీయ శాస్త్రంగా – సమస్యల్ని గుర్తించాలి. పరిష్కారాన్ని సూచించాలి. వైద్యులు పేద ప్రజల అటార్నీలు. సామాజిక సమస్యలు ఎక్కువగా వారి పరిధిలోనే ఉంటాయి."

చాలా దేశాలలో ఎన్నో సదుద్దేశాలతో ప్రారంభమైన ప్రజారోగ్య వ్యవస్థలు కాలక్రమేణా పెట్టుబడి గుప్పిట్లో చిక్కుకుని సాధారణ ప్రజలకు అందని చందమామలై పోతున్నాయి. ఇది అత్యంత సంపన్నవంతమైన దేశాల నుండి అతి పేద దేశాల వరకు సాగుతున్న గత కొద్ది దశాబ్దాల విపరీత పరిణామం.

**పెట్టుబడి ముట్టడిలో ఒబామా**

ముందు అమెరికానే తీసుకుందాం. ఆ దేశంలో మొదటినుండీ ప్రైవేటు శక్తుల చేతుల్లోనే వైద్య వ్యవస్థ ఉంది. కాని ప్రజల నుండి వస్తున్న ఒత్తిడి ఫలితంగా 1965లో చాలా ముఖ్యమైన రెండు మార్పులు తీసుకువచ్చారు. మొదటిది: 'మెడికేర్' పథకం. 65 సంవత్సరాలు నిండిన ప్రతి వ్యక్తికీ – పూర్తి వైద్య సౌకర్యం ప్రభుత్వ ఖర్చుతో ఇచ్చే గ్యారంటీ ఇది. రెండవది : 'మెడికెయిడ్': ఆర్థికంగా బలహీనవర్గాలకు బీమా ద్వారా తగినంత ఉచిత వైద్య సేవలందించే పథకం. వీటితో గణనీయమైన సంఖ్యలో ప్రజలకు ఊరట లభించింది. అయినా కొన్ని బృహత్ సమస్యలు ఆ దేశ వైద్యరంగాన్ని పట్టి పీడిస్తున్నాయి.

ఒకటి: దేశ జనాభా 30 కోట్లు అయితే 5 కోట్ల మందికి ఏ బీమా రక్షణా లేదు. జబ్బు చేస్తే – వారి గత అధోగతే. రెండు: ఉన్నవన్నీ ప్రైవేటు బీమా కంపెనీలే. వాటి లీలలు చెప్పటానికి వీలులేదు. అవి ప్రీమియం రేట్లు విపరీతంగా పెంచివేస్తున్నాయి. మధ్యతరగతికి అందుబాటులో ఉండటం లేదు. అన్ని జబ్బుల్ని కవర్ చేయవు. అంతకుముందు ఏదైనా జబ్బు ఉంటే – బీమా ఇవ్వవు. ఇచ్చినా తీరా చెల్లింపుల దగ్గరకు వచ్చేసరికి ఎన్నో మడతపేచీలు పెడతాయి. మూడు: దాదాపు ఆసుపత్రులన్నీ ప్రైవేటురంగంలోనే ఉన్నాయి. లాభాపేక్షతోనే పనిచేస్తాయి. కనుక ఆసుపత్రి ఖర్చులు – మన పంచనక్షత్ర హోటల్ ఛార్జీలతో సమానం. నాలుగు: వైద్యులు తమ వృత్తిని సేవావృత్తిగా చూడడం మానివేసి చాలాకాలమైంది. దాన్ని వ్యాపారంగానే చూస్తున్నారు. కనుక ఫీజుల నియంత్రణ లేదు. పరీక్షలు, మందులవాడకంపైనా నియంత్రణ తక్కువ. అయిదు: ఫార్మా కంపెనీలది పూర్తిగా దోపిడీ వ్యవహారంగా తయారైంది. పేటెంట్లు, పరిశోధన మాటున ధరలు విపరీతంగా పెంచివేస్తున్నారు. ఆరు: వైద్య పరికరాల కంపెనీలు కూడా ఏవో కొత్త పరికరాలు తయారుచేస్తూ అత్యధిక ధరలకు మార్కెట్‌లో పెడుతున్నాయి. ఫార్మా కంపెనీలు, బయోటెక్ కంపెనీలు వైద్యులకు రకరకాల ప్రోత్సాహకాలు చూపి మరిన్ని పరీక్షలూ, మరిన్ని మందులూ వాడేటట్లు ప్రోత్సహిస్తున్నాయి. ఈ అయిదారు కారణాలతో వైద్యరంగంలో ఒక మేరకైనా సంస్కరణలు తీసుకురావాలని గత కొంత కాలంగా ప్రభుత్వాధినేతలు ప్రయత్నం చేస్తూ వచ్చారు. రీగన్ కాలంలో చేసిన ప్రయత్నం పురిట్లోనే విఫలమైంది. తర్వాత క్లింటన్ హయాంలో – ముఖ్యంగా హిల్లరీ క్లింటన్ చొరవతో 1993–94లో మరింత గట్టిగా ప్రయత్నం చేసినా స్వార్థపరశక్తులు అడ్డుకున్నాయి. ఇప్పుడు అధ్యక్షుడు ఒబామా తన ఎన్నికల ప్రచారంలోనే వైద్యరంగ సంస్కరణల్ని ఒక ప్రధాన అంశంగా చేపట్టాడు. అధికారంలోకి వచ్చిన తర్వాత – దాన్నొక సవాలుగానే ప్రయత్నం మొదలుపెట్టాడు. రెండు మూడు ముఖ్యమైన ప్రతిపాదనలు చేశాడు. ఒకటి: బీమా రంగంలో – పోటీ కోసం – ప్రభుత్వరంగ కంపెనీలను ప్రవేశపెట్టడం. తద్వారా ఇప్పుడు బీమా దొరకని 5 కోట్ల మంది అభాగ్యులకూ ఆ సౌకర్యం అందించడం. రెండు: ఆసుపత్రుల ఖర్చులు తగ్గించడం. మూడు: మందుల కంపెనీలతో మాట్లాడి వాటి ఖర్చులు నియంత్రించడం. ఈ మూడూ బడా పెట్టుబడిదారీ సంస్థలే. వాటి లాభాలను కట్టడిచేసే ఏ ప్రయత్నాన్నైనా అడ్డుకుని తీరతాయి. కనుక వందల కోట్ల డాలర్ల ఖర్చుతో – పార్లమెంటు సభ్యులతో – లాబీయింగ్ మొదలుపెట్టాయి. ఈ సంస్కరణలతో – ప్రభుత్వం పన్నులు పెంచడం ఖాయమని ప్రజల్లో ప్రచారం ఉధృతం చేశాయి. రిపబ్లికన్ పార్లమెంట్ సభ్యులు (రెండు సభల్లోనూ హౌస్ + సెనేట్) దీన్ని తమ రాజకీయ అవసరాలకు వాడుకున్నాయి. స్థానికంగా ప్రజల్ని రెచ్చగొట్టే విధంగా టౌన్‌హాల్ మీటింగులు పెట్టారు. అబద్దాలు ప్రచారం చేశారు. 'మెడికేర్' ఆగిపోతుంది, లేక తగ్గించబడుతుందన్నారు. "డెత్ పేనల్స్' పెట్టి మరణరోగాలతో ఉన్నవాళ్ళను చంపేస్తారన్నారు.



epaper.prajasakti.com

> **❝ చైనా దారిద్ర్య నిర్మూలన చర్యలపై కేంద్రీకరించింది. సామాజిక అసమానతలను గణనీయంగా తగ్గించింది. గ్రామాల్లో క్లినిక్‌ల నెట్‌వర్క్ నెలకొల్పింది. పాదచార వైద్యులు (బేర్‌ఫుట్ డాక్టర్లు) అనే ఒక నూతన ప్రయోగంతో సాధారణ వైద్యాన్ని గ్రామీణ ప్రజలవద్దకు తెచ్చింది. 20 సంవత్సరాల కాలంలో ఆరోగ్య సూచికలను (జీవన ప్రమాణం, శిశు మరణాలు) సంపన్న దేశాల స్థాయికి తెచ్చింది. ❞**



**అత్యుత్తమ వైద్యాన్ని ప్రజలందరికీ ఉచితంగా అందిస్తున్న సోషలిస్టు క్యూబా**

ప్రారంభమైన దేశాలు మార్కెట్ శక్తుల కబంధ హస్తాల్లోకి నెమ్మదిగా జారిపోతున్నాయి.

**ద్రవ్య వ్యవస్థల దాష్టీకం**

ప్రపంచ ప్రజారోగ్య విధానాల పరంగా చూస్తే – 1970లు ఒక విధంగా సువర్ణకాలంగా చెప్పవచ్చు. సోవియట్ యూనియన్ – వైద్య ఆరోగ్య రంగాలను పూర్తిగా ప్రభుత్వపరంగా నిర్వహిస్తోంది. ప్రజలకు పౌష్టిక ఆహారం అందుబాటులోకి తెచ్చింది. సామాజిక శాంతిని సాధించింది. ఆరోగ్యరంగంలో అద్భుత ఫలితాలు సాధించింది.

చైనా దారిద్ర్య నిర్మూలన చర్యలపై కేంద్రీకరించింది. సామాజిక అసమానతలను గణనీయంగా తగ్గించింది. గ్రామాల్లో క్లినిక్‌ల నెట్‌వర్క్ నెలకొల్పింది. పాదచార వైద్యులు (బేర్‌ఫుట్ డాక్టర్లు) అనే ఒక నూతన ప్రయోగంతో సాధారణ వైద్యాన్ని గ్రామీణ ప్రజలవద్దకు తెచ్చింది. 20 సంవత్సరాలకాలంలో ఆరోగ్య సూచికలను (జీవన ప్రమాణం, శిశు మరణాలు) సంపన్న దేశాల స్థాయికి తెచ్చింది.

నూతనంగా స్వాతంత్రం సాధించిన దేశాలు చాలా వరకు కీనేసియన్ ఆర్థిక సూత్రాలను అనుసరించి, ప్రభుత్వ పాత్రకు పెద్దపీట వేసి, డిమాండ్ మేనేజ్‌మెంట్‌పై దృష్టిపెట్టి, ఆరోగ్యరంగంలో కూడా ఒక మేరకు మంచి చర్యలు చేపట్టాయి.

'ఉన్నత స్థాయి వైద్యం అందుకోవడం అనేది మానవుల ప్రాథమిక హక్కుల్లో ఒకటి...ప్రజల వైద్య సదుపాయాలు చూసే బాధ్యత ప్రభుత్వాలదే...' అని 1948లో ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొన్నది.

1974లో ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం "నూతన అంతర్జాతీయ వైద్య విధానానికి" పిలుపు ఇచ్చింది. ఈ పిలుపు 1978లో ఆల్మాఆటాలో ప్రపంచ ఆరోగ్య సంస్థ యూనిసెఫ్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఆరోగ్య అసెంబ్లీలో "2000 నాటికి అందరికీ ఆరోగ్యం" అనే ఒక మహత్తర నినాదం తీసుకురావడానికి మార్గం చూపింది. ఆరోగ్య రక్షణ ప్రభుత్వ బాధ్యతనీ, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పటిష్టత దీనికి మార్గమనీ అది చెప్పింది.

"సామాజిక అన్యాయం ప్రజలను పెద్దఎత్తున చంపేస్తోంది" అని 2008లో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆరోగ్య నివేదికలో పేర్కొంది.

ఇంతలో ప్రపంచం ఆర్థిక మాంద్యపు ఊబిలో ఇరుక్కుంది. అనేక దేశాలలో చెల్లింపుల సంక్షోభం వచ్చింది. ప్రపంచ ఆరోగ్య సంస్థకు సభ్యదేశాల నుండి రాబడి తగ్గింది. సంపన్న దేశాలు కూడా కేటాయింపులు తగ్గించాయి. ఆ సంస్థ నిర్వీర్యమైంది. ఐఎంఎఫ్, వరల్డ్‌బ్యాంక్ ఆరోగ్య విధానాల రంగంలోకి దిగాయి! ప్రపంచబ్యాంక్ 1987లో సంస్కరణల కోసం అజెండా అనే పత్రం ప్రకటించింది.

ఇది 'ఆల్మాఆటా' ప్రకటనను దాదాపు తిరస్కరించింది. "ఆరోగ్య రక్షణ ప్రజలందరి హక్కు. ప్రతివానికీ ఉచిత వైద్య సేవ – అనే విధానం పనిచెయ్యదు" అని స్పష్టంగా పేర్కొంది. వైద్యసేవలకవసరమయ్యే ధనానికి ప్రపంచబ్యాంక్ ఒక్కటే దిక్కుగా మిగిలింది. దీనివెనుక బహుళజాతి కంపెనీల ప్రభావం ఉంది. ప్రజారోగ్య రంగంలో ప్రభుత్వ జోక్యాన్ని తగ్గించుకోవాలన్నది వీటి సలహా. దాన్ని మార్కెట్ శక్తులకు – అంటే ప్రైవేటు రంగానికి వదలాలని సూచన. స్వచ్ఛంద సేవాసంస్థను (ఎన్జీవోస్) రంగంలోకి దింపింది. వాటికి వనరులు సమకూర్చి తన చెప్పుచేతల్లో ఉంచుకుంది.

దాంతో ఆరోగ్యం అనేది ప్రజా బాహుళ్యాన్ని దృష్టిలో ఉంచుకొని కాక వ్యక్తి కేంద్రంగా రూపొందింది. వ్యాధి నిరోధక మార్గాలపై చూపు తగ్గి కేవలం వ్యాధి నివారణ (క్యూర్) పైకి మళ్ళింది.

ఈ పరిణామం వల్ల బహుళజాతి కంపెనీల చేతుల్లో ఉన్న సీమెన్స్‌లాంటి మెడికల్ ఎక్విప్‌మెంట్ తయారుచేసే కంపెనీలకు గ్లాక్సో, ఫైజర్ లాంటి ఔషధ తయారీ కంపెనీలకు పంట పండింది.

ఒక్క 2008 సంవత్సరంలోనే ఫార్మా కంపెనీలు కళ్ళు చెదిరేటట్లు – 600 బిలియన్ డాలర్ల (రూ 27,00,000 కోట్ల రూపాయల) అమ్మకాలు జరిపాయి. వైద్య పరికరాలు కంపెనీలు అమ్మకాలు 51 బిలియన్ డాలర్లు (అంటే రూ. 23,000 కోట్లు). పేటెంట్ చట్టాలు ఫార్మా కంపెనీలకు వరంగా మారాయి. మార్కెట్‌లోకి ఒక మందు వచ్చిన కొద్దికాలానికే అదే మందు చిన్న చిన్న మార్పులతో – కొత్త పేరుతో తెచ్చి – మళ్ళీ పేటెంట్ పొందు

> **" యూరప్ దేశాలలో స్థూలంగా రెండు నమూనాల వైద్యరంగ మార్పులున్నాయి: ఒకటి: బిస్మార్క్ మోడల్  ఇందులో ప్రజలందరికీ ఏదో ఒక రకమైన బీమా కవరేజ్ ఉంటుంది. ఫ్రాన్స్, జర్మనీ, ఇతర నార్డిక్ దేశాలు ఈ నమూనాను అనుసరించాయి. రెండవది: బెవరిడ్జ్ మోడల్: ఇది ఇంగ్లండ్ తరహా. పూర్తి బాధ్యత ప్రభుత్వానిది. ప్రజల నుండి వివిధ తరగతుల (గ్రాండెడ్ ట్యాక్స్) నుండి ఆదాయాన్ని బట్టి వైద్య లెవీ వసూలు చేస్తారు. ఈ రెండు నమూనాలు ఆయా దేశాల్లో అమలులోకి వచ్చాయి. "**

ప్రజలపై అదనపు పన్నులు వేయటం తప్పనిసరి అవుతుందన్నారు. ప్రజల్లో కూడా భయసందేహాలు మొదలయ్యాయి. ఒబామా పాపులారిటీ రేటింగ్ దారుణంగా పడిపోయింది. సెనేట్‌లో ఉన్న మెజారిటీని నిలుపుకోవడం కష్టంగా మారింది. చావుతప్పి – కన్ను లొట్టబోయినట్టు ముందు తయారుచేసిన బిల్లులో కొన్ని అంశాలు తగ్గించి –ఒబామా ప్రభుత్వం రెండు సభల్లో బిల్లును నెగ్గించుకున్నది. ఆఖరిమెట్టుగా ఉభయ సభల ఉమ్మడి ఆమోదం పొందింది. అయితే దీన్ని ఎంతవరకు అమలు చేయనిస్తారో వేచి చూడాలి.

మరొక సంపన్న దేశాల సముదాయం – యూరోపియన్ దేశాలు. ఇంకా విస్తృతంగా చూస్తే ఓ.ఇ.సి.డి. దేశాలు.

యూరప్‌లో రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత వచ్చిన కొన్ని ఘటనలు పరిశీలించాలి. యుద్ధం కారణంగా ఆ దేశాల ఆర్థిక పరిస్థితితోపాటు ఆరోగ్య వ్యవస్థ కూడా దెబ్బతింది. ఎక్కువ దేశాలతో శ్రామికవర్గ పోరాటాలు, ఫాసిస్టు వ్యతిరేక పోరాటాల ప్రభావం ప్రజలపై ఉంది. చాలా దేశాల్లో వామపక్ష పార్టీలు అధికారంలో భాగస్వాములయ్యాయి. యుద్ధంలో వచ్చిన నష్టాన్ని పూడ్చుడానికి 'మార్షల్ ప్లాన్' ద్వారా అమెరికా ఆర్థిక సహాయం అందించింది.

వీటన్నింటి కారణంగా 'సంక్షేమ రాజ్య' ఆలోచన వచ్చింది. దానిలో భాగంగా దాదాపు పశ్చిమ యూరప్ దేశాలన్నిటిలోనూ ప్రజారోగ్య ప్రణాళికలు వచ్చాయి.

ఇంగ్లండ్‌లో లేబర్ ప్రభుత్వ హయాంలో 1948లోనే అన్యూరిన్ బెవాన్ రూపకర్తగా జాతీయ ఆరోగ్య వ్యవస్థ (ఎన్.హెచ్.ఎస్.) ఏర్పడింది. వైద్యరంగం పూర్తిగా జాతీయం చేయబడింది. అప్పటికి అరకొరగా ఉన్న ప్రైవేటురంగాన్ని క్రమేపీ ప్రభుత్వరంగంలోకి తీసుకువచ్చారు. దేశంలో ఉన్న ప్రతిపౌరుడికీ పూర్తిగా ఉచిత వైద్య సౌకర్యం అమలులోకి వచ్చింది.

మిగతా యూరప్ దేశాలలో స్థూలంగా రెండు నమూనాల వైద్యరంగ మార్పులున్నాయి: ఒకటి: బిస్మార్క్ మోడల్ అంటారు. ఇందులో ప్రజలందరికీ ఏదో ఒక రకమైన బీమా కవరేజ్ ఉంటుంది. దీనికిగాను ఉద్యోగుల నెల జీతాల నుండి కొంత శాతం పన్ను రూపంలోనూ – కొంత ప్రభుత్వ ఖజానా నుండి జమ చేస్తారు. ఫ్రాన్స్, జర్మనీ, ఇతర నార్డిక్ దేశాలు ఈ నమూనాను అనుసరించాయి. రెండవది: బెవరిడ్జ్ మోడల్: ఇది ఇంగ్లండ్ తరహా. పూర్తి బాధ్యత ప్రభుత్వానిది. ప్రజల నుండి వివిధ తరగతుల (గ్రాండెడ్ ట్యాక్స్) నుండి ఆదాయాన్ని బట్టి వైద్య లెవీ వసూలు చేస్తారు. ఈ రెండు నమూనాలు ఆయా దేశాల్లో అమలులోకి వచ్చాయి. కొంతకాలం బాగానే నడిచాయి. ప్రజల్లో కూడా సంతృప్తి వ్యక్తమయింది.

70, 80 దశకాల్లో చాలా దేశాలలో ఆర్థిక సంక్షోభాలు వచ్చాయి. స్థూల జాతీయ ఆదాయాల పెరుగుదల రేట్లు తగ్గుతూ వచ్చాయి. నిరుద్యోగం పెరగటంతో ప్రజల ఆదాయాలు పడిపోయాయి. ప్రభుత్వాల పన్నుల రాబడి తగ్గింది. ప్రభుత్వాలకు 'పొదుపు' అవసరమైంది. రెండోవైపు పెరుగుతున్న ప్రజల ఆకాంక్షలు, టెక్నాలజీ ఆవిష్కరణలు, కొత్త కొత్త అత్యంత ఖరీదైన మందులు మార్కెట్‌లోకి రావడం – వీటన్నింటి మూలంగా వైద్య రంగంలో ఖర్చు చాలా పెరుగుతూ వచ్చింది. ప్రభుత్వాలకు ఖర్చులు తగ్గించుకోవలసిన అవసరం ఎదురైంది.

అంతర్జాతీయ ద్రవ్యసంస్థలు రంగంలోకి వచ్చాయి. "ఆర్థిక సంస్కరణ"లు అనే ప్రిస్క్రిప్షన్ ముందుకు తెచ్చాయి. కార్పొరేట్ రంగంపై పన్నులు తగ్గించడం, సామాజిక రంగంపై ఖర్చు తగ్గించుకోవడం వాటి సారాంశం. వీటిని సంపన్నవర్గాలు రెండు చేతులా స్వాగతించాయి. అటు అమెరికాలో రీగన్ – ఇటు ఇంగ్లండ్‌లో థాచర్ ఆధ్వర్యంలో ఆరోగ్య రంగ సంస్కరణలు మొదలయ్యాయి. బహుళజాతి కంపెనీలు రంగప్రవేశం చేశాయి.

ఇంగ్లాండ్‌లో చాపకింద నీరులాగా ప్రైవేటు రంగం ప్రవేశించింది. మొదట సపోర్టింగ్ సర్వీసెస్, తర్వాత ఆస్పత్రుల నిర్మాణంలాంటివి ప్రైవేటు రంగానికి అప్పగించారు. 2002 నాటికి "ఇండిపెండెంట్ సెక్టార్" అనేది వచ్చింది. 24 పెద్ద ఆస్పత్రుల నిర్వహణ దానికిచ్చివేశారు. 'ప్రైవేటు ఫైనాన్స్ ఇనిషియేటివ్ (పిఎఫ్ఐ) అనే సంస్థతో ఆస్పత్రుల నిర్మాణం – నిర్వహణ ప్రైవేటు రంగానికిచ్చారు. అది మన రోడ్ల "టోల్‌గేట్" పద్ధతిలో ఉంటుంది. అదే రంగంలో కొన్ని ప్రత్యేక వ్యాధులకు (ఉదా: మోకాలి మార్పిడి) ఆస్పత్రులను అనుమతించారు.

మిగతా యూరోపియన్ దేశాలలో ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలను ఒక మేరకైనా (కో–పేమెంట్స్‌కు) అనుమతించారు. ఆస్పత్రుల అమ్మకాలు, మెర్జర్లు మొదలయ్యాయి. కొత్త టెక్నాలజీ వచ్చినందున (లాపరోస్కోపిక్ సర్జరీలు) రోగి ఆస్పత్రుల్లో ఉండే రోజులు తగ్గాయి. కనుక పడకల సంఖ్య తగ్గించి, ఖర్చులు తగ్గించుకునే ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రైవేటు డాక్టర్లు, ఆస్పత్రులు – రంగంలోకి వచ్చాయి. ఫీజుల నియంత్రణ చేస్తామన్నారు. 2020 నాటికి జర్మనీలో 50 శాతం ఆస్పత్రులు ప్రైవేటు రంగంలోనే వుంటాయని ఒక అంచనా.

1989-91 కి పూర్వం –సెమీ సోషలిస్టు దేశాలుగా ఉన్న జెక్, పోలెండ్‌లాంటి తూర్పు యూరప్ దేశాలలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కొత్తగా వస్తున్న ఆస్పత్రులన్నీ ప్రైవేటురంగంలోనే. ఈ రంగం వైద్యంపై దాదాపు పూర్తి పట్టు సాధించింది. దీనంతటి వెనుక అమెరికన్ పెట్టుబడిదారీ సంస్థలున్నవాస్తవం గమనించాలి.

యుఎస్‌టిఆర్ అనే అమెరికన్ సంస్థ వ్యాపార సంబంధాన్ని నియంత్రిస్తుంది. ప్రభుత్వరంగం బలంగా ఉన్న కెనడా, జర్మనీ, ఫ్రాన్స్‌లాంటి దేశాల ప్రజారోగ్య విధానాలపై ఇది కన్నెర్ర చేసింది. డబ్ల్యూటిఒ నిబంధలకు విరుద్ధమని వాదించింది. ఇవి మార్కెట్ శక్తుల్ని నిర్వీర్యపరుస్తున్నాయన్నది. మీ బడ్జెట్లను నియంత్రించడం వల్ల – నూతన ఆవిష్కరణలకు అవరోధం కలుగుతుందని వాదించింది. ఏదో మేరకు ఆ ఒత్తిడి ఈ దేశాలపై ఉంది. దీనిని వైద్యవ్యవస్థల "అమెరికనైజేషన్", "మార్కెటైజేషన్" అంటున్నారు. సంక్షేమ రాజ్య భావనతో



epaper.prajasakti.com

**❝ 80వ దశకంలో డబ్ల్యూటీవో సహాయంతో మన బిడ్డలందరికీ పెద్దఎత్తున వ్యాధి నిరోధక టీకాలు ఇచ్చే బృహత్ పథకం వచ్చింది. పెద్ద ఎత్తున పోలియో వ్యాక్సిన్ అవసరమైంది. రష్యానుండి దిగుమతి చేసుకునే ఒప్పందం కుదిరింది. ఎలాంటి ఇబ్బంది లేకుండా అది కొనసాగుతుండగా పాశ్చాత్యదేశాల బహుళజాతి కంపెనీల ఒత్తిడితో రష్యానుండి వ్యాక్సిన్ దిగుమతికి అడ్డుకట్ట వేయబడింది. దాంతో మనం ఇతర దేశాలనుండి రెండింతల ధరతో దిగుమతి చేసుకోవడం తప్పలేదు. ❞**

తున్నాయి. పేటెంట్ ఉన్నంతకాలం (దాదాపు 20 సంవత్సరాలు) పోటీలేకుండా అమ్ముకోవచ్చు. అత్యంత సాధారణ విషయాలను "జబ్బులు"గా ప్రచారం చేసి వాటికి "మందు"లంటూ మార్కెట్‌లోకి తెస్తున్నాయి. (ఉదా: కొందరు కూర్చుని కాళ్ళూపుతుంటారు. దానికి మందు. కొందరు పిల్లలు మరింత చురుగ్గా ఉంటారు. దానికి మందు) న్యూ ఇంగ్లాండ్ జర్నల్ ఆఫ్ మెడిసన్‌లో మార్సియా ఎంజెల్ అనే నిపుణురాలు ఇలా రాసింది: "జనంలో రెండే రెండు రకాలు. మందులు అవసరమైనవాళ్ళూ, కానివాళ్ళూ అన్నట్లు చేస్తున్నాయి ఈ కంపెనీలు. రెండు చేతుల్తో ఆ మందులు రాయడానికి డాక్టర్లను మానసికంగా తయారుచేస్తున్నాయి".

మందుల రంగంలో పరిశోధన (రీసెర్చ్) విషయానికి వస్తే – ఈ కంపెనీలన్నీ ఎక్కువ లాభాలు తెచ్చేవాటిపై కేంద్రీకరిస్తున్నాయి. సంపన్నుల జబ్బులని కొన్నింటికి పేరు (డిసీజెస్ ఆఫ్ ఎఫ్లుయన్స్). గుండె జబ్బులు, రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్, ఊబకాయం అలాంటివి. పరిశోధనంతా వాటిపైననే. పేదలకు వచ్చే మలేరియా, క్షయలాంటి జబ్బులకు గత అర్ధశతాబ్దిగా కొత్తమందు రాలేదంటే ఆశ్చర్యం వేయదూ? ఒక లెక్క ప్రకారం 10% మందికి వచ్చే వ్యాధులపై 90% ఖర్చు చేస్తున్నారు. 90% మందికి వచ్చే వ్యాధులపై 10% ఖర్చుచేస్తున్నారు. అంతేకాదు, ఒక మందు తయారు చేయడానికి అయ్యే ఖర్చుకంటే ఎక్కువగా దాన్ని మార్కెటింగ్ (ప్రచారానికి) చేయడానికి అవుతుంది. ఆ భారమంతా రోగి నెత్తిన పడుతుంది! ఒకమందు చాలా జబ్బులకు పనిచేస్తుందని ప్రచారం చేస్తున్నాయి. వాటివల్ల కలిగే దుష్పరిణామాలను సాధ్యమైనంతవరకు దాచిపెడుతున్నాయి.

పౌష్టికాహారం, శుభ్రమైన తాగేనీరు, గాలి, పరిసరాలు, శానిటేషన్, నిరోధక టీకాలు, మంచి అలవాట్లు ఆరోగ్యానికి అవసరమని కాక – కేవలం ఆసుపత్రులు, మందులు అనే తప్పుడు అవగాహనకు ప్రజలనూ, డాక్టర్లనూ మానసికంగా తయారు చేస్తున్నారు.

వెరసి ప్రజారోగ్యం – అంతర్జాతీయ ద్రవ్య సంస్థల విధానాలలోనూ, బహుళజాతి ఫార్మా కంపెనీల అనైతిక పద్ధతులలోనూ చిక్కుకుపోయింది.

ఆల్మాఆటా ఆశయం, ఆదేశం వమ్ముచేయబడ్డాయి. ఇది ఏదో అనాలోచితంగానో, అమాయకంగానో జరిగింది కాదు. నయా–ఉదారవాదం అనే నూతన ఆర్థిక తాత్వికత (నియో–లిబరల్ ఫిలాసఫీ) ప్రపంచవ్యాప్తంగానే తెచ్చిన పెనుమార్పు ఇది. కాని ప్రపంచ ప్రజల ఆరోగ్యంపై దీని ప్రభావం మాత్రం అత్యంత తీవ్రమైనది. బాధాకరమైంది.

ఈ నేపథ్యంలో 1989 – 91 మధ్య సోవియట్ పతనమైంది. ప్రతీపశక్తులు విజృంభించాయి. ఆ దేశమే దరిద్ర్యంలో కూరుకుపోయింది. ప్రైవేటు అక్రమాలాభార్జన శక్తులు, బహుళజాతి కంపెనీలు కలిసి జడలు విప్పాయి. అన్ని రంగాలతోపాటు వైద్యరంగం సంక్షోభంలో పడింది. ప్రజలకు వైద్యం గగనకుసుమమైపోయింది. ఆరోగ్య సూచికలు దారుణంగా పడిపోయాయి.

అలాగే – 1978 తర్వాత చైనా డెంగ్ సియావోపెంగ్ నాయకత్వాన సంస్కరణల బాట పట్టింది. ప్రభుత్వవైద్యానికి వెనుకసీటు, ప్రైవేటు రంగానికి పూర్తి స్వేచ్ఛ లభించాయి. 2000 సంవత్సరం నాటికి అక్కడ పరిస్థితులు దారుణంగా తయారయ్యాయి.(తరువాత అది దిద్దుబాటు చర్యలు చేపట్టింది) ఈ ఉపద్రవాన్ని ఎదిరించి నిలబడగలిగింది క్యూబా మాత్రమే.

**భారత్ – బాగోతం**

మనదేశ పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. ఆరోగ్య రంగానికి సంబంధించిన వివిధ అంశాలకు పోకుండా కేవలం పెట్టుబడి ప్రభావానికి పరిమితమవుదాం.

మనకు స్వతంత్రం వచ్చిన తర్వాత పంచవర్ష ప్రణాళికలు రూపొందించుకొని మిశ్రమ ఆర్థిక వ్యవస్థ ద్వారా అభివృద్ధి నమూనాను ఎంచుకున్నాం. అన్నిరంగాలలో పరిశ్రమలు నెలకొల్పుకుని క్రమేపీ స్వయం సమృద్ధిని సాధించాలన్నది సంకల్పం. ఈ ఆలోచనలో పండిట్ నెహ్రూ కృషిని ప్రశంసించక తప్పదు. మనకు ఆనాటికి లేని సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇతర దేశాలనుండి తెచ్చుకొని వాటిని నెలకొల్పుకున్నాం. అనేక శాస్త్ర సాంకేతిక సంస్థలను ప్రభుత్వరంగంలో రూపొందించుకున్నాం. అతిపెద్ద ఉక్కు కర్మాగారాలను స్థాపించుకున్నాం. ఒకటీ అరా, పాశ్చాత్య దేశాలు సహాయం చేసినా – ప్రధానంగా ఆనాటికే మనతో దృఢమైన స్నేహ సంబంధాలున్న సోవియట్ యూనియన్ చాలా ప్రాజెక్టులు టర్న్–కీ– ప్రాతిపదిక మీద నిర్మించి పెట్టింది. (ఉదా:– రూర్కెలా, విశాఖ) అందులో ఫార్మా కంపెనీలు కూడా చెప్పుకోదగ్గవి. మన హైదరాబాద్ నగరంలోనే ఐడిపిఎల్ అతి పెద్ద మందుల కర్మాగారం. అలాగే హృషీకేశ్‌లో ఒకటి, మద్రాస్‌లో సర్జికల్ పరికరాల కర్మాగారం ఒకటి, పూనేలో హిందూస్థాన్ యాంటి బయాటిక్ సంస్థ వచ్చాయి. తిరువనంతపురంలో "హిందూస్థాన్" లేటెక్స్ వచ్చింది. ఇవన్నీ ఆనాటి మన అవసరాలను చాలావరకు తీర్చగలశక్తి ఉన్నవే. అవసరమైతే భవిష్యత్‌లో వాటిని విస్తృతపర్చుకునే అవకాశం ఉంది.

కాని కాలక్రమేపీ బహుళజాతి కంపెనీల ఒత్తిడి పెరిగింది. బలహీన ప్రభుత్వాలు వాటికి తలవంచుతూ వచ్చాయి. అనేక విధాలుగా ప్రభుత్వరంగ పరిశ్రమల్ని నిర్వీర్యపరుస్తూ వచ్చాయి. ఇప్పుడు దాదాపు అవన్నీ మూతపడిగానీ, త్వరలో మూతపడే స్థితిలోగానీ ఉన్నాయి.

80వ దశకంలో డబ్ల్యూటీవో సహాయంతో మన బిడ్డలందరికీ పెద్దఎత్తున వ్యాధి నిరోధక టీకాలు ఇచ్చే బృహత్ పథకం వచ్చింది. ముఖ్యంగా ప్రపంచవ్యాప్తంగా పోలియోవ్యాధి నివారణకోసం "పోలియో చుక్కల కార్యక్రమం" మన ప్రభుత్వం చేపట్టింది. చాలా పెద్ద ఎత్తున పోలియో వ్యాక్సిన్ అవసరమైంది. రష్యానుండి దిగుమతి చేసుకునే ఒప్పందం కుదిరింది. ఎలాంటి ఇబ్బంది లేకుండా అది కొనసాగుతుండగా పాశ్చాత్యదేశాల బహుళజాతి కంపెనీలు డబ్ల్యూటీవోపై ఒత్తిడి తెచ్చాయి. రష్యా వ్యాక్సిన్ తాము గుర్తించడం లేదంటూ 2000 సంవత్సరంలో డబ్ల్యూటీవో మనకు తాఖీదు యిచ్చింది. నిజానికి రష్యా వాక్సిన్ నాణ్యత అన్ని



epaper.prajasakti.com

> " కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సిజిహెచ్‌ఎస్) ద్వారానూ, రాష్ట్ర ప్రభుత్వ రీఎంబర్స్‌మెంట్ సదుపాయం ద్వారానూ ఆరోగ్యశ్రీ పథకం ద్వారానూ / కార్పొరేట్ ఆసుపత్రులకు ప్రజల సొమ్ము దోచిపెడుతున్నారు. ఆ స్థాయి వైద్యం చేయగలిగిన స్థితికి ప్రభుత్వరంగ ఆసుపత్రులను తీర్చిదిద్దడం ప్రభుత్వాలకు పట్టలేదు. "

విధాలుగా రుజువైంది. (ఆ వివరాల్లోకి వెల్లడం లేదు) కేవలం సీసాలలో నింపే బాధ్యత, యోగ్యత మాత్రమే ఉన్న మన బయోటెక్నాలజీ విభాగం ద్వారా దానికి అడ్డుకట్ట వేయబడింది. దాంతో మనం ఇతర దేశాలనుండి రెండింతల ధరతో దిగుమతి చేసుకోవడం తప్పలేదు.

1974 నుండి డబ్ల్యూటీవో నుండి ఒత్తిడి ప్రారంభమైంది. వ్యాపార సరళీకరణ - ప్రపంచీకరణ పేరుతో ఫార్మారంగంలో విదేశీ బహుళజాతి సంస్థలకు ప్రవేశం, రక్షణ కల్పించాలన్నది సూత్రం. ఆ కారణాలతో మన స్వదేశ మందుల కంపెనీలకు రక్షణ తగ్గించాల్సి వచ్చింది. 1970లో మనం చేసుకున్న పేటెంట్ చట్టం - చాలావరకు ఆదర్శవంతమైందని ఇతర వర్ధమాన దేశాలు కూడా కితాబిచ్చాయి. ఇప్పుడు డబ్ల్యూటీవో ఆదేశాల ప్రకారం దాన్ని 2002లో ఎన్‌డిఎ ప్రభుత్వం (కాంగ్రెస్ పార్టీ సహకారంతో) నీరుగార్చింది. బహుళజాతి కంపెనీల పేటెంట్ హక్కుల్ని ప్రాసెస్ పేటెంట్ నుంచి - ప్రాడక్ట్ పేటెంట్‌గా మార్చింది. ఆ సంస్థలు పొందిన పేటెంట్ హక్కును 5-10 సంవత్సరాలనుండి 20 సంవత్సరాల వరకూ పొడిగించింది. ఇంతకు పూర్వం మార్కెట్‌లోకి వచ్చిన ఏ కొత్త మందునైనా కొద్ది సంవత్సరాలలోనే - రివర్స్ ఇంజనీరింగ్ ద్వారా దాని జనరిక్ మందు తయారుచేసుకుని మన కంపెనీలు కారుచౌకగా రోగులకు అందించేవి. ఇప్పుడు అలాంటి అవకాశం 20 సంవత్సరాల వరకు వుండదు!

2008 నుదాహరణ చూద్దాం. మన బిడ్డలకు వేసే రోగనిరోధక కార్యక్రమానికి - ఆరురకాల వ్యాక్సిన్లు అవసరం. వీటిలో దాదాపు 70 శాతం మన సొంత లేబరేటరీలు సరఫరా చేస్తున్నాయి. అవి 1) సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిఆర్ఐ) హిమాచల్ ప్రదేశ్‌లోని 'కసౌలి'లో ఉంది. 2) పాశ్చర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (పి.ఐ.ఐ.) తమిళనాడులోని కూనూర్‌లో ఉంది. ఈ రెండూ నూరు సంవత్సరాల ఘనచరిత్రగల పరిశోధన సంస్థలు. 3) బి.సి.జి. వ్యాక్సిన్ లాబ్ (బివిఎల్) చెన్నైలో వుంది. జనవరి 2008న అకస్మాత్తుగా ఈ మూడు సంస్థల వుత్పత్తుల్ని ఆపు చెయ్యమని కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదేశించింది. ఇప్పటికే ఉన్న స్టాక్‌ను కూడా స్థంభింప చేసెయ్యమంది. ఆ రంగంలో వరిచయమున్న నిపుణులందరూ నిర్ఘాంతపోయారు. కారణం? డబ్ల్యూటీవో కమిటీ వీటిని పరిశీలించి ఉత్తమ ఉత్పత్తి పద్ధతులకు అనుగుణంగా అవి లేవని రిపోర్టు ఇచ్చిందట. చిత్రమేమిటంటే ఇంతకాలంగా - వాటి వుపయోగంలో ఒక్క ఫిర్యాదు కూడా నమోదు కాలేదు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు చెందిన సంప్రదింపుల కమిటీ తరపున మేము 10 మంది పార్లమెంట్ సభ్యులం కసౌలి, కూనూర్ ప్లాంటులను పరిశీలించాము. వందేళ్ళనాటి భవనాలు ఎగుడుదిగుడు పర్వతాలపై కట్టినవి వున్నాయి. చాలా సీనియర్ స్టాఫ్ - అంకితభావంతో అరకొర జీతాలతోనైనా పనిచేస్తున్నారు. కసౌలీలో పాము కాటుకు విరుగుడు (యాంటీ వీనమ్) కూడా తయారు చేస్తున్నారు. మరింత విశాలమైన స్థలంలో ఆధునిక సదుపాయాలతో పక్కా భవన సముదాయం వెంటనే కట్టాలని మేము మంత్రిత్వ శాఖకు సిఫార్సు చేశాము. తప్పనిసరిగా చేపడతామని ఆనాటి ఆరోగ్య శాఖామంత్రి డా॥ థాకూర్ మాట ఇచ్చారు కూడా. డబ్ల్యూటీవో చూపిన కారణం కేవలం సరైన భవనాలు లేకపోవడం. తగినంత మంది స్టాఫ్ లేకపోవడం! ఈ కారణంగా జనవరి 2008 నుండి అన్ని వ్యాక్సిన్‌లు బహుళజాతి సంస్థలనుండి కొంటున్నారు. 10 డోసులకు వచ్చే ఒక వయల్ ఖరీదు 10 రూపాయలకు మన లాబ్స్‌లో తయారవుతుంటే అదే వయల్‌ను మనం రూ.50 నుండి 60 వరకు పెట్టి దిగుమతి చేసుకుంటున్నాము. (హిందూ 8-3-2010). వీటి మూసివేత వల్ల 15 రాష్ట్రాలకూ వ్యాక్సిన్ల కొరత ఏర్పడింది. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తన 38వ రిపోర్టులో ఈ మొత్తం వ్యవహారాన్ని దుయ్యబట్టింది. తర్వాత ఈ దుర్మార్గమైన బ్యాన్ ఆర్డర్‌ను వెనక్కి తీసుకుంటూ 25 మాసాల తర్వాత ఈ నెలలోనే ఆదేశాలు జారీచేశారు.

కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సిజిహెచ్‌ఎస్) ద్వారానూ, రాష్ట్ర ప్రభుత్వ రీఎంబర్స్‌మెంట్ సదుపాయం ద్వారానూ ఆరోగ్యశ్రీ పథకం ద్వారానూ / కార్పొరేట్ ఆసుపత్రులకు ప్రజల సొమ్ము దోచిపెడుతున్నారు. ఆ స్థాయి వైద్యం చేయగలిగిన స్థితికి ప్రభుత్వరంగ ఆసుపత్రులను తీర్చిదిద్దడం ప్రభుత్వాలకు పట్టలేదు. ఇదే అదనుగా సిజిహెచ్‌ఎస్ వైద్యాధికార బృందమూ, కార్పొరేట్ ఆసుపత్రులు కలిసి పెద్ద ఎత్తున దొంగబిల్లులు పెడుతున్నట్లు - ఇటీవలనే సిబిఐ దర్యాప్తులో తేలిందని పత్రికా వార్తలు చూశాం. ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్లు అనుమతి పొందిన ప్రైవేటు ఆసుపత్రులు చాలా పెద్దఎత్తున అనవసరమైనవి చేస్తున్నట్లు గణాంకాలతో సహా బయటపడింది. దీనిపై దర్యాప్తు చేసి చేతులు దులుపు కుంటున్నారు.

దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ ప్రత్యేకించి మన రాష్ట్రంలో ప్రైవేటు వైద్య కళాశాలలు ఒక్కోసీటుకు 50 లక్షల నుండి కోటి రూపాయల వరకు (నిబంధనలను తుంగలో తొక్కి) డొనేషన్లు వసూలు చేయడం బహిరంగ రహస్యం. ఇప్పుడు ప్రభుత్వ, డెంటల్, నర్సింగ్ కాలేజీలకంటే ప్రైవేటు రంగంలో కాలేజీల సంఖ్య ఎక్కువగా వుండడం - వైద్య విద్య అధికాధికంగా పెట్టుబడి చేతుల్లోకి పోతుండటం ఒక వాస్తవం. దీనివల్ల భవిష్యత్‌లో వైద్యరంగానికి వచ్చే భౌతిక - నైతిక దుష్పరిణామాలను పలువురు ప్రముఖులు హెచ్చరిస్తున్నారు.

సారాంశం: పెట్టుబడిదారీ వ్యవస్థలో వైద్య సేవ కొనుగోలు సరుకుగా (కమోడిటీగా) మారింది. వైద్యసేవ ఒక వ్యాపారంగా పరిణామం చెందింది. అది ఒక పరిశ్రమ స్థాయికి (హెల్త్ ఇండస్ట్రీ) ఎదిగింది. ఫార్మా పరిశ్రమ, శస్త్ర పరికరాల, వ్యాధి నిర్ధారణ పరికరాల పరిశ్రమలు దీనికి తోడయ్యాయి. మార్కెట్ శక్తులు ప్రజారోగ్యాన్ని శాసిస్తున్నాయి.

ఆరోగ్యమే మహాభాగ్యం అన్న నానుడి "భాగ్యంతోనే ఆరోగ్యం"గా మార్పు చెందింది. అనారోగ్య సాగరంలో లాభాల చేపల వేట. ఇదొక అమానవీయ క్రీడ. ఈ క్రీడకు ముగింపు పలకాలి. ❋



epaper.prajasakti.com

ఈ మాసం ముఖ్యాంశం

# కరోనా వైరస్‌నుపయోగించుకుని మతవిద్వేష ప్రచారం

హర్ష మందర్

కరోనా మహమ్మారి బెదురు ఒకపక్క లాక్‌డౌన్‌లతో మరోపక్క చెదిరిపోయిన భారత ప్రజలు ఇంకా వైద్యానికి లొంగని వైరస్‌తో యుద్ధం చేస్తున్నారు. ఈ ప్రత్యేక పరిస్థితుల్లో భారత ముస్లింలు నిరాశతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. స్వేచ్ఛాభారతంలో భారత ముస్లింలు అనేక కష్టసమయాలను ఎదుర్కొన్నారు. అందులో దేశవిభజన సమయం ఎంతో కష్టంతో కూడుకున్నది. ముస్లింల పట్ల ద్వేషం పరాకాష్టకు చేరి రక్తపాతంతో చెలరేగి వారి జీవితాలను ఛిద్రం చేసి ఇళ్ల నుంచి వెళ్లగొట్టి నిరాశ్రయులను చేసి లక్షల సంఖ్యలో పాకిస్థాన్‌కు వలస వెళ్లక తప్పని పరిస్థితిని కల్పించింది. మతవిద్వేషాగ్ని చెలరేగిన ఇటీవల కాలంలో ప్రతి సందర్భంలో గోసంరక్షణ, "లవ్ జీహాద్" పేరిట పేట్రేగిన హింసాకాండ ఆ చేదు జ్ఞాపకాలను మరచిపోకుండా జ్ఞప్తికి తెస్తున్నాయి.

మధ్యయుగాల నాటి మసీదును నేలమట్టం చేసి ఆ స్థానంలో రామమందిరం నిర్మించాలని ఉన్మత్తతతో సాగిన ఉద్యమం మరో పరాకాష్ట. ఉగ్రవాదదాడుల పేరుతో అధికారంలో కొనసాగిన ప్రభుత్వాలు ముస్లింలను చుట్టుముట్టి వెంటాడి, వేధించి, హింసించి కష్టాలకు గురిచేసిన కారణంగా గతగాయాలు మరింతగా రేగాయి.

2014 వేసవి మధ్యకాలంలో ఢిల్లీలో నరేంద్ర మోడీకి అధికారం అప్పగిస్తూ ప్రజలిచ్చిన తీర్పు వారికి మరింత గడ్డుకాలమైంది. అత్యున్నత స్థానంలో ఉన్నవారు ముస్లింలకు వ్యతిరేకంగా విద్వేషపూరిత ప్రసంగాలు చేయడం సామాజిక జీవనంలో సర్వసాధారణమైంది. మీడియాలో అధికభాగం, ప్రత్యేకించి హిందీ, ఇతర ప్రాంతీయ భాషలకు చెందినవారు ప్రతిరోజూ విద్వేషపూరిత సమాచార ప్రచారం చేయటం సాధారణమైంది. ఎన్నికల రాజకీయాల నుంచి క్రమక్రమంగా ముస్లింల ప్రమేయం, ప్రాధాన్యం తగ్గిపోసాగాయి. దేశవ్యాప్తంగా అమాయక ప్రజలపై అనేక సందర్భాలలో సాగించిన క్రూర హింసాకాండ, చిత్రవధ భారత ముస్లింల మనసులను దగ్ధం చేసింది. 2019లో మోడీ తిరిగి అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే రాజ్యాంగపరంగా, చట్టపరంగా భారత ముస్లింలను లక్ష్యంగా చేసుకుని సాగించిన దాడులు, కాశ్మీర్ స్థాయిని తగ్గించి దిగ్బంధించడం, త్రిపుల్ తలాక్‌ను క్రిమినల్ నేరంగా చేయడం, రామజన్మభూమి తీర్పు ఇందుకు సాక్ష్యంగా నిలుస్తాయి.

పౌరసత్వచట్టాల్లో చేస్తున్న మార్పులకు నిరసనగా, జాతీయ పౌర పట్టికను దేశవ్యాప్తంగా అమలు చేయాలనే యోచనను వ్యతిరేకిస్తూ జాతీయస్థాయిలో ప్రజావ్యతిరేకత వ్యక్తమైంది. భారత ముస్లింలతో పాటు అన్ని రకాల విశ్వాసాలను అనుసరించే ప్రజలు, విద్యార్థులు భుజం భుజం కలిపి వివక్ష చట్టాలకు వ్యతిరేకంగా శాంతియుతంగా ఉవ్వెత్తున ఉద్యమం చేశారు.

కరోనా వైరస్ భారతదేశంలో చొరబడుతున్న సమయంలో దేశ రాజధాని న్యూఢిల్లీలో మతవిద్వేషాగ్ని పెచ్చరిల్లుతున్నది. అంతకుముందు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి పోలీసు బలగాలను వినియోగించి విశ్వవిద్యాలయాలపై దాడులు చేయడమే కాక రాష్ట్రంలోని ముస్లింలపై కక్షతీర్చుకునే ప్రయత్నం చేశారు. భారత ముస్లింలు దేశంలోని సెక్యులర్ శక్తులతో కలిపి జాతీయ పౌర పట్టికను నిరోధించేందుకు ఉద్యమాలను కొనసాగించారు.

ఈ జ్ఞాపకాలు మది నుంచి తొలగిపోకముందే ప్రధాని నరేంద్ర మోడీ హఠాత్తుగా దేశవ్యాప్తంగా 21 రోజుల లాక్‌డౌన్ ప్రకటించారు. కోట్లాది మంది కార్మికులు, స్వయం ఉపాధిపై ఆధారపడేవారి జీవనం స్థంభించిపోయింది. జీవనం గడిపేందుకు ఎలాంటి ఏర్పాట్లు చేయకుండానే సామాజిక దూరం పాటించాలని ఆదేశించారు. రాత్రికి రాత్రే పని, ఆహారం, ఆరోగ్య భద్రత కోల్పోయారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో దేశం మొత్తం ఒక్కతాటిపై నిలిచి ఆకలి, నిరుద్యోగంతో పాటు ఈ మహమ్మారికి వ్యతిరేకంగా కలిసి పోరాటం చేయాల్సి ఉంది.

**పాలకుల పాచికలే వేరు**

భారత పాలకులకు వేరే ప్రణాళికలున్నాయి. ఛాందస సనాతన ముస్లిం బృందం తబ్లిఘి జమాత్ మార్చి 13-15 తేదీలలో ఢిల్లీలోని పశ్చిమ నిజాముద్దీన్ వద్ద గల తమ ఐదంతస్తుల భవనంలో అధికారుల నుండి అన్ని విధాలైన అనుమతులను తీసుకొని, మర్కజ్ పేరుతో అంతర్జాతీయ సమ్మేళనాన్ని నిర్వహించింది. దీనికి మలేషియా, ఇండోనేషియాలతో పాటు పలు దేశాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. తీవ్రమైన అవివేకంతో నిర్వహించిన ఈ సమ్మేళనం వల్ల ఎన్నో జీవితాలు మూల్యం చెల్లించాల్సి వచ్చింది. అయితే అదేసమయంలో అనేక రాజకీయపరమైన, మతపరమైన, సామాజిక సమావేశాలు అనేకం జరిగాయి. తబ్లిఘి సమావేశానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతులున్నాయి. వేల సంఖ్యలో హాజరైన అదేవిధమైన సమ్మేళనాలు గుజరాత్‌లోని హిందూ దేవాలయాలలో, పంజాబ్‌లోని సిక్కులు, ఇంకా దేశంలోని ఇతర ప్రాంతాలలో నిర్వహించినప్పటికీ వాటిని గురించి మీడియా ప్రచారం చేయటం లేదు.

**నిజాముద్దీన్ కరోనా విస్తృతికి హాట్‌స్పాట్‌గా ఎలామారింది?**

లాక్‌డౌన్ షాక్‌తో దేశ ప్రజలు వైరస్ విస్తృతికి



epaper.prajasakti.com

**❝ దేశవ్యాప్తంగా ముస్లింల పట్ల వ్యతిరేకత ప్రబలేందుకు వీలుగా బిజెపి ఐటి సెల్ ద్వారా సామాజిక మాధ్యమాలలో పెద్ద ఎత్తున ప్రచారం సాగించారు. ఇంటర్నెట్ ద్వారా తప్పుడు వీడియోలతో ముస్లిం వ్యతిరేకత పెంచేందుకు ప్రయత్నించారు. ముస్లింలు కాయగూరలకు, పండ్లకు ఉమ్మిని పూస్తున్నట్టు, రెస్టారెంట్లలో ఆహారపదార్థాలపై ఉమ్ముతున్నట్టు, ఇతర ప్రజల ముఖాలపై దగ్గుతూ ముస్లిమేతరులు వైరస్ బారిన పడేందుకు ప్రయత్నిస్తున్నట్టు ఆ వీడియోల్లో చూపించారు. ❞**

సంబంధించిన సమాచారం తెలుసుకునేందుకు టెలివిజన్లకు, స్మార్ట్‌ఫోన్లకు అంటిపెట్టుకు పోయారు. తబ్లిఘి సమావేశం కారణంగానే వైరస్ దేశమంతటా ప్రబలిందనే ప్రచారానికి అధికారికంగా ఇస్తున్న వివరణలు తోడైనాయి. ఢిల్లీ ప్రభుత్వం కోవిడ్‌కు సంబంధించిన తమ వివరణల్లో ''మర్కజ్ మజీద్'' కేసులని ప్రస్తావించాయి. ఈ మొత్తం వ్యవహారంలో గణాంకాల గారడీ ఉందని షోయబ్ డానియెల్ వేలెత్తి చూపించారు. జమాత్‌కు సంబంధించిన 25000 మందిని గుర్తించి వారికి పరీక్షలు నిర్వహించారు. అదేసమయంలో నిర్వహించిన ఇతర మతపరమైన, రాజకీయపరమైన సభలకు హాజరైన వారిని, అధికార పార్టీ తోడ్పాటుతో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రితో సహా సీనియర్ నాయకులు హాజరయిన సమావేశాలకు వచ్చినవారిని తబ్లిఘికి హాజరైనవారితో పోలిస్తే నామమాత్రంగా మాత్రమే పరీక్షించారు. ఎక్కువమందిని పరీక్షించిన కారణంగా తబ్లిఘి జమాత్ నుంచి వచ్చినవారిలో కోవిడ్-19 బారినపడ్డవారిసంఖ్య ఎక్కువగా ఉంది.

దేశవ్యాప్తంగా ముస్లింల పట్ల వ్యతిరేకత ప్రబలేందుకు వీలుగా బిజెపి ఐటి సెల్ ద్వారా సామాజిక మాధ్యమాలలో పెద్ద ఎత్తున ప్రచారం సాగించారు. ఇంటర్నెట్ ద్వారా తప్పుడు వీడియోలతో ముస్లిం వ్యతిరేకత పెంచేందుకు ప్రయత్నించారు. ముస్లింలు కాయగూరలకు, పండ్లకు ఉమ్మిని పూస్తున్నట్టు, రెస్టారెంట్లలో ఆహారపదార్థాలపై ఉమ్ముతున్నట్టు, ఇతర ప్రజల ముఖాలపై దగ్గుతూ ముస్లిమేతరులు వైరస్ బారిన పడేందుకు ప్రయత్నిస్తున్నట్టు ఆ వీడియోల్లో చూపించారు. అలాగే ముస్లింలు పరీక్ష చేయించుకునేందుకు తిరస్కరిస్తున్నారని, ప్రార్థనల కోసం పెద్ద సంఖ్యలో మసీదుల వద్దకు వచ్చి లాక్‌డౌన్ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని, తబ్లిఘి జమాత్ అనుభవం నుంచి వారు ఎంతమాత్రం పాఠాలు నేర్చుకోలేదని ప్రచారం చేశారు.

ఫలితంగా దారుణమైన ప్రభావం కనిపించింది. దేశంలోని ముస్లిమేతరులు వైరస్‌కు కారణమైన తబ్లిఘి జమాత్‌కు హాజరైనవారిని ఉగ్రవాదులతో సమానంగా పరిగణించారు. ఈ ప్రచారం ఫలితంగా జమాత్ సభ్యులు ఇద్దరు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిసింది. ఉన జిల్లాకు చెందిన దిల్‌షాద్ మహమ్మద్ అనే 38 యేళ్ల చిరువ్యాపారి ఢిల్లీ సమావేశానికి వెళ్లి వచ్చాక క్వారంటైన్‌లో ఉండి ఫలితాలు నెగటివ్ అని వచ్చాక ఇంటికి వచ్చాడు. ఇరుగుపొరుగు వారి ఎత్తిపొడుపు మాటలు భరించలేక ఏప్రిల్



అహ్మదాబాద్‌లో కరోనా లాక్‌డౌన్ అమలుకు మోహరించబడిన రాపిడ్ యాక్షన్ ఫోర్స్ వెనుక నడుస్తున్న ముస్లిం మహిళలు: దేశంలోని మితవాద శక్తులు కరోనా మహమ్మారిని ఉపయోగించుకుని ముస్లింలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు

5న ముంజేయి కోసుకుని తరువాత ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొద్దిరోజుల తరువాత జమాత్‌కు హాజరైనవారిలో అస్సాంకు చెందిన 30 యేళ్ల వ్యక్తి వైరల్ ఇన్ఫెక్షన్ సోకి పాజిటివ్ రావడంలో మహారాష్ట్రలోని అకోలా ఆస్పత్రిలో గొంతు కోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

ముస్లింల కారణంగా దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి చెందిందనే విద్వేష ప్రచారం ప్రబలడంతో జమాత్ పట్ల, ముస్లింల పట్ల వ్యతిరేకత పెరిగి పలుచోట్ల మూకుమ్మడి దాడులు జరుగుతున్నాయి. ఈ సంఘటనల్లో చాలా తక్కువ మాత్రమే వెలుగులోకి వస్తున్నాయి. అరుణాచల్‌ప్రదేశ్‌లో ముస్లిం ట్రక్కు డ్రైవర్లపై దాడులు జరిగాయి. హర్యానా గుర్‌గావ్‌లోని ధన్‌కోట్ గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు మసీదును కాల్చివేశారు. వాయవ్య ఢిల్లీలో ముఖమల్‌పూర్ గ్రామంలో 200 మంది దాడి చేసి మసీదు ధ్వంసం చేశారని ఢిల్లీ మైనారిటీ కమిషన్ చైర్‌పర్సన్ జఫరుల్ ఇస్లాం తెలియజేశారు. కర్నాటకలో వివిధ ప్రాంతాల్లో ముస్లింలపై గుండాల దాడులు జరుగుతున్నట్టు వరుస కథనాలు తెలియజేస్తున్నాయి. బాగల్‌కోట్ జిల్లా బిదరి గ్రామంలో కృష్ణానదిలో చేపలు పట్టుకుంటున్న ముస్లింలపై దాడులు చేసి అవమానపరుస్తున్నారు. దాడి చేసిన ఒక సంఘటనలోని వీడియో మాటలను బట్టి దాడికి పాల్పడినవారు "మీ(ముస్లింలు) కారణంగానే వైరస్ వ్యాపిస్తున్నది" అంటున్నారు. అదే జిల్లాలోని కదకూరప్ప గ్రామంలో మసీదులో ప్రార్థనలు చేస్తున్న వారిపై దాడులు జరిగాయి. బెళగవిలో ఏప్రిల్ 5 రాత్రి ప్రధాని పిలుపు ఇచ్చినట్లు లైట్లు ఆర్పకుండా ఉన్న రెండు మసీదులపై దాడులు జరిగాయి. దాడులు జాబితా ఇంకా పెరుగుతూ పోతూనే ఉంది. జాతీయ స్థాయిలో లాక్‌డౌన్ కొనసాగుతున్న కాలంలోనే ఈ దాడులు జరుగుతున్నాయనే విషయం మనం గుర్తుంచుకోవాలి.

ఈ ఫోబియా కొన్ని సందర్భాల్లో విచిత్రమైన పోకడలు పోతున్నది. అనేక కర్నాటక వార్తాపత్రికల్లో వచ్చిన కథనం ఇది. కృష్ణరాజపేట తాలూకా టెండెకెరె సమీపంలో ఏప్రిల్ 8న లాక్‌డౌన్‌ను ఉల్లంఘించి ఒక ఆటోలో ముగ్గురు వ్యక్తులు ప్రయాణిస్తున్నారు. పోలీసులతో వివాదానికి దిగినవారు " మేం



epaper.prajasakti.com

చరిత్ర

# సింధు ప్రజల విస్తృత వాణిజ్యం



రచయిత సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

ఎంవిఎస్ శర్మ

సింధు నాగరికత విలసిల్లిన కాలంలో వాణిజ్యం విస్తృతంగా సాగింది. మొహంజదారో, హరప్పా పట్టణాలతో బాటు కాలీబాగన్ (ప్రస్తుత రాజస్థాన్‌లో) లోథల్ (ప్రస్తుత గుజరాత్‌లో) వంటి పట్టణాలు ఈ వాణిజ్యం యొక్క విస్తృతిని సూచిస్తున్నాయి. ఈ వాణిజ్యం మూడు స్థాయిలలో జరిగింది. మొదటిది: గ్రామాలకు, పట్టణానికి నడుమ: రెండవది: సింధునాగరికత విస్తరించిన మొత్తం ప్రాంతం అంతటా ఒక మూల నుంచి ఇంకొక మూలకు సాగిన దూర ప్రాంత వ్యాపారం: మూడవది: సింధు ప్రాంతానికి ఆవల భూగోళం మీద ఇతర ప్రదేశాలతో జరిగిన వ్యాపారం.

గ్రామాల నుండి పట్టణాలకు ప్రధానంగా ధాన్యం వర్తకం జరిగేది. మొహంజదారో, హరప్పా నగరాల్లో బైటపడిన పెద్ద పెద్ద ధాన్యాగారాలు ఈ వ్యాపార విస్తృతిని సూచిస్తున్నాయి. ఎద్దుబళ్లు, నదీమార్గాన అయితే చిన్నపడవలు ఈ ధాన్యం రవాణాలో వినియోగించారు. పట్టణాల్లో సాగిన మరో వ్యాపారం చేతివృత్తులు. శంఖాలు, కెంపులు, రంగు చలువలరాళ్లు, చెకుముకి రాళ్లు వంటివి పనిముట్ల తయారీతో ఆభరణాల తయారీలో వాడేవారు. సముద్రతీరాల్లో దొరికే శంఖాలు సముద్రానికి దూరంగా ఉండే పట్టణాల్లోని చేతివృత్తుల ఉత్పత్తి కేంద్రాల వద్ద లభించాయి. దీనినిబట్టి సుదూరప్రాంతాలకు ఈ రకమైన సరుకులను తీసుకుపోయి వ్యాపారం చేసినట్టు స్పష్టం అవుతోంది. సింధు, దాని ఉపనదుల ప్రవాహ మార్గాలు ఈ సరుకు రవాణాకి బాగా తోడ్పడ్డాయి. దూరప్రాంతాలకు రహదారులు ఏర్పడని ఆ కాలంలో అంతంత దూరాలకు ఎడ్లబండ్లపై సరుకులను రవాణా చేయడం కష్టం అవుతుంది.

సింధు నాగరికత ప్రాంతం అంతటా ఇటుకలు ఒకే విధమైన కొలతలతో తయారై ఉన్నాయని మనం గతంలోనే చెప్పుకున్నాం. వీటిని కొన్ని కేంద్రాలలో ఉత్పత్తి చేసి అన్ని ప్రాంతాలకూ తరలించి ఉంటారని అనుకోలేం. అంత భారీ పరిమాణంలో ఇటుకలను వేరువేరు ప్రాంతాలకు తరలించగలిగే రవాణా సాధనాలు ఆ కాలంలో లేవు. కనుక ఇటుకల తయారీ టెక్నాలజీని అన్ని నగరాల్లోకి దిగుమతి చేసుకుని ఆ నైపుణ్యాన్ని వాడుకున్నారని భావించాలి.

ఐతే ఆ కాలంలో వ్యాపారం జరిగిందంటే సరుకుల మార్పిడి, లేదా కొనుగోళ్లు, అమ్మకాలు ఏ ప్రాతిపదికన జరిగి ఉండాలి? సింధు నాగరికత తవ్వకాలలో నాణేలు ఎక్కడా లభించలేదు. సరుకుల మార్పిడికే (బార్టరు పద్ధతికే) పరిమితం అయితే అంత విస్తృతంగా వ్యాపారం జరిగే అవకాశం లేదు. కనుక మారకపు సాధనాలుగా నిర్దిష్ట పరిమాణంలో ధాన్యం, లేదా కెంపులు, రంగురాళ్లు, శంఖాలు వంటివి ఉపయోగపడి ఉండాలి. వీటితోపాటు అక్కడ విస్తారంగా లభించిన సీళ్లు కూడా ఒక విధమైన హామీగా (నేటి ప్రామిసరీ నోట్లు మాదిరి) ఉపయోగించి ఉండాలి. ఈ సీళ్లు ఒకే నిర్దిష్టమైన సైజులో ఉన్నాయి. అయితే ప్రతీ వర్తకునికీ ప్రత్యేకమైన సీళ్లు ఉండి వుండొచ్చు. ఆ సీళ్లమీద ఉన్న గుర్తులు, బొమ్మలు బట్టి ఈ అంశం ధృవపడుతోంది.

రాజస్థాన్ ప్రాంతం ఈ వ్యాపారంలో ఒక కేంద్రస్థానం కలిగి ఉంది. ఇక్కడ విస్తారంగా లభించిన రాగి నిల్వలు ఇందుకు కారణం. మొత్తం సింధు నాగరికత విస్తరించిన ప్రాంతం అంతటికీ రాగి పరికరాలను సరఫరా చేసే కేంద్రాలు ఈ రాజస్థాన్ ప్రాంతపు పట్టణాల నుండి పనిచేశాయి. కాశ్మీర్ ప్రాంతంలో ఇదే కాలంలో (క్రీ.పూ 2500-2000 మధ్య) పింగాణీ సరుకుల తయారీ సాగింది. అక్కడి పింగాణీ సరుకులు సింధు ప్రాంతానికి వచ్చి వుండొచ్చు. దానితో పాటు సింధు ప్రాంత హస్తకళా శిల్పులు ఉంగరాల్లో, గొలుసుల్లో ఉపయోగించిన మరకతపు రాళ్లు కాశ్మీర్ నుంచే తెచ్చుకుని ఉండాలి. చైనాలోని ఖోటాన్‌ప్రాంతం (ప్రస్తుత సిన్ జియాంగ్) నుండి కాశ్మీర్ వ్యాపారులు కారకోరం పర్వత శ్రేణుల గుండా ఈ మరకతపు రాళ్లను దిగుమతి చేసుకున్నారు.

ఇటు సింధు ప్రాంతానికి దిగువన ప్రస్తుత మహారాష్ట్రలోని ఎగువ గోదావరి లోయ ప్రాంతాల్లో క్రీ.పూ 1900-1700 మధ్యకాలానికి చెందిన కొన్ని అవశేషాలు చూస్తే అక్కడ సింధు ప్రాంతపు సీళ్లు, రంగురాళ్లు దొరికాయి. అటువంటి ఆధారాలే మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని ప్రాంతంలోనూ దొరికాయి. దీనిని బట్టి అటు కాశ్మీర్ నుండి ఇటు మధ్యప్రదేశ్- మహారాష్ట్ర వరకూ సింధు నాగరికత కాలంలో వ్యాపారం జరిగినట్టు భావించాలి.

ఇక సింధు నాగరికత తవ్వకాలలో దొరికిన ఆధారాలను బట్టి పరిమితంగానైనా సింధు ప్రజలు వెండి లోహాన్ని ఉపయోగించిన దాఖలాలు ఉన్నాయి. ఉత్తర ఆఫ్ఘనిస్తాన్ ప్రాంతంలోని పంజ్‌శిర్ లోయ నుండి ఎక్కువ భాగం వెండి నదీ మార్గాల గుండా సింధు ప్రాంతానికి రవాణా అయింది. ఇంద్రనీల మణి రాళ్లు విస్తృతంగా దొరికే ప్రాంతం కూడా ఇదే. ఆ రాళ్లు కూడా సింధు ప్రాంతానికి ఎగుమతి అయ్యాయి.

ఆఫ్ఘనిస్తాన్ నుంచి మరింత ఉత్తర వాయవ్య దిశగా ఉన్న తుర్క్‌మెనిస్థాన్‌లో దొరికిన ఆధారాలను బట్టి సింధు ప్రజలకు ఇక్కడి ప్రజలతో వ్యాపార సంబంధాలు ఉండినట్టు కనపడుతోంది. ఇరాన్‌లో, ఒమన్ సింధుశాఖలో, ఇరాక్‌లో దొరికిన ఆధారాలు, సీళ్లు, రంగురాళ్లు, కుండలు, పనిముట్లు సింధు నాగరిక ప్రజలు



epaper.prajasakti.com

> “ అధికారులిస్తున్న సమాచారం అందులో వాడు వాడుతున్న భాష, భావం తబ్లిఘి జమాత్ ద్వారా దేశంలోని ముస్లింలందరి కారణంగా వైరస్ వ్యాప్తి జరిగిందనే నేరారోపణ కలిగించే రీతిలో అభిప్రాయం కలిగిస్తున్నారు. ఒక కేంద్రమంత్రి (ఆయనే మైనారిటీల సంక్షేమ శాఖ చూస్తున్నారు) తబ్లిఘి సమావేశాన్ని తాలిబన్ నేరంగా అభివర్ణిస్తున్నారు. ”

ముస్లింలం, కరోనా బారినపడ్డాం. మీరు మమ్మల్ని పట్టుకోవాలని చూస్తే మీకు కరోనా అంటించి చంపేస్తాం.” అని బెదిరించారు. తీరా వారి గురించి ఆరా తీస్తే వారిపేర్లు మహేష్, అభిషేక్, శ్రీనివాస్ అని తేలింది.

**ముస్లింలను బహిష్కరించాలనే పిలుపు**

దేశవ్యాప్తంగా నిరుపేదలకు ఆహారం పంపిణీ చేసే కారవాన్–ఇ–మొహబ్బత్ సంస్థకు చెందిన ముస్లిం వలంటీర్లు హిందువులు ఉండే ప్రాంతాల్లో రేషన్ పంపిణీ చేయడానికి వెళ్లిన సందర్భంలో వారిని వెళ్లగొట్టారు. స్వరాజ్ అభియాన్ వలంటీర్లకు బెంగుళూరులో అదే పరిస్థితి ఎదురైంది. వలస కార్మికులకు ఆహారం పంపిణీ చేయడానికి వచ్చినవారిపై క్రికెట్ బ్యాట్లతో దాడి చేశారు. సయ్యద్ తబ్రేజ్ క్వింట్‌కు తెలియజేసిన సమాచారం ప్రకారం ‘వారు మాతో అన్నదేమిటంటే మీరు ఆహారం పంచడాన్ని అనుమతించం, ఎందుకంటే మీరంతా నిజాముద్దీన్ నుంచి వచ్చారు, మీ వల్లనే వైరస్ విస్తరిస్తున్నది....’

వీటికితోడుగా ముస్లిం విక్రేతలపై సామాజిక, ఆర్థిక నిర్బంధాలకు పిలుపిచ్చారు. ఈ బహిష్కరణ పిలుపులు కొన్ని చోట్ల హింసకు దారితీస్తున్నాయి. ఈ బహిష్కరణ పిలుపులు ఢిల్లీ, ఉత్తరాఖండ్‌లోని హల్ద్వని, పంజాబ్‌లోని హొషియార్‌పూర్ లోని గుజ్జర్ ముస్లిం పాల అమ్మకందార్లు, మధ్యతరగతి, ఉన్నత వర్గాలకు కూడా విస్తరించినట్టు సమాచారం తెలుపుతున్నది. వైర్‌లో ప్రచురితమైన సమాచారం ప్రకారం పాలవ్యాపారులను కొట్టి పాలను నదిలో పారబోశారు. ముస్లింలను బహిష్కరించమని, వారిని గ్రామాల్లోకి రానివ్వవద్దని కోరుతూ అస్సాం, కర్నాటకలతో సహా అనేక రాష్ట్రాల్లో పోస్టర్లు వెలిశాయి.

**మతపరమైన వైరస్ అంటే సామూహిక మూఢత్వమే**

కోవిడ్–19 వైరస్ మహమ్మారి, ప్రాణాంతకమైనదని మనందరికీ తెలుసు. కానీ లాక్‌డౌన్ ప్రకటించిన కొద్దిరోజులకే భారతదేశంలో ముస్లిమేతరులను మట్టుబెట్టేందుకు ముస్లింలు పన్నిన కుట్ర అని మితవాదశక్తులు, వారి తాబేదార్లు చేసిన ప్రచారంతో ప్రజలను కొంతమేరకు నమ్మించగలిగారు. ఇస్లాం పట్ల వ్యతిరేకత లేని కొందరు కార్మికులతో నేను మాట్లాడినప్పుడు ఆ విషయం అర్ధమైంది. భారత ముస్లింల కారణంగానే ఈ ప్రాణాంతక వైరస్ దేశమంతా వ్యాపించిందని దాదాపు అందరూ నమ్ముతున్నారు. మతపరమైన విద్వేషం కారణంగా పెద్ద బృందాలుగా చేరి ప్రార్ధనలు చేస్తున్నారని లేదా ముస్లిమేతరులకు వైరస్ సోకేట్టు చేయడం ద్వారా వారిని చంపేయాలనుకుంటున్నారనే అభిప్రాయాలను వారు విశ్వసిస్తున్నారు.

అధికారులిస్తున్న సమాచారం అందులో వాడు వాడుతున్న భాష, భావం తబ్లిఘి జమాత్ ద్వారా దేశంలోని ముస్లింలందరి కారణంగా వైరస్ వ్యాప్తి జరిగిందనే నేరారోపణ కలిగించే రీతిలో అభిప్రాయం కలిగిస్తున్నారు. ఒక కేంద్రమంత్రి (ఆయనే మైనారిటీల సంక్షేమ శాఖ చూస్తున్నారు) తబ్లిఘి సమావేశాన్ని తాలిబన్ నేరంగా అభివర్ణిస్తున్నారు.

అప్పటివరకు లాక్‌డౌన్ ఆరంభ దినాల్లో ప్రజల మనసుల్లో ముద్రవేసుకున్నది వందలాది కిలోమీటర్ల పొడవున బిడ్డాపాపలతో నడుచుకుంటూ తమ గ్రామాలకు వెళుతున్న వలస కార్మికుల చిత్రాలే. కేంద్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే అనేక ప్రశ్నలు ముందుకొచ్చాయి. చాలా ముందుగానే తెలిసినప్పటికీ పెద్ద సభలు, సమావేశాల నిర్వహణపై ఎందుకు ఆంక్షలు విధించలేదు, కొన్ని వారాల ముందుగానే అవసరమైన వైద్యపరికరాలు, టెస్టింగ్ కిట్‌ల తయారీ పనులు చేపట్టలేదు తదితరాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

కాని సాధారణ సమయాలలో కూడా ముస్లిం వ్యతిరేకతతో ఉండే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు చెందినవారు భారీస్థాయిలో ముస్లిం వ్యతిరేక ధోరణితో ప్రచారం సాగించారు. ముస్లింలకున్న మతవిద్వేష ధోరణితో పాటు వారి సామాజిక బాధ్యతా రాహిత్యం కారణంగా కోవిడ్–19 దేశంలో ప్రబలడానికి కారణమని సమర్ధించారు. సాధారణ హిందువులెవరూ మతపరమైన విద్వేషాలతో లేరు. కానీ ఆశ్చర్యకరమైన విధంగా సాటి ముస్లింలు తమతోటి హిందువులలో కోవిడ్ వైరస్‌ను ప్రవేశపెడుతున్నారన్న మతవిద్వేష ప్రచారం దేశంలోని స్త్రీ పురుషుల్లో పెద్దఎత్తున సాగించడం ద్వారా చాలా సులువుగా ఈ అభిప్రాయాన్ని వారి మనసుల్లో చొప్పించగలిగారు.

ఈ భయాలన్నింటికీ తోడుగా మహమ్మారి కారణంగా కోల్పోతున్న ప్రాణాలకు, లాక్‌డౌన్ వల్ల జరుగుతున్న నష్టానికి తోడుగా ముస్లిం సహోదరులు మరింత ఎక్కువగా నష్టపోతున్నారు. వాస్తవానికి ఇతర సామాజిక–మతపరమైన వర్గాల కన్నా పట్టణ ప్రాంత ముస్లింలు ఎక్కువమంది స్వయం ఉపాధితో చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారిలో అధికశాతం కార్మికులుగా నమోదు చేయించుకోని కారణంగా రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు అందించిన తాత్కాలిక ఆరిక సహాయం కూడా పొందలేకపోయారు.

ఇతర భారతీయులు భయంతో, నష్టంతో, ఉపాధి కోల్పోయి, ఉన్న గూడు వదిలేసి ఆకలితో భయపెడుతున్న మహమ్మారితో లోకంలోని ఏ ప్రభుత్వం ఇప్పటికీ వైరస్‌ను జయించలేకపోయిన స్థితిలో ఉంటే ముస్లింలు వాటితో పాటు పొరుగువారి నుంచి ఊహించని స్థాయిలో తీవ్రమైన వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. దిక్కుతోచని ఈ పరిస్థితుల్లో ముస్లిం సహోదరులు ఇతర ప్రజలతో పాటు పేదరికం, ఉపాధి కోల్పోయిన స్థితితో ఈ రోజు తీవ్రమవుతున్న జాతీయ సంక్షోభం నుంచి బయటపడేందుకు ప్రయత్నించాలి.

❊



epaper.prajasakti.com

**❝ ఇరాన్‌లో, ఒమన్ సింధుశాఖలో, ఇరాక్‌లో దొరికిన ఆధారాలు, సీళ్లు, రంగురాళ్లు, కుండలు, పనిముట్లు సింధు నాగరిక ప్రజలు ఆ ప్రాంతాలతో వ్యాపార సంబంధాలు కలిగి వున్నట్లు స్పష్టం చేస్తున్నాయి. నేటికి 4,500 సంవత్సరాల క్రితం ఇటు చైనా నుంచి అటు మెసపుటోమియా (ఇరాక్) వరకు వ్యాపార సంబంధాలు కలిగి ఉండడం అందునా ఎటువంటి సమాచార వ్యవస్థా అభివృద్ధి చెందని కాలంలో ఇది జరగడం ఆశ్చర్యం గొలిపే విషయం. ❞**

ఆ ప్రాంతాలతో వ్యాపార సంబంధాలు కలిగివున్నట్లు స్పష్టం చేస్తున్నాయి. అరేబియా సముద్ర తీరం వెంబడి తెప్పలలో వ్యాపారులు ఈ రాకపోకలను సాగించి ఉండాలి.

నేటికి 4,500 సంవత్సరాల క్రితం ఇటు చైనా నుంచి అటు మెసపుటోమియా (ఇరాక్) వరకు వ్యాపార సంబంధాలు కలిగి ఉండడం అందునా ఎటువంటి సమాచార వ్యవస్థా అభివృద్ధి చెందని కాలంలో ఇది జరగడం ఆశ్చర్యం గొలిపే విషయం.

**సింధు నాగరికత**

**లిపి– కళలు– మతం**

సింధు నాగరికత సాధించిన విజయాలలో ఒక ప్రధానమైనది లిపిని కనుగొనడం. ఆ నాగరికత ఆరంభమైన క్రీ.పూ 2500 తో మొదలై అది అంతరించిన క్రీ.పూ 2000తో ఈ లిపి కూడా అదృశ్యం అయిపోయింది. ప్రపంచంలో అతి పురాతనమైన నాలుగు లిపులలో సింధు లిపి ఒకటి. ఇది లోగో– సిలబిక్ లిపి. కొన్ని ప్రాంతాలను/ఘటనలను/ వ్యాపకాలను సూచించే సంకేతాలు 'లోగో' అంటాం. అటువంటి లోగోలతో పాటు కొన్ని అక్షరాల వంటి సంకేతాలను కలగలిపిన లిపి ఇది. అదే కాలంలో మెసపుటేమియా ప్రాంతంలో కూడా ఇదే లక్షణాలు గల లిపి ఉండేది. అయితే దురదృష్టం ఏమంటే ఇంతవరకూ ఈ రెండు లిపులనూ వివరించడం సాధ్యపడలేదు.

మట్టి సీళ్లమీద, రాగి సీళ్లమీద, కుండల మీద ఈ సింధు లిపి లిఖించబడింది. అదే గనుక ఏ వస్త్రాలపైనో, చెట్లబెరళ్లపైనా రాసి ఉంటే ఎప్పుడో నాశనమై మనకు తెలియకుండా పోయేది. ఈ లిపి సాధారణంగా కుడివైపు నుండి ఎడమవైపుకు రాయబడివుంది. (ఉర్దూలిపి మాదిరిగా) ప్రతీ సీలు మీద నాలుగైదు సంకేతాలే ఉన్నాయి. ఇటువంటివి మనకు 4000కు పైగా లభ్యం అయ్యాయి. ఈ సంకేతాల్లో తరచు మత్స్యం గుర్తు (చూ. 2.2 టేబుల్‌లో 1,7,8 గుర్తులు) వస్తుంది. ఇదే గుర్తు 'బ్రహుయ్' అనే ప్రాచీన భాషలో వాడారు. ఇది ఆఫ్ఘనిస్తాన్ ప్రాంతంలో వాడిన భాష. ఈ 'బ్రహుయ్' ఉత్తర ద్రవిడ భాష. దీనిని బట్టి అటు మెసపుటేమియా ఇటు ద్రవిడ సంబంధాలతో సింధు భాష ఉండేదని అనుకోవాలి. ఈ సీళ్లమీద లభించిన భాష బహుశ ఆనాటి మతాధికారులు, ప్రభువులు, వ్యాపార వర్గాలు వాడిన భాష అయి వుండాలి.

ఆ వ్యాపారపు లెక్కలకు, కొలతలకు తూకాలకు వారు వాడిన గణితం ఏ పాటిదో, ఆనాటి వారి శాస్త్ర విజ్ఞానం ఏమిటో, వారికి జామెట్రీ ఎంతమేరకు తెలుసో మనకు ఇదమిత్థంగా తెలియాలంటే సింధు లిపి చిక్కుముడి వీడాల్సిందే. ఐతే వారికి ఎంతో కొంతమేరకు నక్షత్ర మండలంలోని కదలికల గురించిన జ్ఞానం ఉండి వుండాలి. లేకపోతే సుదూర ప్రయాణాలు సాధ్యపడేవి కావు. దొరికిన అస్థిపంజరాలను బట్టి ఆ కాలంలో నొప్పిని శరీరం నుండి తొలగించడానికి పుర్రెకు రంధ్రం చేసే ఆపరేషన్లు (నిజానికి ఇవి చావును వేగవంతం చేస్తాయి) జరిగాయని అర్థం అవుతోంది.

మొహంజదారో తవ్వకాలలో బయటపడిన అరుదైన శిల్పఖండాలు (చూ. 2.16, 2.17) ఆనాటి ప్రజల వేషధారణను, వారు ఉపయోగించిన ఆభరణాలను సూచిస్తున్నాయి. ఐతే ఈ శిల్పఖండాలు చిన్న చిన్న ఆకృతుల్లోనే ఉన్నాయి తప్ప భారీ ఆకృతులు లేవు. అంతేగాక, శిల్పకారులు వీటిని కొందరు సంపన్నుల కోసమే తయారు చేసినట్టు అనిపిస్తుంది.

సింధు ప్రజలు ఒకే ఒక మతాన్ని, ఆరాధన పద్ధతిని ఆచరించారని చెప్పే దాఖలాలు లేవు. వేరు వేరు తరగతుల ప్రజలు, వేరు వేరు ప్రాంతాల్లో రకరకాల మతాచారాలను పాటించారని అనుకోవచ్చు. లభించిన సీళ్లలో అత్యధిక భాగం ఒంటికొమ్ముతో ఉండే మూపురం లేని ఎద్దు ఆకృతితో ఉన్నాయి. ఇటువంటి జంతువు ఖచ్చితంగా కాల్పనిక జంతువే. (చూ. 2.18) కొన్నింటిపై అడవి దున్న, కొన్నింటిపై మూపురం ఉన్న ఎద్దు ఆకృతులు ఉన్నాయి. ఎక్కడా ఆవు ఆకృతి ఉన్న సీళ్లు లేవు. కుందేళ్లు, గేదె ఆకృతులు కూడా ఉన్నాయి. బహుశ ప్రతీ గణమూ ఏదో ఒక జంతువును తన చిహ్నంగా ఎంచుకుంటుంది గనుక ఈ సీళ్లు ఆయా గణాలను సూచించేవిగా పరిగణించాలి.

వివిధ జంతువులు చుట్టూ చేరి వుండగా యోగముద్రలో కూచికుని ఉన్న ఒక ఆకృతిని చిత్రీకరించిన సీలు ఒకటి దొరికింది. ఇది మెసపుటేమియా ప్రాంతంలో ఆరాధించిన జంతుముఖపు దేవతల బొమ్మల మాదిరే ఉంది. (చూ. 2.19) ఇంకొక సీలు మీద పులి శరీరంతో ఉన్న దేవత బొమ్మ ఉంది (చూ. 2.23) మరొక సీలులో వృక్ష దేవత బొమ్మ ఉంది. చుట్టూ మనుషులు ఉన్నట్టుగా చిత్రీకరించబడింది. ఇవన్నీ ఆనాటి మతారాధనలను తెలియజేస్తున్నాయి. ప్రధానంగా ప్రకృతి దేవతలను, జంతు ఆకృతులతో కూడిన దేవతామూర్తులను ఆరాధించే విధానాలనే సింధు ప్రజలు పాటించినట్టు సూచిస్తున్నాయి. ఈ మతారాధనలకు, రుగ్వేదంలో ప్రస్తావనకు వచ్చే ఆరాధన పద్ధతులకు, దేవతామూర్తులకు బొత్తిగా ఎటువంటి సంబంధమూ లేదు. ఇళ్లల్లో స్త్రీ మూర్తులను పూజించిన దాఖలాలు ఉన్నాయి. మట్టితో చేసిన దేవతల విగ్రహాలు (చూ. 2.21) లభించాయి. ఎక్కడా పురుషమూర్తులను ఆరాధించిన దాఖలాలు లేవు. వేదకాలంలో విరివిగా ఆచరించిన జంతుబలులు వంటివి సింధు నాగరికత కాలంలో ఆచరించిన దాఖలాలు ఎక్కడా లేవు.

మరణించిన వారి దేహాలను ఖననం చేయడమే అన్నిప్రాంతాలలోనూ ఆచరించినట్టు దాఖలాలు ఉన్నాయి. దహనం చేసే ఆచారం లేదు. మరణానంతర జీవితంపై ప్రజలకి విశ్వాసాలుండేవి అనడానికి నిదర్శనంగా పాతిపెట్టిన దేహాల పక్కనే వారు వాడిన ఆభరణాలను, తిండి గింజలను ఉంచినట్టు తవ్వకాలు తెలియజేశాయి. ❋



epaper.prajasakti.com

# పేరుకే స్వదేశీ అంతా విదేశీనే

ఎ కోటిరెడ్డి

ఆర్ఎస్ఎస్ ఫాసిస్టు విధానాలను అనుసరిస్తున్నది. యువకులకు అర్ధసైనిక శిక్షణ ఇవ్వటం, తమను వ్యతిరేకించే వారిని బెదిరించటం, దాడులు చేసి లంగదీసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నది. అప్పటికి కూడా తమ మాట వినకపోతే హత్యలు చేయటాన్ని కూడా ఆ సంస్థ కొనసాగిస్తున్నది. దేశభక్తికి తామే గుత్తకు తీసుకున్నామని ప్రచారం చేసుకొంటూ ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులు దేశ ప్రయోజనాల కోసం పనిచేయరని దుష్ప్రచారం చేస్తున్నారు. దేశ ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కల్పించే, దేశ విచ్ఛిన్నానికి దోహదం చేసే తమ విధానాలను కప్పిపెట్టుకోవటానికే ఆర్ఎస్ఎస్ ఇటువంటి ప్రచారం చేస్తున్నది. తాము మాత్రమే సిసలైన జాతీయవాదులమని, దేశ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నామని, మిగతా వారంతా దేశద్రోహులని సంఘ్ పరివార్ ప్రచారం చేసుకొంటున్నది.

సంఘ్ పరివార్ మాటలకు, చేతలకు పొంతన ఉండదు. నిత్యం స్వదేశీ జపం చేసే ఆర్ఎస్ఎస్ మనదేశంలోని ప్రజలను అణచివేయటానికి విదేశాలలో నియంతలు అనుసరించిన విధానాలను అనుసరిస్తున్నది. వారి విధానాలను మనదేశంలో అనుసరించటానికి పక్కాగా ప్రణాళిక రూపొందించింది. హిందువులను ఐక్యం చేయాలని, సైనికీకరించాలని ఆర్ఎస్ఎస్చేస్తున్న ప్రచారం ఆ ప్రణాళికలో భాగమే. దానిని అమలు చేయటం కోసం వారి శాఖలలో అర్ధసైనిక శిక్షణ ఇస్తున్నారు. అనధికారికంగా రకరకాల సంఘాలను ఏర్పాటు చేసి తుపాకులు, బాంబులు తదితరాలను తయారు చేయటం, వినియోగించే విధంగా శిక్షణ ఇస్తున్నారు. ఈ విధంగా శిక్షణ పొందినవారే హేతువాదులైన ప్రొఫెసర్ కల్బుర్గి, గోవింద పన్సారే, దబోల్కర్, గౌరిలంకేశ్ తదితరులను హత్య చేశారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా తమ అభిప్రాయాలను ప్రచారం చేసుకోవచ్చు. ఆ ప్రచారం నచ్చనివారు తమ అభిప్రాయాలనూ ప్రచారం చేసుకోవచ్చు. ఇది ప్రజాస్వామ్య పద్ధతి. మనదేశంలో ఇవే విధానాలు అమలు జరుగుతున్నది. కాని ఆర్ఎస్ఎస్ దీనిని అంగీకరించదు. తన అభిప్రాయాలనే అందరూ అంగీకరించాలని డిమాండ్ చేస్తుంది. తమ విధానాలను వ్యతిరేకించే వారు వారి అభిప్రాయాలను ప్రచారం చేసుకోవటాన్ని అంగీకరించదు. ఆర్ఎస్ఎస్‌కు ప్రజాస్వామ్యంలో నమ్మకం లేదు. కాబట్టే ఈ విధంగా వ్యవహరిస్తున్నది. అందువలన తన భావాలను వ్యతిరేకించే వారితో వాదప్రతివాదనలతో సమాధానం చెప్పటం కాకుండా బెదిరింపులు, హత్యల ద్వారా ప్రత్యర్థులను కట్టడి చేయాలని చూస్తుంది. ఈ విధానాలను జర్మని, ఇటలీ, జపాన్, రష్యా తదితర దేశాలలోని ఫాసిస్టులు అమలు చేశారు. ఆర్ఎస్ఎస్ వాటిని ఆదర్శంగా తీసుకొని మనదేశంలో అమలు చేయటానికి పూనుకున్నది.

కాలం చెల్లిన పురాతన భావాలను, విధానాలను ఆధునిక సమాజం అంగీకరించదని, తమ భావజాలాన్ని సమాజంపై రుద్దాలంటే బలప్రయోగమే మార్గమని హిందుత్వవాదులు భావిస్తున్నారు. కాబట్టి అందుకోసం ఒక సంఘటిత సంస్థగా ఆర్ఎస్ఎస్‌ను ఏర్పాటు చేసి, తమ కార్యకర్తలుగా ఉన్నవారికి సైనికశిక్షణ ఇవ్వటం ప్రారంభించారు. ఆర్ఎస్ఎస్‌ను ఏర్పాటు చేసిన హెడ్గేవార్‌కు అత్యంత సన్నిహితుడైన మూంజి 1930 వ దశాబ్దంలో యూరప్‌లో పర్యటించి అక్కడ ఫాసిస్టు సంస్థలు అనుసరిస్తున్న శిక్షణా పద్ధతులను పరిశీలించాడు. వాటిని మనదేశంలో కూడా ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకున్నారు. తాము భావిస్తున్న విధంగా హిందు సమాజాన్ని మార్చటానికి యువకులకు సైనికశిక్షణ ఇవ్వటం, హిందువులను సైనికీకరణ చేయటం అవసరమని హిందుత్వవాదులు భావించారు.

### ముసోలినిని చూసి ఉత్తేజం పొందిన మూంజి

1931లో మూంజి జరిపిన యూరప్ యాత్రలో ఇటలీలో మార్చి 15 నుండి 24 తేదీ వరకు ఉన్నాడు. అక్కడ అనుసరిస్తున్న ఫాసిస్టు విధానాలపై ముసోలినితో చర్చలు జరిపాడు. సైనిక పాఠశాలలు, కాలేజీలు, వ్యాయామశాలలు, ఫాసిస్టు సైనిక శిక్షణాకేంద్రాలు, యువజన శిక్షణా కేంద్రాలను సందర్శించాడు. యువజన శిక్షణా కేంద్రాలు విద్యనందించటం కన్నా ఫాసిస్టు సిద్ధాంతంలో శిక్షణ ఇవ్వటమే ప్రధానంగా చేస్తున్నాయి. బాలలు, యువకులను 6-18 సంవత్సరాల మధ్య వయసులో రిక్రూట్ చేసుకుంటున్నారు. అక్కడ శారీరక, ఆయుధ వినియోగంలో శిక్షణ ఇస్తున్నారు. డ్రిల్లులు, ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. యువకులను ఫాసిస్టు శిక్షణా పద్ధతులలో తీర్చిదిద్దటంపై ఉత్తేజం పొందిన మూంజి ఆర్ఎస్ఎస్‌ను ఇటలీ ఫాసిస్టు పద్ధతులలో తీర్చిదిద్దటానికి తోడ్పాటు నందించాడు.

''ఇటలీని సైనికంగా పునరుజ్జీవింపచేయటానికి దేశంలో ఉన్న పరిస్థితులను ముసోలిని వినియోగించుకున్నాడు. సహజంగాశాంత స్వభావులైన ఇటాలియన్లు వ్యవసాయం చేసుకొంటూ యుద్ధకళలను నిర్లక్ష్యం చేశారు. ముసోలిని ఈ బలహీనతను తొలగించటం కోసం యువకులకు శిక్షణ కార్యక్రమాలను రూపొందించాడని, ఇటలీని సైనికీకరించటానికి ఇంతకన్నా మంచి మార్గం లేదని'' మూంజి రాశాడు. హెడ్గేవార్ నాయకత్వంలో నాగపూర్‌లో ఏర్పడిన ఆర్ఎస్ఎస్‌నుఅభివృద్ధి చేయటానికి, ఆ సంస్థను ఇతర ప్రాంతాలకూ విస్తరింపజేయటానికి కృషిచేస్తానని మూంజి చెప్పాడు. హెడ్గేవార్‌కు సన్నిహితుడైన మూంజి ఈ విధంగా మిలిటెంట్



epaper.prajasakti.com

> **"1934లో మూంజి తన స్వంత బోన్స్లో సైనిక శిక్షణ ఇచ్చే స్కూలు ఏర్పాటుకు పునాదులు వేసుకొన్నాడు. దానికోసం సెంట్రల్ హిందు మిలిటరి ఎడ్యుకేషన్ సొసైటిని స్థాపించాడు. సనాతన ధర్మం, వ్యక్తిగత, జాతీయ రక్షణ పేరుతో సైనిక శిక్షణ ఇవ్వటం దానిలక్ష్యం. స్కూలు, సొసైటి కోసం ప్రాథమిక కృషి జరుగుతున్నపుడు హిందు సమాజాన్ని సైనికీకరణ చేయటానికి ఇటలి, జర్మని, ఫ్రాన్స్, ఇంగ్లండ్‌లలోని సైనికస్కూళ్ళను చూసి తాను ఉత్తేజం పొందానని మూంజి చెప్పాడు."**

హిందుయిజాన్ని విస్తరింపజేయటంలో ముఖ్యపాత్ర నిర్వహించాడు.

1934లో మూంజి తన స్వంత బోన్స్లో సైనిక శిక్షణ ఇచ్చే స్కూలు ఏర్పాటుకు పునాదులు వేసుకొన్నాడు. దానికోసం సెంట్రల్ హిందు మిలిటరి ఎడ్యుకేషన్ సొసైటిని స్థాపించాడు. సనాతన ధర్మం, వ్యక్తిగత, జాతీయ రక్షణ పేరుతో సైనిక శిక్షణ ఇవ్వటం దానిలక్ష్యం. స్కూలు, సొసైటి కోసం ప్రాథమిక కృషి జరుగుతున్నపుడు హిందు సమాజాన్ని సైనికీకరణ చేయటానికి ఇటలి, జర్మని, ఫ్రాన్స్, ఇంగ్లండ్‌లలోని సైనికస్కూళ్ళను చూసి తాను ఉత్తేజం పొందానని మూంజి చెప్పాడు. సెంట్రల్ హిందు సొసైటి, స్కూల్ పథకానికి రాసిన ముందుమాటలో విజయం సాధించటం లక్ష్యంగా సాధ్యమైనంత ఎక్కువ మంది శత్రువులను చంపటం, గాయపరచటం కోసం యువకులకు ఇచ్చే శిక్షణ ఉద్దేశించబడిందని చెప్పాడు. వ్యతిరేకులపై పథకం ప్రకారం హింసను, దాడులను ప్రోత్సహించటానికి అనేక పురాతన గ్రంథాల నుండి ఉటంకింపులు చేశాడు. అహింసను బలహీనతగా, పిరికితనంగా చెప్పాడు. ముసోలిని కూడా ఇదే అభిప్రాయాలను వ్యక్తం చేశాడు. శాశ్వత శాంతి మానవ స్వభావానికి విరుద్ధమని చెప్పాడు.

ఇటలీలో ముస్సోలిని అధికారంలోకి వచ్చిన తర్వాత అరాచకం తగ్గి, క్రమశిక్షణతో వ్యవహరించటం పెరిగిందని, వెనుకబడిన దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మారుస్తున్నాడని ఆర్ఎస్ఎస్‌ను, హిందు భావజాలాన్ని బలపరిచే మరాఠి పత్రికలలో ప్రచారం జరిగింది. పార్లమెంటును రద్దుచేసి, సభ్యులను నామినేట్ చేసే పద్ధతిని ముసోలిని ప్రవేశపెట్టాడని, ప్రజాస్వామిక నాయకత్వం కన్నా ఒక్క నాయకుని ఆధిపత్యంలో నడిచే ప్రభుత్వానికి శక్తి ఎక్కువని ప్రచారం చేశారు . ఇదంతా ఒక నాయకునికి అణకువగా ఉండాలన్న ఆర్ఎస్ఎస్ నియంతృత్వ విధానాన్ని ప్రజలలోకి తీసుకుపోవటానికి ఉద్దేశించినది.

### ఇటలీలో ఫాసిజం అభివృద్ధి

1921 నాటికి ముస్సోలిని పారిశ్రామికవేత్తలు, భూస్వాములకు అత్యంత ఇష్టునిగా మారాడు. వారంతా అతన చుట్టూ చేరారు. ఫాసిస్టులు, వారి గూండాలను కార్మికులు అన్నిచోట్లా వీరోచితంగా ఎదిరించారు. దేశవ్యాపితంగా సమన్వయంతో కార్మికులను సమీకరించి పోరాటం నడిపేవారు లేరు. విడిగా అయినా, ఓడిపోతామని తెలిసినా కార్మికులు వీరోచితంగా పోరాడారు. 1921 22 ఇటలీ కార్మికవర్గ చరిత్రను పరిశీలించినట్లైతే దాడులు, విధ్వంసం, హత్యాకాండ ఉన్నప్పటికీ పోలీసులు తటస్థంగా ఉన్నట్లయితే కార్మికులు ఫాసిజాన్ని నాశనం చేసేవారే. కాని ఎక్కడైతే కార్మికులు ఫాసిస్టులను దెబ్బతీశారో అక్కడల్లా పోలీసులు ఫాసిస్టుల తరఫున జోక్యం చేసుకున్నారు. కార్మికులు ఫాసిస్టులను ఎదుర్కోగలిగిన విధంగా నిర్మాణమై ఉన్నారు కాని సుశిక్షితులైన ప్రభుత్వ పోలీసులను ఎదుర్కొనే స్థితిలో లేరు. పోలీసులు చురుకుగా ఉన్న కార్మికులను కాల్చిచంపారు. అనేకమందిని జైళ్ళలో పెట్టారు. అపుడు ఫాసిస్టులు తమ విధ్వంసాన్ని పూర్తిచేశారు.

పెట్టుబడిదారులు, మేధావులు బలపరిచారచటంతో ఇటలీకి ముస్సోలిని నాయకుడుగా ఎదిగాడు. దేశంలో భారీ పరిశ్రమలు, కెమికల్స్, ఆటోమొబైల్స్, వైమానిక రంగం, నౌకా నిర్మాణం తదితర రంగాలు అభివృద్ధి చెందాయి. యుద్ధోన్మాదం, వామపక్షాలకు వ్యతిరేకంగా దాడులు జరుగుతున్న పరిస్థితులలో ఫాసిజం అని చెప్పుకొనే భావనలు అప్పటికే జర్మని, ఇటలి, యూరప్‌లోని మిగతా దేశాలలో విస్తృతంగా వ్యాపించి ఉన్నాయి. నాజీయిజానికి జాతివాదం కేంద్రంగా ఉంది. రాజ్యం చురుకుగా మద్దతు ఇవ్వటంపై ఆధారపడి నాజీయిజం విజయం సాధించింది. ఇటలీలో కూడా ఇదే జరిగింది. నేరస్తులను విచారించే వీమర్ క్రిమినల్ కోర్టులు కూడా ప్రజాస్వామ్య వ్యతిరేక సంస్థల్లో భాగంగా ఉన్నాయి. అవి నాజీల ప్రచారాన్ని ముందుకు తీసుకువెళ్ళే సంస్థలుగా వ్యవహరించాయి. అనేకమంది ప్రభుత్వ అధికారులు, ముఖ్యంగా సైనికాధికారులు విప్లవ ప్రతీఘాతకులతో సన్నిహిత సంబంధాలు కొనసాగించారు. ఫాసిజానికి మధ్య తరగతి వెన్నెముకగా ఉన్నారు. కాని ఫాసిజం మధ్య తరగతి ఉద్యమం మాత్రమే కాదు.

ఫాసిజం అప్పీలు కొన్ని వర్గాలకే పరిమితం కాక, విస్తృతమైన ప్రజానీకాన్ని ప్రభావితం చేసింది. 1925-33 మధ్య దిగువ వర్గాల మద్దతును కూడగట్టుకున్నారు. నాజీల శాఖల సభ్యులలో 28 నుండి 46 శాతం వరకు నైపుణ్యం కలిగిన, నైపుణ్యం లేని కార్మికులే ఉన్నారు. 1928లో ఆర్థిక సంక్షోభం తీవ్రమైన తర్వాత నాజీల వైపుకు రావటం పెరిగింది. వయసు, స్త్రీయా లేక పురుషులా, మతం, ఉద్యోగం ఉందా లేదా అన్న అంశాలు కూడా ప్రభావం చూపాయి. ఈ విధంగా ఇటలీలో ముసోలిని నాయకత్వంలో ఫాసిజం ప్రధానస్థానానికి చేరింది.

ఇటలీలో మొదటి ప్రపంచయుద్ధం తర్వాత జరిగిన ఎన్నికలలో ప్రజలు సోషలిస్టులకే మెజారిటీ ఇచ్చారు. వారు నిరుద్యోగులు, రైతులు, కార్మికులు, సాధారణ ప్రజల సమస్యలు పరిష్కరించలేదు. ప్రజలు క్రమంగా వారికి దూరమవటం ప్రారంభమైంది. 1915లో వదిలేసిన తన ఫాసిస్టు పార్టీని ముస్సోలినీ తిరిగి ఏర్పాటు చేశాడు. విప్లవం రాకపోవటంతో సైన్యంలోని అధికారులు, సామాన్యులు నిరుద్యోగులుగా మిగిలిపోవటంతో తాము మోసపోయినట్లు భావించారు. ఇటువంటి తరగతులలో పాత జాతీయవాదం తిరిగి పెరగటం ప్రారంభమైంది. ముస్సోలిని మేధావులైన యువజనులకు, తనతో ఉన్న అనుభవజ్ఞులకు విజ్ఞప్తులు చేయటం ప్రారంభించాడు. సోషలిస్టుల నుండి సహాయం పొందలేకపోయిన యువకులు, విద్యార్థులు, నిరుద్యోగులు, వ్యాపారాలు చేసేవారు ముసోలిని వైపుకు వచ్చారు. అరాచకమూకలు మొదటి దాడులలో విజయం సాధించినపుడు, యూనియన్ ఆఫీసులను కూల్చేసినపుడు, మిలిటెంట్లపై దాడులు చేసినపుడు, కొందరిని హత్యలు చేసినపుడు తమకోసం ఒక కొత్త నాయకుడు ఉద్భవించాడని పెట్టుబడిదారులు అర్థం చేసుకున్నారు. పారిశ్రామికవేత్తలు


epaper.prajasakti.com

ఫాసిస్టులకు నిధులు సమకూర్చటం ప్రారంభించారు. తమకింద పనిచేస్తున్న రైతులను అణచివేయటం కోసం భూస్వాములు ఈ ఉద్యమంలో చేరారు. ఫాసిస్టులు గ్రామాలలో కూడా దాడులు కొనసాగించారు. వ్యవసాయ కార్మికులు, కౌలురైతుల స్థానిక సంఘాలను పూర్తిగా నాశనం చేశారు. ఫాసిజం అభివృద్ధితో భూస్వాములు ప్రశాంతంగా నిద్రపోయారు.

ప్రభుత్వాన్ని ఆర్థిక కార్యకలాపాల నుండి తప్పించటానికి రైల్వేలు, పోస్టల్, టెలిగ్రాఫ్‌లను ప్రైవేటు వారికి ఇచ్చివేస్తానని ముస్సోలిని ప్రకటించాడు. ముస్సోలిని భూస్వాములను బలపరిచాడు. కాని పాత ఫ్యూడల్ పద్ధతులన్నింటినీ పాటించేలా అతను చేయలేదు. క్రమబద్ధమైన దాడుల ద్వారా 1921-22లో సోషలిస్టు కార్మికవర్గ ఉద్యమాన్ని దెబ్బతీశారు. అదే సమయంలో దక్షిణ, మధ్య ఇటలీలోని పాత భూస్వాముల పెత్తనాన్ని కూడా అంతం చేశాడు. వ్యవసాయక విప్లవం, ఫాసిజంల మధ్య ఎంచుకోవలసిన పరిస్థితి భూస్వాములకు కలిగింది. తక్కువ ప్రమాదకరమైనదిగా ఎంచి, ఫాసిజం వైపుకొచ్చారు. వారి భూములు ఉంటాయని, రాజకీయ ఆధిపత్యం అంతమౌతుందని వారికి తెలుసు.

1922లో అన్ని బూర్జువా శక్తులు, సోషలిస్టు వ్యతిరేకులందరినీ ఒక్కటి చేసే శక్తిగా ఫాసిజం ముందుకొచ్చింది. కార్మికవర్గం అంటే మధ్య తరగతి ప్రజలు భయపడతారు. విప్లవం వస్తుందన్న సందర్భాలలోనే వారితో కలిసి పోరాడటానికి సిద్ధపడతారు. పెట్టుబడిదారులు, భూస్వాములు, మేధావులు, మధ్య తరగతి, నిరుద్యోగులలో అత్యధికులు ముస్సోలిని వెనుక సమీకృతమయ్యారు. సోషలిస్టులు, కమ్యూనిస్టులను పూర్తిగా నాశనం చేశారు. పాత బూర్జువా పార్టీలన్నీ క్రమంగా విచ్ఛిన్నమైపోతున్నాయి. పోలీసులు గాని, సైన్యం గాని ముస్సోలినికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని భావించలేదు. అధికార యంత్రాంగం అంతా ముస్సోలినిని నిజమైన నాయకునిగా భావించింది.

ఫాసిజం అధికారానికి వచ్చిన తర్వాత పెట్టుబడిదారులకు ఆటంకం లేకుండా నిధులు అందటం ప్రారంభమైంది. అత్యంత శక్తివంతమైన పెట్టుబడిదారీ వర్గానికి ప్రభుత్వంపై అధికారం వచ్చింది. భారీ పరిశ్రమలు, వైమానిక రంగం, కెమికల్స్, ఆటోమొబైల్స్, షిప్పింగ్ తదితరాలను ఒక పద్ధతి

**❝ ప్రభుత్వాన్ని ఆర్థిక కార్యకలాపాల నుండి తప్పించటానికి రైల్వేలు, పోస్టల్, టెలిగ్రాఫ్‌లను ప్రైవేటు వారికి ఇచ్చివేస్తానని ముస్సోలిని ప్రకటించాడు. ముస్సోలిని భూస్వాములను బలపరిచాడు. కాని పాత ఫ్యూడల్ పద్ధతులన్నింటినీ పాటించేలా అతను చేయలేదు. క్రమబద్ధమైన దాడుల ద్వారా 1921-22లో సోషలిస్టు కార్మికవర్గ ఉద్యమాన్ని దెబ్బతీశారు. ❞**



**1940లో మ్యూనిచ్‌లో సైనిక పేరేడ్ సందర్శిస్తున్న ఇటలీ ఫాసిస్టు నియంత ముస్సోలినీ, జర్మన్ నాజీ నియంత అడోల్ఫ్ హిట్లర్**

ప్రకారం అభివృద్ధి చేశారు. ప్రపంచ సంక్షోభం ప్రారంభమయే వరకు ఫాసిజం కింద ఉత్పాదక శక్తులు అభివృద్ధి చెందాయి. అందువలన విజయవంతమైన రాజకీయ నాయకునిగా ముస్సోలిని ప్రతిష్టపొందాడు. ఆస్తిపర వర్గాలలో ఫాసిజానికి మాస్ ఫాలోయింగ్ లభించింది. టెర్రరిస్టు పద్ధతుల అవసరం తీరిపోయాక అరాచక గుంపులను పోలీసులకు సహాయక శక్తులుగా మార్చివేశాడు. ఈ విధంగా సంఘటిత కార్మిక, కర్షక ఉద్యమాలను దెబ్బతీయటానికి, అసంతృప్తితో ఉన్న ప్రజలను అణచివేయటానికి, తమ అధికారానికి ఎదురైన సవాలును అధిగమించటానినకి ఇటాలియన్ పెట్టుబడిదారులు ఫాసిజాన్ని వినియోగించుకొన్నారు.

**రష్యాలో శ్రామిక ఉద్యమాలపై బ్లాక్ హండ్రెడ్స్ దాడులు**

1905లో జార్‌కాలంలో రష్యాలో బ్లాక్ హండ్రెడ్స్ ఇదేపని చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉండే శ్రామిక ప్రజలపై దాడులు, దౌర్జన్యాలు చేసేవారు. ఈ విధమైన దౌర్జన్యాలకు పాల్పడి, చట్టప్రకారం శిక్షలు అనుభవించాల్సిన వీరికి ఏ విధమైన శిక్షలు విధించేవారు కాదు. ఒకవేళ కోర్టులలో శిక్షలు విధించినా శిక్ష అనుభవించకుండానే క్షమాభిక్ష లభించేది. ఈ అరాచక మూకలు ప్రభుత్వ మద్దతుతోనే ఈ చట్టవిరుద్ధ చర్యలు కొనసాగించేవి.

బ్లాక్ హండ్రెడ్స్ రంగంలోకి రావటం రాజ్యం శక్తి విచ్ఛిన్నం కావటాన్ని తెలుపుతున్నది. ఒకవైపు విప్లవకారులు, ప్రజాస్వామికవాదులు, సోషలిస్టులు, యూదులపై బ్లాక్ హండ్రెడ్స్ దాడులు జరుపుతుండగా, మరోవైపు వీటిలో తమపాత్ర లేకుండా ప్రభుత్వం, అధికారులు తప్పుకున్నారు. 1905 అక్టోబరులో ప్రభుత్వం శక్తివంతమైన



epaper.prajasakti.com

> **" జర్మన్ బడాసంస్థలు కార్మికసంఘాలను, ప్రజలపై సోషలిజం పలుకుబడిని దెబ్బతీయటానికి ప్రయత్నం చేశాయి. ట్రూ నేషనల్ కమ్యూనిటి అనే నినాదం వెనుక కార్మికులను కూడా సమీకృతం చేశారు. యూదుల వ్యతిరేక నినాదాలు ప్రపంచవ్యాపితంగా బడా పెట్టుబడి ప్రయోజనాలను ముందుకు తెచ్చాయి. వీటన్నింటినీ వినియోగించుకొని జర్మనీలో అధికారానికి వచ్చిన హిట్లరు రెండవ ప్రపంచయుద్ధాన్ని ప్రారంభించటం, లక్షలాది మంది ప్రజలను సమిధలుగా చేయటం జరిగింది. "**

ప్రజల విప్లవ ప్రతిఘటనను ఎదుర్కోలేకపోయింది. సోషలిస్టులు, యూదులను చెదరగొట్టమని ఆదేశాలు జారీచేసింది. మరోవైపున దేశభక్తియుత ఉద్యమం పేరుతో, పోలీసుల మద్దతుతో ప్రజావ్యతిరేక, ఉదారవాద వ్యతిరేక, యూదు వ్యతిరేక శక్తులను సమీకరించారు. ఆ తర్వాత ఈ హంతక ముఠాలను సోషలిస్టులు, యూదులపై దాడులు చేయటానికి ఉపయోగించారు. ఈ క్రమంలో ఒక విధమైన శ్రమ విభజన అమలులోకి వచ్చింది. మూక హత్యాకాండకు నాయకత్వం వహించే వారి చర్యలకు రష్యన్ ప్రభుత్వం అధికారికంగా బాధ్యత వహించలేదు. కాని అనేకమంది పోలీసు అధికారులు, మంత్రులు హంతక ముఠాలను, హత్యాకాండను ప్రశంసించారు.

బ్లాక్‌హండ్రెడ్స్ ఏ విధంగా హత్యాకాండకు పాల్పడ్డారో పరిశీలించాలి. చట్టబద్ధంగా వ్యవహరించే క్రైస్తవులపై దాడులు చేయటానికి యూదులు పథకం రూపొందించారని, పవిత్రమైన ప్రదేశాలను సోషలిస్టులు అపవిత్రం చేస్తున్నారని, విద్యార్థులు జారు చిత్రపటాన్ని చించివేశారని ప్రచారం చేసేవారు. దాడులు చేయాల్సిన వ్యక్తులు, సంస్థల లిస్టును తయారు చేసేవారు. నిర్ణయించుకున్న రోజున ప్రత్యేక సేవల కోసమని బ్లాక్‌హండ్రెడ్స్ చర్చిలలో సమావేశమయేవారు. అనంతరం జాతీయ జెండాలతో ప్రదర్శన సాగుతుంది. దేశభక్తి గీతాలను వినిపిస్తూ మిలిటరీ బ్యాండ్ మోగుతుంటుంది. క్రమంగా మొదటి కిటికీని బద్దలు కొడతారు. దారినపోయే మొదటి వ్యక్తిపై దాడిచేస్తారు. అపుడు కొన్ని తుపాకి కాల్పులు వినిపిస్తాయి. శాంతియుతంగా ప్రదర్శన చేస్తున్నవారిపై సోషలిస్టులు, యూదులు చేసిన దాడిగా దానిని వర్ణిస్తారు. ప్రతీకారం కోసం డిమాండ్లు మొదలౌతాయి. ఇక అంతులేని దోపిడీ, దౌర్జన్యాలు, హత్యాకాండ జరుగుతాయి.

ఇటువంటి కార్యక్రమాలు జరుగుతున్నపుడు పోలీసులు దగ్గరే ఉంటారు. బ్లాక్ హండ్రెడ్స్ చేస్తున్న దాడులు, హత్యాకాండను చూస్తూ ఉంటారు. సోషలిస్టులు కాని, యూదులు కాని సమైక్యంగా ఈ దాడులను ఎదుర్కోవటానికి ప్రయత్నిస్తే అపుడు పోలీసులు రంగంలోకి దిగుతారు. అవసరమైతే సైన్యాన్ని కూడా తీసుకొస్తారు. సోషలిస్టు సంఘాల, యూదుల ప్రతిఘటనను అణచివేస్తారు. దాడులు, హత్యాకాండ అవిచ్ఛిన్నంగా జరిగిపోయేలా చూస్తారు. 1905లో రష్యన్ పట్టణాలలో బ్లాక్‌హండ్రెడ్స్ 4000 మందికి పైగా ప్రభుత్వ వ్యతిరేకులు, రాజకీయ కార్యకర్తలను చంపారు.

రష్యాలో ప్రతీఘాతుక విప్లవం జయప్రదం అయిన తర్వాత పాలకులకు ఈ విధమైన జాతి హత్యాకాండల అవసరం లేకుండాపోయింది. పాలకులు తిరిగి చట్టబద్ధమైన విధానాలను అవలంభించటం ప్రారంభించారు.

**జర్మనిలో ఫాసిజం అభివృద్ధి**

జర్మనీలో కొద్దిరోజులకు ముందు రిపబ్లిక్‌ను బలపరిచిన ప్రజలు తమ కోర్కెలను పరిష్కారం చేయకపోవటంతో దానిని వ్యతిరేకించటం ప్రారంభించారు. ఉదారవాద పార్టీలు నిజమైన ప్రజాస్వామ్యాన్ని స్థాపించటంలో కూడా విఫలమయాయి. ఈ వైఫల్యాలను ఉపయోగించుకొని, శ్రామికులను వ్యతిరేకించే పార్టీలు అధికారంలోకి వస్తున్నాయి. సైన్యం, అధికారయంత్రం, న్యాయవ్యవస్థ, విద్యారంగం గతంలోని బ్యూరోక్రాట్ల చేతుల్లోనే ఉన్నాయి. కార్మికోద్యమం ఐక్యంగా లేదు. మొదట రిపబ్లిక్‌ను ఉత్సాహంగా బలపరిచిన ప్రభుత్వోద్యోగులు, వైట్‌కాలర్, మధ్యతరగతి ఉద్యోగులు త్వరలోనే నిరుత్సాహానికి గురయ్యారు. నూతన రాజ్యాంగం కష్టాలు, దరిద్రం, ద్రవ్యోల్బణం, అంతర్గత పోరుకు కారణమైందని భావించటం ప్రారంభించారు. వీటితో పాటు వెర్సైల్స్ ఒప్పంద భారాలను మోయాల్సి వచ్చింది. దీనితో రిపబ్లిక్ వ్యతిరేక ప్రజా ఉద్యమం పెట్టుబడిదారులు, మధ్య తరగతులు, ఎస్టేట్ ఓనర్లు తదితరులను ఐక్యం చేయటానికి దారితీసింది.

మొదటి ప్రపంచయుద్ధం తర్వాత వీమర్ పాలనాకాలంలో జర్మనీలో 1918 నుండి జాతీయ మితవాద నాజీయిజం అభివృద్ధి చెందింది. సైనికవాదం, యూదు వ్యతిరేక భావనలు పెరిగాయి.


నవంబరు 9 తర్వాత పరిస్థితులు మారాయి. తమకు ఏం మిగిలితే దానిని కాపాడుకోవలసిన పరిస్థితికి రాజరికాన్ని బలపరిచేవారు చేరుకున్నారు. డిఎన్‌విపి కొత్తగా మాట్లాడటం ప్రారంభించింది. పాత నినాదాలైన రాజరికం, సైనికవాదం, పెట్టుబడిదారులు, భూస్వాముల ఆస్థికి రక్షణ తదితర నినాదాలను తెలివిగా జాతీయ భోవోద్వేగంతో కూడిన వాగ్దానాలుగా మార్చారు. జర్మని తగులబడుతున్నది. డిఎన్‌విపికి ఓటు వేయండి లాంటి నినాదాలు 1918కి ముందే వినిపించటం ప్రారంభమైంది. జర్మనీని బిస్మార్కు, లూథర్ తదితరుల పాలనలోకి తీసుకుపోతామనే ప్రచారం ప్రారంభమైంది. 1920లో జరిగిన ఎన్నికలలో మితవాద పార్టిలు 1919లో పొందిన ఓట్లకు రెట్టింపుకు పైగా ఓట్లు పొందాయి. తమకు ముందు నాటిన భావాల ఫలితాలను హిట్లర్, నాజీలు పొందటం ప్రారంభమైంది. సైద్ధాంతిక ఫాసిజానికి అరాచక మూకల ఫాసిస్టు దాడులు తోడైనాయి.

జర్మనీలో సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసం పనిచేసిన అధికారులను తిరిగి రిక్రూట్ చేసుకున్నారు. నాజీపార్టీ హంతకుల ప్రైవేటు హత్యాకాండ 1919లో ప్రారంభమైంది. 1919-20లో జరిగిన స్పార్టకస్ తిరుగుబాట్లను ఈ హంతక గ్రూపులు అణచివేశాయి. వీరి విజయం శ్రామికోద్యమాన్ని నిరాయుధం చేసి, ప్రతీఘాతుక విప్లవాన్ని సాయుధం చేసింది. రిపబ్లిక్‌ను వ్యతిరేకిస్తున్న బూర్జువాలు వీరితో సంబంధాలను ఏర్పాటు చేసుకున్నాయి. బడా పెట్టుబడి, బడా ఎస్టేట్‌ల యజమానులు, పాత వ్యవస్థ మద్దతుదారులు కలిసి జర్మన్ డెమోక్రటిక్ రిపబ్లిక్‌ను పూర్తిగా ధ్వంసం చేశారు.

1919 ప్రాంతంలోనే జర్మనీలో విద్యార్థి, యువజన గ్రూపులు జాతీయ సోషలిజాన్ని గురించి చర్చించటం ప్రారంభించాయి. అప్పటికింకా హిట్లర్ పేరు కూడా ప్రచారంలోకి రాలేదు. లిబరలిజం ఓడిపోతుందనుకున్న


epaper.prajasakti.com

# ప్రపంచ కార్మికోద్యమ నిర్మాణంలో ఎంగెల్స్ పాత్ర



ఎంసి వెంకటేశ్వర్లు

ప్రపంచ కార్మికోద్యమానికి సైద్ధాంతిక ఆయుధాన్ని రూపొందించుటతో పాటు కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి కారల్‌మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్ చేసిన సేవలు అనిర్వచనీయం. ఆ విషయంలో వారిద్దరిని వేరు చేసి చూడటం అసాధ్యం. ఆర్థిక, రాజకీయ, సామాజిక సమస్యలను శాస్త్రీయంగా అధ్యయనం చేసి "ఇంత వరకు నడిచిన సామాజిక చరిత్ర అంతా వర్గ పోరాటాల చరిత్రే" అని చేసిన నిర్వచనం చరిత్ర గమనాన్ని, సామాజిక విప్లవంలో వర్గ పోరాటాల ప్రాధాన్యతను స్పష్టం చేసింది. ప్రపంచ విప్లవోద్యమాలకు చోదకశక్తిగా ఉన్న వర్గ వైరుధ్యాలను బహిర్గతం చేసి శ్రామిక వర్గాలను సైద్ధాంతికంగా చైతన్యవంతం చేసింది.

18వ శతాబ్దం మధ్య భాగంలో ఆవిష్కరింపబడిన పారిశ్రామిక విప్లవం ఉత్పాదక రంగంలోనూ, ఉత్పత్తి శక్తుల అభివృద్ధిలోనూ విప్లవం తీసుకువచ్చింది. ఉత్పాదక రంగంలోనూ, ఉత్పత్తి శక్తుల అభివృద్ధిలోనూ అనూహ్య మార్పులొచ్చాయి. సామాజిక రంగంలో బూర్జువా, (పెట్టుబడిదారుడు) శ్రామిక వర్గాలు ఆవిర్భవించాయి. కార్ఖానా దశ నుండి పారిశ్రామిక సంస్థలు ఏర్పడటానికి బీజాలు పడ్డాయి. సామాజిక పురోగమనానికి ఆటంకంగా ఉన్న ఫ్యూడల్ సంబంధాలను ఛేదించడంలో పెట్టుబడిదారీ వర్గానికి కార్మిక వర్గం సహకరించింది. ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ తదితర యూరప్ దేశాలు, అమెరికాలో సంభవించిన బూర్జువా ప్రజాతంత్ర విప్లవాలు ఆయా దేశాలలో ఫ్యూడలిజాన్ని ధ్వంసం చేసి పెట్టుబడిదారీ విధానాన్ని స్థాపితం చేశాయి. ఆధునిక బూర్జువా ప్రభుత్వాలు ఏర్పడ్డాయి.

ఈ పరిణామాలన్నింటినీ అధ్యయనం చేసిన మార్క్స్, ఎంగెల్స్‌లు భవిష్యత్తులో పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా జరిగే విప్లవోద్యమాలలో కార్మికవర్గం విప్లవకర పాత్ర వహించ నున్నదన్న అభిప్రాయానికి వచ్చారు. ప్రపంచ పరిణామాలను శాస్త్రీయ దృక్పథంతో పత్రికల్లో విశ్లేషిస్తున్న మార్క్స్, ఎంగెల్స్‌లు 1842లో మొట్టమొదటగా కలుసుకున్నారు. అప్పటికే జర్మన్ తత్వవేత్త హెగెల్, భౌతికవాది ఫోయర్‌బాఖ్ రచనలను అధ్యయనం చేసిన మార్క్స్ భౌతివాదిగా మారి తీవ్రవాద ప్రజాతంత్ర పత్రిక "రేనిష్ సైటుంగ్"కు సంపాదకుడుగా పనిచేస్తున్నాడు.

ప్రష్యాలోని "బార్డెన్"లో జన్మించిన ఎంగెల్స్ తండ్రి సంపన్నుడైన బట్టల మిల్లు యజమాని. ఎంగెల్స్‌ని పెద్ద పారిశ్రామికవేత్తగా చూడాలన్నది తండ్రి కోరిక. తండ్రి కోరిక మేరకు 1843లో ఎంగెల్స్ ఇంగ్లాండ్ వెళ్ళాడు. కాని అతని ఆలోచనా విధానం వేరు. సమాజంలో దరిద్రులు, సంపన్నులు ఎందుకున్నారు? కార్మిక, రైతు పోరాటాలు ఎందుకు జరుగుతున్నాయి? వాటిని అధికారంలో ఉన్న వారు కర్కశంగా ఎందుకు అణచివేస్తున్నారు? తదితర ప్రశ్నలు ఎంగెల్స్‌ను వేధిస్తున్నాయి. తండ్రి అప్పగించిన బాధ్యతలను వదిలి లండన్‌లోని మురికివాడలను, కార్మికవాడలను సందర్శించి "ఇంగ్లాండులో కార్మికుల స్థితిగతులు" అన్న గ్రంథాన్ని రచించాడు.

ఆనాడు ఇంగ్లాండులో 12 గంటల నుండి 16 గంటల వరకు పని చేయించే వారు. ఆరు సంవత్సరాల పసిబిడ్డలతో కూడా అమానుషంగా పని చేయించేవాళ్ళు. 1883లో ఒక పార్లమెంటరీ రిపోర్టు ఇంగ్లీషు కార్మికుల పరిస్థితి అమెరికాలోని బానిసల పరిస్థితి కంటే అధ్వాన్నంగా ఉందనీ, ఇంగ్లాండులో భూస్వామ్య నిరంకుశత్వం కంటే ఇండియాలోని బ్రిటీష్ పాలన కంటే ఫ్యాక్టరీ యజమానుల పాలన అధ్వాన్నంగా తయారయిందని చెప్పిందంటే ఇంగ్లాండులో ఆనాడు కార్మికుల పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో స్పష్టమవుతుంది. ఈ పరిస్థితులన్నింటిని అధ్యయనం చేస్తున్న ఎంగెల్స్‌కు పెట్టుబడిదారీ సమాజంలో కార్మికులు, పేద ప్రజలు ఎదుర్కొంటున్న దయనీయ స్థితిగతులను మార్చడానికి కార్మికులను చైతన్యవంతం చేయగలిగిన నూతన సిద్ధాంతాన్ని ఆవిష్కరింపజేయాలన్న తపన పెరిగింది. ఈ నేపథ్యంలోనే ఎంగెల్స్ పారిస్‌లో ప్రవాసిగా ఉన్న మార్క్స్‌ను రెండవసారి కలిశాడు.

19వ శతాబ్దం ప్రథమంలోనే కార్మికోద్యమాలు ప్రారంభమయ్యాయి. రోజుకు 16 గంటలు పనిచేసినా కడుపు నిండా తినటానికి, ఒంటి నిండా కట్టుకోవడానికి బట్టలు,



epaper.prajasakti.com

పరిస్థితులలో యూనివర్సిటీలలో యూదు వ్యతిరేక ప్రచారం ప్రారంభమైంది.

ద్రవ్యోల్బణంతో భారీగా లాభాలు సంపాదించిన జర్మన్ బడాసంస్థలు కార్మికసంఘాలను, ప్రజలపై సోషలిజం పలుకుబడిని దెబ్బతీయటానికి ప్రయత్నం చేశాయి. వారు వర్గ పోరాటాన్ని వదులుకున్న మేరకు ట్రూ నేషనల్ కమ్యూనిటి అనే నినాదం వెనుక కార్మికులను కూడా సమీకృతం చేశారు. యూదుల వ్యతిరేక నినాదాలు ప్రపంచవ్యాపితంగా బడా పెట్టుబడి ప్రయోజనాలను ముందుకు తెచ్చాయి. అదే సమయంలో వాటిని పెట్టుబడికి వ్యతిరేకమైనవిగా చూపాయి. వీటన్నింటినీ వినియోగించుకొని జర్మనీలో అధికారానికి వచ్చిన హిట్లరు రెండవ ప్రపంచయుద్ధాన్ని ప్రారంభించటం, లక్షలాది మంది ప్రజలను సమిధలుగా చేయటం జరిగింది.

**భారత్‌లో....**

ఇటువంటి ఫాసిస్టు విధానాలతో ఉత్తేజం పొందిన ఆర్‌ఎస్‌ఎస్ దేశంలో ఇదే విధమైన విధానాలను అమలుచేయటానికి పూనుకున్నది. హిందుమతాన్ని అనుసరించే ప్రజలలో మతోన్మాదాన్ని పెంచటం, శ్రామిక ప్రజల మధ్య ఐక్యతను విచ్ఛిన్నం చేయటం కోసం మైనారిటీ మతాల వారిని, ముఖ్యంగా ముస్లింలను లక్ష్యంగా ఎంచుకొన్నారు. ముస్లింలపై దాడులు, హత్యలకు పాల్పడే వారికి పోలీసు వ్యవస్థ, శిక్షల నుండి రక్షణ కల్పిస్తున్నారు.

తమ పాలనకు ఎదురౌతున్న సవాలును అధిగమించటానికి బ్రిటిష్ వారు హిందు ముస్లింల మధ్య శతృత్వాన్ని పెంచటానికి పూనుకున్నారు. అందుకోసం సావర్కర్‌ను వినియోగించుకొన్నారు. తమ శత్రువులు బ్రిటిష్‌వారు కాదని, ముస్లింలని భావించే విధంగా ఇంగ్లీష్ వారు అతనికి జైలులో శిక్షణ ఇచ్చారు. దానికనుగుణంగానే అతనికి కొన్ని ప్రత్యేకహక్కులు కూడా ఇచ్చారు. జైలు నుండి నిర్బంధానికి మారిన తర్వాత అతనికి పెన్షన్ ఇచ్చారు. ముస్లింలకు వ్యతిరేకంగా ప్రచారం చేయటానికి అవకాశం కల్పించారు. కాంగ్రెస్ తాత్కాలిక ప్రభుత్వం అతనిని నిర్బంధం నుండి విడుదల చేసిన తర్వాత 1937-42 మధ్య హిందు మహాసభకు అతను నాయకత్వం వహించాడు. ఈ కాలంలో ముస్లింలకు వ్యతిరేకంగా హిందువులను సాయుధులను చేయటానికి, సైన్యంలో చేర్చటానికి, సంస్థానాలలోని సైనికులు, సాయుధులు ముస్లింలను హింసించే విధంగా వారికి శిక్షణ

> **“ మనదేశంలో కూడా పాలకవర్గాలు ఆర్‌ఎస్‌ఎస్‌ను వినియోగించుకొంటున్నాయి. యువతకు సాయుధ శిక్షణ ఇవ్వటం, సంఘ వ్యతిరేకశక్తులను సమీకరించి సాయుధ దాడులు చేయించటం, తమ వ్యతిరేకులపై హత్యాకాండను కొనసాగించటం చేస్తున్నాయి. ఫాసిస్టులు అనుసరించిన మూకదాడుల విధానాలనే తాజాగా జరిగిన ఢిల్లీ అల్లర్ల సందర్భంలో, ఇతర మత ఘర్షణల సమయాలలో అనుసరిస్తున్నారు. ”**



భారత దేశంలో నాజీ తరహా ఫాసిస్టు సంస్థ ఏర్పాటుకు ప్రయత్నించిన ఆర్‌ఎస్‌ఎస్ నేత విడి సావర్కర్

ఇప్పించటానికి ప్రయత్నం చేశాడు. తమ భావజాలానికి సానుకూలంగా ఉండే కాంగ్రెస్ మంత్రులతో ఆయుధాలకు లైసెన్స్‌లను పొందటానికి, బిర్లా పారిశ్రామిక గ్రూపు మద్దతిస్తుందని భావించి గ్వాలియర్‌లో మందుగుండు తయారు చేసే ఫ్యాక్టరీని ఏర్పాటు చేయటానికి ప్రయత్నం చేశాడు. యూరప్‌లోని ఫాసిస్టులతో సంబంధాలు పెట్టుకొన్నాడు. బ్రిటిష్ వారు ఈ చర్యలను ప్రోత్సహిస్తూ వామపక్షాలు, ఉదారవాదులు చేస్తున్న నాజీ వ్యతిరేక ప్రచారాన్ని నీరుగార్చే చర్యలు తీసుకున్నారు.

డిటెన్షన్‌లో ఉన్నప్పటికీ బ్రిటిష్ వారి ప్రోద్బలంతో ముస్లిం వ్యతిరేక కార్యకలాపాలను స్వేచ్ఛగా కొనసాగించాడు. మసీదుల ముందు ప్రదర్శనలు జరపటం, సంగీతం వాయించటాలను ప్రోత్సహించాడు. దీనిని బాంబే ప్రెసిడెన్సి, తర్వాత మొత్తం భారతదేశంలోనూ అమలు జరిపాడు. ఇటువంటి కార్యకలాపాలు ముస్లిం వ్యతిరేక సమీరణలకు దారితీశాయి.

బ్రిటిష్ అధికారుల మద్దతుతో హిందువులకు మాత్రమే ఉద్దేశించిన సైనిక శిక్షణకేంద్రాన్ని ఏర్పాటు చేయటానికి పూనుకుంది. బాంబే ప్రావిన్స్‌లో 1935 సెప్టెంబరులో సెంట్రల్ హిందు మిలిటరి ఎడ్యుకేషనల్ సొసైటిని రిజిస్టర్ చేశారు. మిలిటరి పునరుజ్జీవం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. లార్డ్ లిన్‌లిత్‌గ్రో, లార్డ్ విల్లింగ్టన్‌లు దీనికి మద్దతు తెలిపారు.

ఆర్‌ఎస్‌ఎస్ అనుసరిస్తున్న విధానాలను, వారి స్వదేశీ ప్రచారాన్ని, వివిధ దేశాలలో ఫాసిస్టు శక్తులు అనుసరించిన విధానాలను పోల్చిచూస్తే వారు చేసేదానిలో స్వదేశీ ఎక్కడుంది? జర్మని, ఇటలి, రష్యా తదితర దేశాలలో పాలకవర్గాలు తమ అధికారానికి సవాలు ఎదురైనపుడు ఏ విధంగా ఫాసిస్టు శక్తులను వినియోగించుకొన్నాయో ఆ విధంగానే మనదేశంలో కూడా పాలకవర్గాలు ఆర్‌ఎస్‌ఎస్‌ను వినియోగించుకొంటున్నాయి. యువతకు సాయుధ శిక్షణ ఇవ్వటం, సంఘ వ్యతిరేకశక్తులను సమీకరించి సాయుధ దాడులు చేయించటం, తమ వ్యతిరేకులపై హత్యాకాండను కొనసాగించటం చేస్తున్నాయి. ఫాసిస్టులు అనుసరించిన మూకదాడుల విధానాలనే తాజాగా జరిగిన ఢిల్లీ అల్లర్ల సందర్భంలో, ఇతర మత ఘర్షణల సమయాలలో అనుసరిస్తున్నారు. మూకదాడులు చేస్తున్నవారిపై చర్యలు తీసుకోకపోగా పోలీసులు వారికి సహకరిస్తున్నారు. ఇంతకుముందు మనం చర్చించిన దేశాలన్నింటిలోనూ ఇదే విధంగా ఉద్యమాలపై దాడి జరిగింది. అదే పద్ధతిని మనదేశంలోనూ అనుసరిస్తున్నారు. అభ్యుదయ వాదులు సంఘటితమై ఈ ప్రమాదాన్ని ఎదుర్కోకపోతే దేశానికి చీకటిరోజులు దాపురిస్తాయి.

※



epaper.prajasakti.com

> **“847లో జరిగిన రెండవ మహాసభ కార్మికవర్గ నిబంధనావళిని, కార్యక్రమాన్ని తయారుచేసే బాధ్యతను మార్క్స్, ఎంగెల్స్‌లకు అప్పగించడం జరిగింది. మహాసభ ఆదేశం మేరకు వారిరువురు 1848లో వ్రాసిన “కమ్యూనిస్టు ప్రణాళిక” నాటికి, నేటికి కార్మిక వర్గానికి కరదీపికగానే ఉన్నది. ప్రపంచ కార్మికులకు “కమ్యూనిస్టు ప్రణాళిక” ప్రప్రథమ విప్లవ కార్యక్రమ పత్రం. ప్రజలంతా సమానమే అన్న నినాదం స్థానంలో ప్రపంచ కార్మికులారా ఏకం కండి” అన్న నినాదాన్ని ముందుకు తెచ్చారు.”**

ఉండటానికి కనీస వసతులున్న ఇల్లు లేకుండా బ్రతకవలసిన పరిస్థితులు ఎందుకు దాపురించాయో తెలియని కార్మికులు యంత్రాలను శత్రువులుగా భావించి వాటిని ధ్వంసం జేసేవారు. దానినే 'లుడ్డైట్ల' ఉద్యమం అన్నారు. వ్యవసాయ కార్మికులు 1830 ప్రాంతంలో గడ్డివాములు, బ్యారన్లను తగులబెట్టారు. జర్మనీలో 1840లో శైలీషియా నేత కార్మికులు కూడా ఇటువంటి ఉద్యమాలనే నిర్వహించారు. క్రమంగా కార్మికవర్గం తమ దుస్థితికి యంత్రాలు, వ్యవసాయ ఉపకరణాలు కాదని గ్రహించి పని భారానికి వ్యతిరేకంగా, పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా సమ్మె తదితర ఉద్యమాలకు పూనుకున్నారు. వీటన్నింటినీ కూలంకషంగా అధ్యయనం చేసిన ఎంగెల్స్ తాను వ్రాసిన “ఇంగ్లాండులో కార్మికుల స్థితిగతులు” అన్న గ్రంథంలో సమ్మెలు కేవలం చిన్న చిన్న ఘర్షణల కంటే ఎక్కువేమీ కాకపోవచ్చు. కొన్ని సమయాలలో అవి ముఖ్యమైన పోరాటాలు కూడా కావచ్చు. సమ్మెలు కార్మికులకు మిలిటరీ శిక్షణ ఇచ్చే కళాశాలలు, యుద్ధ కళలో పాఠశాలలుగా సమ్మె పోరాటాలకు పోలింది ఏదీ లేదు” అని విశదీకరించాడు.

సంఘటితమవుతున్న కార్మిక వర్గాన్ని, వారిలో ఉన్న పోరాట పటిమను గుర్తించిన మార్క్స్, ఎంగెల్స్‌లు పెట్టుబడిదారీ సమాజాన్ని కూల్చి, నూతన సోషలిస్టు సమాజ నిర్మాణంలో కార్మికవర్గం అగ్రగామి దళంగా ఉంటుందన్న అవగాహనకు వచ్చారు. పెట్టుబడిదారీ సమాజం స్థానంలో సోషలిస్టు సమాజాన్ని నెలకొల్పటం పీడిత ప్రజల విముక్తి ద్వారానే సాధ్యమన్న విశ్వాసాన్ని కార్మికవర్గంలో కలిగించాలన్న లక్ష్యంతో ఎవరికి వారే యమునా తీరుగా ఉన్న ప్రపంచ కార్మిక వర్గాన్ని సమైక్యం చేయుటకు పూనుకున్నారు. వివిధ దేశాల విప్లవకారులతో సంబంధాలు పెట్టుకొని 1846లో “కమ్యూనిస్టు కమిటీస్ ఆఫ్ కరస్పాండెన్స్”ను ఏర్పాటు చేశారు.

ఫ్రాన్స్‌లో తీవ్రవాదులుగా ముద్ర పడ్డ బ్లాంక్విస్టుల నాయకత్వాన ఉన్న “ఫెడరేషన్ ఆఫ్ ది జస్ట్”, జర్మనీ, ఇటలీ, రష్యా, స్విట్జర్లాండ్ తదితర దేశాల ప్రభుత్వాలచే బహిష్కరింపబడ్డ విప్లవకారులైన ప్రవాసులు, మేధావులతో మార్క్స్, ఎంగెల్స్ సంబంధాలు పెట్టుకున్నారు. ఇలాంటి విప్లవకారులందరినీ ఇంగ్లాండ్‌లో సమావేశపరచి 1847లో కమ్యూనిస్టు లీగ్‌ను ఏర్పాటు చేశారు. లండన్, బ్రస్సెల్స్, పారిస్‌లలో లీగ్‌కు శాఖలు ఏర్పడ్డాయి. డిసెంబరు 1847లో జరిగిన రెండవ మహాసభ కార్మికవర్గ నిబంధనావళిని, కార్యక్రమాన్ని తయారుచేసే బాధ్యతను మార్క్స్, ఎంగెల్స్‌లకు అప్పగించడం జరిగింది. మహాసభ ఆదేశం మేరకు వారిరువురు 1848లో వ్రాసిన “కమ్యూనిస్టు ప్రణాళిక” నాటికి, నేటికి కార్మిక వర్గానికి కరదీపికగానే ఉన్నది. ప్రపంచ కార్మికులకు “కమ్యూనిస్టు ప్రణాళిక” ప్రప్రథమ విప్లవ కార్యక్రమ పత్రం. ప్రజలంతా సమానమే అన్న నినాదం స్థానంలో ప్రపంచ కార్మికులారా ఏకం కండి” అన్న నినాదాన్ని ముందుకు తెచ్చారు.

ప్రపంచాన్ని 1847లో ఆవరించిన ఆర్థిక సంక్షోభం 1948లో విప్లవాలకు దారి తీసింది. ఫ్రాన్స్‌లో ప్రారంభమైన విప్లవోద్యమం జర్మనీ, ఆసియా, ఇటలీ, హంగరీ, బెల్జియం, హాలెండ్ తదితర దేశాలన్నింటికీ వ్యాపించింది. అప్పుడే ఆవిర్భవించిన కమ్యూనిస్టు లీగ్‌కు, కమ్యూనిస్టు వర్గ పోరాట సిద్ధాంతానికి ఈ పరిణామాలు సవాల్‌గా నిలిచాయి.

మార్క్స్, ఎంగెల్స్‌లు సిద్ధాంతవేత్తలే కాదు. ఆచరణవాదులు కూడా, అప్పటికే బెల్జియంలో ప్రవాసంలో ఉన్న వారిద్దరు జర్మనీ వెళ్ళి కోలోన్ పట్టణంలోని రైన్ ప్రాంతంలో విప్లవోద్యమానికి నాయకత్వం వహించారు. కాని పెట్టుబడిదారీ వర్గం మోసం చేసి రాచరిక వర్గాలతో చేతులు కలపడంతో 1848లో వచ్చిన విప్లవాలన్నీ పరాజయం పాలయ్యాయి. దీంతో ఫ్రాన్స్, జర్మనీ విప్లవకారులపైనా, లీగ్ కార్యకలాపాలపైనా తీవ్ర నిర్బంధకాండ కొనసాగింది. అనేకమంది విప్లవకారులకు ఉరిశిక్షతో పాటు, జైలుశిక్షలు పడ్డాయి. కార్మిక వర్గంలో పోరాట తత్వం సన్నగిల్లింది. అదేకాలంలో విప్లవోద్యమాలు తిరోగమించినా పారిశ్రామికాభివృద్ధి జరిగి కార్మిక వర్గం సంఖ్య పెరిగింది.

చెల్లా చెదురైన కమ్యూనిస్టు లీగ్‌ను పునర్నిర్మాణం చేయుటకు మార్క్స్, ఎంగెల్స్‌లు పూనుకున్నారు. కానీ లీగులో మితవాదత్వాలు ప్రబలాయి. తిరుగుబాట్లు చేయాలన్న దుందుడుకు వాదాలు బయలుదేరాయి. ఈ దశలో 1852లో కమ్యూనిస్టు లీగ్ అంతరించింది.

అయినా మార్క్స్, ఎంగెల్స్‌లు నిరుత్సాహపడలేదు. 1848 నాటి విప్లవాల ఓటమి నుండి తేరుకొని కార్మికవర్గం ఇంగ్లాండ్, జర్మనీ, ఇటలీ, పోలెండ్, అమెరికా తదితర దేశాలలో విప్లవ పోరాటాలకు దిగింది. వివిధ దేశాలలో జరుగుతున్న ఈ పోరాటాలను సమన్వయపర్చి ముందుకు తీసుకుపోవడానికి కార్మికవర్గ అంతర్జాతీయ సంస్థ యొక్క ఆవశ్యకత గుర్తించబడింది. ఈ పరిస్థితుల్లో మార్క్స్, ఎంగెల్స్‌ల చొరవతో 1864 సెప్టెంబరు 28న లండన్‌లో మొదటి ఇంటర్నేషనల్ (మొదటి అంతర్జాతీయ సంస్థ) ఏర్పడింది. ఈ సంస్థకు “ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్” అని పేరు పెట్టారు. జార్జి ఓడ్జర్‌ను అధ్యక్షుడుగా, క్రైమరీను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. బీహైడ్ పత్రికను అధికారపత్రికగా నడపాలని తీర్మానించారు.

మొదటి ఇంటర్నేషనల్‌లో భిన్న సైద్ధాంతిక భావాలున్న గ్రూపులున్నాయి. ట్రేడ్ యూనియన్ సంస్కరణవాదులు, సాయుధ పోరాటం నడపాలనే బ్లాంకిస్టు దుందుడుకు వాదులు, సమ్మె పోరాటాలను వ్యతిరేకించే ప్రొధానిస్తులు, ఊహాజనిత సోషలిస్టులు – లాసెల్లియన్లు, బకూనిన్ అనార్కిస్టులు బలంగా ఉన్నారు. మార్క్సిస్టులు తక్కువగా ఉన్నారు. అయినప్పటికీ ప్రపంచ కార్మికోద్యమాన్ని ఐక్యపరచడానికి, శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతం మార్క్సిజం పునాదిగా కార్మిక వర్గాన్ని చైతన్యవంతం చేయుటకు మొదటి ఇంటర్నేషనల్ తీవ్రంగా కృషి చేసింది. మార్క్స్, ఎంగెల్స్‌లు కీలక పాత్ర పోషించారు. వారిద్దరు చేసిన నిర్విరామ పోరాటం ఫలితంగా 1869లో బాస్లేలో



epaper.prajasakti.com

**“ మార్క్స్ సహచరుడుగా, మార్క్సిజం సిద్ధాంత రూప కల్పనలో సహ వ్యవస్థాపకునిగా, సైద్ధాంతికంగా, నిర్మాణ పరంగా కార్మికవర్గాన్ని చైతన్యపరచడంలోనూ, సోషలిజాన్ని ఒక ఉద్యమంగా తీసుకురావడంలోనూ మార్క్స్ వారసుడుగా, మార్క్స్ మరణానంతరం రెండవ ఇంటర్నేషనల్ స్థాపనలో ఎంగెల్స్ పాత్ర ప్రపంచ కార్మిక, కమ్యూనిస్టు ఉద్యమం నుండి విడదీయరానిది. ”**



**మార్క్స్ కుమార్తెలు జెన్నీ, ఎలినార్, లారాలతో 1864లో మార్క్స్, ఏంగెల్స్ కలిసి దిగిన ఫోటో**

జరిగిన నాల్గవ మహాసభ నాటికి ప్రాధానిస్టులు, లాసెల్లియన్లు సైద్ధాంతికంగా ఓడింపబడ్డారు.

మొదటి ఇంటర్నేషనల్ యూరప్‌లో బూర్జువా ప్రజాస్వామిక విప్లవాలు ఉచ్ఛదశలో ఉన్న సమయంలో స్థాపించబడింది. 1870 నాటికి ఫ్యూడలిజం కూలిపోయి, పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందే నూతన దశ ప్రారంభమయింది. దాంతో పాటు కార్మికవర్గం సంఖ్య రీత్యా పెరగడమే కాక కార్మికవర్గ పోరాటాలు జరిగాయి. ఓటింగ్ హక్కు కోసం బ్రిటన్ కార్మికులు, బానిస వ్యవస్థకు వ్యతిరేకంగా అమెరికాలో జరిగిన అంతర్యుద్ధం, జెనీవా, పారిస్‌లో జరిగిన అనేక సమ్మెలకు రెండవ ఇంటర్నేషనల్ మద్దతుగా నిలిచింది. మార్క్స్, ఎంగెల్స్‌ల కృషి ఫలితంగా ఇంటర్నేషనల్ పలుకుబడి పశ్చిమ యూరప్, అమెరికాలకు వ్యాపించింది. అనేక యూనియన్లు సభ్యత్వం కోసం దరఖాస్తులు చేసుకున్నాయి.

ఫ్రాన్స్, జర్మనీల మధ్య 1870 జులైలో ప్రారంభమైన యుద్ధం ఫలితంగా 1871 మార్చి 18న ఫ్రాన్స్‌లో బూర్జువా వర్గాన్ని తొలగించి కార్మికవర్గం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అదే పారిస్ కమ్యూన్. కానీ ఆ ప్రభుత్వాన్ని 1871 మే 28న కూల్చివేయుటతో మొదటి ఇంటర్నేషనల్ సంక్షోభంలో కూరుకుపోయింది. వివిధ దేశాల్లో ఉన్న ఇంటర్నేషనల్ అనుయాయులైన మార్క్సిస్టు, బకూనినిస్టులు లాసెన్నియన్ల మధ్య తీవ్ర సైద్ధాంతిక విభేదాలు ఏర్పడ్డాయి. మరో పక్క అనేక దేశాలలో కార్మికవర్గం, విప్లవకారులపై తీవ్ర నిర్బంధకాండ అమలు జరిపారు. ఈ పరిస్థితుల నుండి బయటపడటానికి, తిరిగి ప్రపంచ కార్మికవర్గాన్ని ఐక్యం చేయడానికి, సంస్కరణవాద, ఊహాజనిత, అరాచకవాద భావజలాలను ఓడించి, మార్క్సిస్టు సిద్ధాంత ప్రాతిపదికపై వివిధ దేశాలలో కార్మిక సంస్థలను పటిష్టం చేయుటకు, మొదటి ఇంటర్నేషనల్‌ను పునర్నిర్మాణం చేయుటకు మార్క్స్, ఎంగెల్స్ తీవ్ర కృషి చేశారు. వీరిద్దరి కృషి ఫలితంగా రాజకీయ పార్టీ నిర్మాణ అవసరాన్ని, మార్క్సిస్టు సైద్ధాంతిక భావజాలాన్ని కార్మికోద్యమం గుర్తించేట్టు చేయడంలోనూ, కార్మికోద్యమంలో అంతర్జాతీయతను పెంపొందించడంలో మొదటి ఇంటర్నేషనల్ చరిత్రాత్మక పాత్ర నిర్వహించింది. అయినా ఇంటర్నేషనల్‌ను ఐక్యంగా ఉంచడంలో మార్క్స్, ఎంగెల్స్ సఫలీకృతులు కాలేకపోయారు. చివరకు 1876లో మొదటి ఇంటర్నేషనల్ రద్దయింది.

ప్రపంచ కార్మిక, కమ్యూనిస్టు ఉద్యమాలకు మార్గదర్శి, శాస్త్రీయ మార్క్సిస్టు, సోషలిస్టు సిద్ధాంత ఆయుధాన్ని అందించిన మహనీయుడు మార్క్స్ 1883 మార్చి 14న చనిపోయాడు. ఆయన వారసత్వాన్ని కొనసాగించవలసిన బాధ్యత సహచరుడు ఎంగెల్స్‌పై పడింది.

జర్మన్ మార్క్సిస్టుల పిలుపుపై ఫ్రెంచి కమ్యూనిస్టుల చొరవతో 1889 జులై 14న రెండవ ఇంటర్నేషనల్ ఆవిర్భావ సభ పారిస్‌లో జరిగింది. ఆ సభకు 20 దేశాల నుండి 391 మంది ప్రతినిధులు హాజరయ్యారు. అదే సమయంలో లీగల్ చట్రంలోనే సోషలిజం సాధించగలమనే ఫాసిస్టుల ఆధ్వర్యంలో మరో ఇంటర్నేషనల్ సభ పారిస్‌లోనే జరిగింది. రెండు మహాసభలను ఏకం చేయడానికి జరిగిన ప్రయత్నాన్ని ఎంగెల్స్ వ్యతిరేకించాడు. మార్క్సిజం సిద్ధాంతాన్ని ఆయుధంగా చేసుకొని కార్మికవర్గ పార్టీ పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోయకుండా తనను తాను విముక్తి చేసుకోలేదని, పెట్టుబడిదారీ చట్రంలో సోషలిజాన్ని సాధించడం సాధ్యం కాదని ఎంగెల్స్ స్పష్టం చేశాడు.

మార్క్స్ సహచరుడుగా, మార్క్సిజం సిద్ధాంత రూపకల్పనలో సహ వ్యవస్థాపకునిగా, సైద్ధాంతికంగా, నిర్మాణ పరంగా కార్మికవర్గాన్ని చైతన్యపరచడంలోనూ, సోషలిజాన్ని ఒక ఉద్యమంగా తీసుకురావడంలోనూ మార్క్స్ వారసుడుగా, మార్క్స్ మరణానంతరం రెండవ ఇంటర్నేషనల్ స్థాపనలో ఎంగెల్స్ పాత్ర ప్రపంచ కార్మిక, కమ్యూనిస్టు ఉద్యమం నుండి విడదీయరానిది. ఈనాడు అనేక దేశాలలో కమ్యూనిస్టు పార్టీలు, కార్మిక సంఘాలు సామ్రాజ్యవాదానికి, పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా సమరశీల ఉద్యమాలు జరుపుతున్నారంటే మార్క్స్, ఎంగెల్స్‌లు రూపొందించిన మార్క్సిజం సిద్ధాంత స్ఫూర్తితోననేది నిర్వివాదాంశం. ❉



epaper.prajasakti.com

సిద్ధాంతం

# భారత దేశంలో సైద్ధాంతిక పోరాటం: ప్రత్యేకతలు

కీ.శే దేవీప్రసాద్ చటోపాధ్యాయ

**(1974 సెప్టెంబరు 13-14 తేదీలలో ఆంధ్రప్రదేశ్ మార్క్సిస్టు ఎడ్యుకేషన్ సొసైటి నిర్వహించిన సెమినార్‌లో దేవిప్రసాద్ ఛటోపాధ్యాయ చేసిన ప్రసంగ పాఠన్ని ప్రాధాన్యత దృష్ట్యా మార్క్సిస్టు పాఠకులకు అందిస్తున్నాం -సంపాదకుడు)**



రచయిత ప్రఖ్యాత భారతీయ మార్క్సిస్టు తత్వవేత్త

భారతదేశంలో మనం ఏ మాత్రం పట్టించుకోకుండా ఉండలేని అంశాలపై జరిగే సైద్ధాంతిక పోరాటంలో తీవ్రతను అర్థం చేసుకోవటంలో మనం ఇంకా ప్రారంభంలోనే ఉన్నాం. "మనగత తాత్విక దృక్పథం ద్వారా పొందిన చైతన్యంతో సంబంధాలను సరిచేసుకోవటం" -సెటిల్డ్ ఎకౌంట్స్-అని మార్క్స్ చెప్పిన అంశం ప్రాతిపదికగా దీనిని బాగా అర్థం చేసుకోవచ్చు. ఈ విధంగా మనం స్వీకరించటానికి సంబంధించి కొంత వివరణ అవసరం. ఎంగెల్స్‌తో కలిసి మొదటిసారిగా మార్క్సిజాన్ని రూపొందించటం కోసం జర్మన్ ఐడియాలజిలో మార్క్స్ కృషి చేస్తున్నపుడు ఈ అంశాలను ఉదహరించాడనేది తెలిసిన విషయమే. కాని మనం సైద్ధాంతిక పోరాటం చేస్తున్న పరిస్థితులు దీనికి పూర్తి భిన్నంగా ఉన్నాయి. అటువంటపుడు మన లక్ష్యాలను సాధించేందుకు ఈ అంశాలను ఉదహరించటం అసంబద్ధమైనది కాదా? అయినప్పటికీ అది మొదట కనిపించేంత అసంబద్ధంగా ఉండదు. భారతీయులుగా మనం పురాతనమైన తత్వశాస్త్ర దృక్పథాన్ని కలిగివున్నాం.

ప్రస్తుత మన అవసరాల రీత్యా మనకు అంత తేలికకాని, సురక్షితం కాని మన గతకాలపు తాత్విక దృక్పథాలను గురించి చర్చచేయాలి. అందుకోసం సత్యాన్ని తెలుసుకోవాలనే పట్టుదల కావాలి. అది మార్క్సిజంతో ప్రేరణ పొందిన కార్మికోద్యమానికి బయట ఉండటం అసంభవం. మార్క్సిజం లేకుండా ప్రస్తుతం మనం జరుపుతున్న పోరాటానికి సరైన దృక్పథం గాని, నైతిక ధైర్యం గానీ ఉండవు. అదే సమయంలో ఈ సైద్ధాంతిక పోరాటంలో విజయం సాధించగలిగిన శక్తి అయిన భారత కార్మికవర్గ ఉద్యమం విజయం సాధించటం కోసం తన బలాన్ని పెంచుకోవటం, సైద్ధాంతిక పోరాటం పట్ల పట్టుదలగా, అంకితభావంతోనూ కృషిచేయాలి. కార్మికవర్గం కోసం పోరాటం, సిద్ధాంతం కోసం పోరాటం, ఈ రెండూ గతితార్కికంగా అంతర్గత సంబంధం కలిగివుంటాయి. మార్క్స్ ఈ విధంగా చెప్పాడు. " తత్వశాస్త్రం తన భౌతికశక్తిని కార్మికవర్గంలో చూస్తుంది. కార్మికవర్గం తన తన సైద్ధాంతిక ఆయుధాన్ని తత్వశాస్త్రంలో కనుగొంటుంది. జర్మన్ కార్మికుల విముక్తి మానవ విముక్తి దారితీస్తుంది. ఈ విముక్తికి శిరోభాగం తత్వశాస్త్రం. కార్మికవర్గం గుండె. శ్రామిక వర్గాన్ని విముక్తి చేయకుండా తత్వశాస్త్రం వాస్తవం కాజాలదు. తత్వశాస్త్రం వాస్తవరూపం దాల్చకుండా శ్రామికవర్గ విముక్తి సాధ్యం కాదు". ఆ విధంగా మనం చర్చించబోయే సైద్ధాంతిక పోరాటం ప్రాథమికంగా భారతదేశ తత్వశాస్త్ర రంగానికి సంబంధించినదైనప్పటికీ, మౌలికంగా అది మార్క్సిజంతో ముడిపడివుంది.

### భారతదేశ పరిస్థితులు

భారతదేశంలో ఉన్న ప్రత్యేకమైన పరిస్థితులకు సంబంధించి మన గత తత్వశాస్త్ర చైతన్యం ఏమిటి, దానితో మనం మన విభేదాలనుఏవిధంగా పరిష్కరించుకోబోతున్నాం? భారతీయ సాంప్రదాయక తత్వశాస్త్రంపై కొద్ది మాటలతో మనం ప్రారంభిద్దాం. మొదటిగా భారతీయ సాంప్రదాయక సంస్కృతిలో భారీస్థాయిలో తత్వశాస్త్ర విజ్ఞానం పోగుపడింది. రెండవ అంశం. పోగుపడిన ఈ తత్వశాస్త్ర భావాలు కేవలం నిపుణులైన వారికి అందుబాటులో ఉండే సాంకేతిక అంశాలుగా మాత్రమే లేవు. అవి దేశంలోని ప్రజల మధ్య ప్రచారం అవుతూ వారి ప్రవర్తనను కూడా ప్రభావితం చేస్తున్నాయి. సాంప్రదాయక భారతీయ తత్వశాస్త్రంలోని ఈ రెండు అంశాలను కలిపి తీసుకున్నపుడు మిగతా ఏ అభివృద్ధి చెందుతున్న దేశంలోనూ లేని సైద్ధాంతిక సమస్యలను మనదేశంలో సృష్టిస్తున్నాయి. ఫలితంగా భారతదేశంలో ఈ రోజు జరుగుతున్న సైద్ధాంతిక పోరాటానికి దాని స్వంత సమస్యలు, సహజమైన ప్రత్యేక అంశాలు, ప్రత్యేకమైన వ్యూహం, స్వంత సాంకేతిక సమస్యలు ఉన్నాయి. వాటిని అర్థం చేసుకోవటానికి మరొకసారి మార్క్స్ మాటలను గుర్తు చేసుకుందాం. "సర్వసాధారణమైన చారిత్రక, తత్వశాస్త్ర సిద్ధాంతాన్ని ఉపయోగించి, అన్నింటికీ ఉపయోగపడే పరిష్కారాన్ని ఎన్నటికీ సాధించలేం''. మనకెదురౌతున్న సమస్యలు ఇంతకు ముందే ఉన్న అంశాలేనని, వీటన్నింటినీ గురించి ముందుగానే ఒక నిర్ణయానికి వచ్చామనే భావనతో కాకుండా ప్రత్యేకమైన పరిస్థితులు ఉన్నాయని, సమస్యలున్నాయని, వాటికి ప్రత్యేకమైన పరిష్కారాలు ఉన్నాయని అర్థం చేసుకోవాలి.

ఇంతకు ముందు మనం ఉదహరించిన భారతదేశపు తత్వశాస్త్ర ప్రత్యేకతలతో మనం ప్రారంభిద్దాం. సుదీర్ఘకాలం నుండి భారతదేశంలో తత్వశాస్త్ర కార్యకలాపాలు జరుగుతున్నాయి. దాని ప్రారంభం ఉపనిషత్‌లతో జరిగిందని భావిస్తున్నారు. వీటిలో అతి పురాతనమైనవి క్రీస్తుపూర్వం 7, 6 శతాబ్దాల నాటికి చెందినవని భావిస్తున్నారు. అంత పురాతన కాలంలో ప్రారంభమైన



epaper.prajasakti.com

> **"భారతీయ పరిస్థితులలోని మరొక అంశం దీనిని మరింత సరైన అంశంగా నిర్ధారిస్తున్నది. భారతీయ తత్వవేత్తలు రాసిన గ్రంథాలు సాంకేతికమైనవి. అవి సాంకేతిక నిపుణులకు మాత్రమే అందుబాటులో ఉంటాయి. కాని వాటిలోని తాత్విక విషయాలు అలా కాదు. వీటిలో చెప్పిన తాత్విక భావాలలో కొన్ని స్వేచ్ఛగా ప్రజానీకంలో ప్రచారంలో ఉన్నాయి. ఈ విషయంలో భారతదేశం ఆధునిక యూరప్‌కు భిన్నంగా ఉన్నది."**

తత్వశాస్త్ర కార్యకలాపాలు మధ్యలో కొన్ని అంతరాలు జరిగినప్పటికీ నవ్య-న్యాయ తత్వశాస్త్ర కాలం వరకు కొనసాగాయి. అవి అన్ని అంశాలలోనూ ఆసక్తిని చూయించి, తర్కశాస్త్రం, మానవ జ్ఞానశాస్త్రం తదితర అంశాలపై అత్యంత తీవ్రమైన చర్చ చేశాయి. దాని చివరి గొప్ప ప్రతినిధి గదాధరుడు. అతడు తన గ్రంథాలను 17వ శతాబ్దంలో రచించాడు. ఈ విధంగా చూసినపుడు భారతీయ తత్వశాస్త్రం 2,500 సంవత్సరాల పాటు నిరంతర కార్యకలాపాలను నిర్వహించింది.

భారతీయ తత్వశాస్త్రాన్ని గురించి అనేకమంది భావిస్తున్న దానికి విరుద్ధంగా, వాస్తవంలో అనేక పరస్పర విరుద్ధమైన దృక్పథాలు, భావాల మధ్య ఈ తాత్విక కార్యకలాపాలు జరిగాయి. ఒక భావాన్ని మరొక భావం వ్యతిరేకించటం, వాటి మధ్య తీవ్రమైన ఘర్షణ, విరుద్ధమైన భావాలు పరస్పరం నాశనం చేసుకోవటానికి ప్రయత్నించటం ఈ పోరాటం అంత సుదీర్ఘకాలం కొనసాగటానికి కారణం. భారతీయ సమాజంలో ఆధిపత్యంలో ఉన్న వర్గాలు దీనిని తిరస్కరించటానికి ముందెత్తున ఉంటారు. భారతీయ ఆలోచనా విధానం శాశ్వతమైన సత్యాన్ని అర్థం చేసుకొన్నదని అర్థం లేని కథలు చెప్పటానికి వారు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. ఏ మాత్రం లోతుపాతులు లేకుండా, కార్మికుల బాధలను పట్టించుకోకుండా తత్వశాస్త్రవేత్తలుగా తమ స్థానాన్ని కాపాడు కోవటం కష్టమేనని భారత తత్వశాస్త్రవేత్తలు రుజువు చేశారు. దీని ఫలితంగా అసాధారణ స్థాయిలో తత్వశాస్త్ర సాహిత్యం పోగుపడింది. ఇంతకు ముందే ఇతరుల పుస్తకాలలో ఉన్న వాటిని పేర్కొన్న పుస్తకాలను పక్కన పెట్టినా తత్వశాస్త్రంపై రాసిన పుస్తకాలు భారీస్థాయి స్థాయిలో పోగుపడ్డాయి. ఈ పుస్తకాలు పై తరగతుల వారికోసమే రాశారనటంలో సందేహం లేదు. ఆ పుస్తకాలను చదవటానికి ప్రత్యేక నైపుణ్యం కావాలి. ఇది వాస్తవమైనప్పటికీ, ఇంతకు ముందు మనం చెప్పిన తత్వశాస్త్ర దృక్పథం, దానితో ఈ రోజు మనం చేస్తున్న సైద్ధాంతిక పోరాటం దానితో మన విబేధాలను పరిష్కారం చేసుకోవలసిన అవసరాన్ని తెలియజేస్తున్నాయి.

భారతీయ పరిస్థితులలోని మరొక అంశం దీనిని మరింత సరైన అంశంగా నిర్ధారిస్తున్నది. భారతీయ తత్వవేత్తలు రాసిన గ్రంథాలు సాంకేతికమైనవి. అవి సాంకేతిక నిపుణులకు మాత్రమే అందుబాటులో ఉంటాయి. కాని వాటిలోని తాత్విక విషయాలు అలా కాదు. వీటిలో చెప్పిన తాత్విక భావాలలో కొన్ని స్వేచ్ఛగా ప్రజానీకంలో ప్రచారంలో ఉన్నాయి. ఈ విషయంలో భారతదేశం ఆధునిక యూరప్‌కు భిన్నంగా ఉన్నది. ప్రముఖ తత్వవేత్తలైన బేకన్, డెకార్టె, కాన్ట్, హెగెల్ తదితరుల భావాలు ప్రధానంగా ఫ్రెంచి విప్లవం వంటి సంక్షోభ సమయాలలో తత్వశాస్త్రంలో నిపుణులైన వారికే పరిమితం అయ్యాయి. అటువంటి సందర్భాలలో ప్రధానంగా పట్టణాలలోని మధ్య తరగతిపై అతి పరిమిత ప్రభావం మాత్రమే ఉండేది. భారతదేశంలో ఇది పూర్తి భిన్నంగా ఉన్నది. కొంతమంది నిపుణులైన తత్వవేత్తలు కొన్ని భావాలను కాపాడుకోవటం కోసం రాసిన బళ్ళకొద్దీ తత్వశాస్త్ర గ్రంథాలు సాధారణమైన రైతుల చైతన్యంలో కూడా భాగం అయ్యాయి. మనం పంచవర్ష ప్రణాళికల ద్వారా ప్రయత్నం చేసినప్పటికీ వారి కనీస విద్యాస్థాయిని కూడా పెంచలేకపోయాం. అటువంటి భావాలే బ్రహ్మ, మాయ, కర్మ, మోక్షం తదితరాలు. సోషలిస్టు ప్రపంచానికి బయట అమలు జరుగుతున్న విధంగా భూమి, భవిష్యత్ ప్రపంచం లాగా ఇవి మతపరమైన భావాలు మాత్రమే కాదు. అందుకు భిన్నంగా ఇవి తత్వశాస్త్ర అభిప్రాయాలు. వాటి తర్కబద్ధత, ఇతర అంశాలపై పెద్ద ఎత్తున సైద్ధాంతిక చర్చలు జరుగుతున్నాయి. బ్రహ్మ, మాయ భావాలను తత్వశాస్త్రంలోని రెండు మౌలికమైన సమస్యలకు సమాధానంగా ముందుకు తెచ్చారు. మొదటిది చివరకు ఏది అసలైన వాస్తవం? భావమా, పదార్థమా? రెండవది భౌతిక ప్రపంచం యొక్క వాస్తవం ఏమిటి, ఈ ప్రపంచం మనకు కనిపిస్తున్నట్లు భౌతికంగా ఉందా, దానిని సాధారణమైన అనుభవం, తర్కం ద్వారా అర్థం చేసుకోగలమా? బ్రహ్మ అనే భావాన్ని అంగీకరించటం అంటే భావం ప్రధానమైనదని అంగీకరించటమే. భావానికి ప్రధానస్థానాన్ని ఇవ్వటాన్ని మార్క్సిస్టు సాహిత్యంలో భావవాద తత్వశాస్త్రం అంటారు. తత్వశాస్త్రంపై లెనిన్ రచించిన అద్భుతమైన గ్రంథం 'భౌతికవాదం అనుభవవాద విమర్శ' ఈ విధమైన ధోరణులను ఎత్తిచూపటం, ఖండించటం లక్ష్యంగా రచించాడు. ఈ భావాలను ఖండించటానికి లెనిన్ అంత జాగ్రత్త ఎందుకు తీసుకున్నాడు? కోట్లాదిమంది శ్రామికప్రజలను సైద్ధాంతికంగా విముక్తి చేయటానికి ఇది మొదటి చర్య అని, ఈ కృషి లేకుండా వారిని భౌతికంగా విముక్తి చేయటం అసంభవం అని లెనిన్ భావించాడు. ఇటువంటి గ్రంథాన్ని లెనిన్ తన సంతోషం కోసం రాయలేదు.

బ్రహ్మ అన్న భావాన్ని బలపరచటానికి మాయ అనే భావం తప్పనిసరి అవుతుంది. భావం వాస్తవం అని రుజువు చేయటానికి పదార్థం యొక్క వాస్తవాన్ని తిరస్కరించటం అనివార్యం అవుతుంది. మాయ మనం నివసిస్తున్న భౌతిక ప్రపంచానికి సంబంధించిన సిద్ధాంతం. ఈ ప్రపంచం పూర్తిగా ఊహాజనితం అని మాయ మనల్ని నమ్మమంటున్నది. భ్రమలో తాడును పాము అని భ్రమించిన విధంగానే, మరణించిన వారి ఆత్మ దెయ్యంలా కనిపించిన విధంగానే ప్రపంచం కనిపిస్తుందని చెబుతుంది.

ఆ విధంగా మాయతో కలిసిన బ్రహ్మ తత్వశాస్త్ర చరిత్రలో అత్యంత ప్రచారం పొందిన భావవాద తత్వశాస్త్రానికి మూలంగా ఉన్నది. అయినప్పటికీ భారతదేశంలోని సాధారణ రైతాంగంలో కూడా ఈ భావాలు స్థానం సంపాదించుకున్నాయి. కాబట్టి సాంప్రదాయక భారతీయ తత్వశాస్త్రం ప్రత్యేకంగా అధ్యయనం చేసిన నిపుణులకే పరిమితమైందని భావించటం పొరపాటు అవుతుంది.

### సాంప్రదాయక మార్క్సిస్టు ప్రచార సాధనాలు

ఈ విధంగా భారతదేశ సంస్కృతిలో పెద్దమొత్తంలో తత్వశాస్త్ర సాహిత్యం పోగుపడటమే కాకుండా, అది విస్తారంగా ప్రజలలోకి కూడా ప్రవేశించటం భారతదేశ పరిస్థితులలో ఉన్న ప్రత్యేకత. ఇది ఏ విధంగా జరిగిందనేది ఏ మాత్రం రహస్యం కాదు. శతాబ్దాల తరబడి భారతదేశంలో ప్రచారం కోసం శక్తివంతమైన పద్ధతులను అనుసరించారు. ఇప్పటికీ అనుసరిస్తున్నారు. ప్రజలను విద్యావంతులను చేయాల్సిన అవసరం లేకుండానే




epaper.prajasakti.com

ఈ ప్రచార పద్ధతులు భావాలు, సిద్ధాంతాలను వారిలో ప్రవేశపెడుతున్నారు. వాటిలో ప్రధానమైనది పురాణగాధలను ఉచ్చారణ చేయించటం. గ్రామీణప్రాంతాలలో వాటికి స్పష్టమైన వివరణలను కూడా జోడించేవారు. చట్టాలను రూపొందించి, అమలు చేసేవారు ప్రజలను తమ అదుపులో పెట్టుకోవటానికి అవసరమైనటువంటి తత్వశాస్త్ర సంబంధమైన అంశాలను వాటిలో ప్రవేశపెట్టేవారు. ఒక ఉదాహరణ చూద్దాం. ఇతర దేశాలలోని తమ సహచరుల వలెనే భారతదేశంలో చట్టాలు చేసేవారికి కూడా ప్రజలను అదుపులో ఉంచటంలో మూఢ విశ్వాసాల ప్రాధాన్యత తెలుసు.

గ్రీకు అధికారాన్ని చూసి ఉత్తేజం పొందిన ఆ దేశ చరిత్రకారుడు పోలిబియాస్ క్రీస్తుపూర్వ 2వ శతాబ్దంలో ఈ విధంగా చెప్పాడు. “ రోమన్ సామ్రాజ్యం గొప్పతనంలో ప్రపంచ పజానీకం చూసేదంతా మూఢ విశ్వాసాలని నేను నమ్ముతున్నాను. ఈ అంశాన్ని వారి సామూహిక, వ్యక్తిగత జీవితాల్లోకి ప్రవేశపెట్టారు. తమపై విశ్వాసాన్ని పెంచుకోవటానికి అనేక కుతంత్రాలను అమలు జరుపుతున్నారు. అనేకమంది దీనిని అర్థం చేసుకోవటంలో విఫలం అవుతున్నారు. కాని నా అభిప్రాయం మాత్రం ప్రజలపై సానుకూల ముద్ర వేయటానికే వీటిని చేస్తున్నారు. ప్రతిరాష్ట్రంలోని ప్రజలు పూర్తి అసంతృప్తితో, తీరని కోరికలతో, హద్దుమీరిన కోపం, హింసాత్మక దృక్పథంతో ఉన్నారు. వారిని అదుపులో ఉంచటానికి, భయం కలిగించటానికి ఇప్పటి వరకు అనుసరించని పద్ధతులను, విధానాలను అనుసరిస్తున్నారు. వీటిని ఏ లక్ష్యం లేకుండా చేయటం లేదు. పథకం ప్రకారమే వీటన్నింటినీ చేస్తున్నారు. అధికారంలో ఉన్నవారు దేవుడ్ని గురించి, మరణానంతర జీవితాన్ని గురించిన భావాల్ని ప్రజలలో ప్రవేశపెడుతున్నారు. అటువంటి భ్రాంతులు, భ్రమలను చెదరగొట్టలేని పిచ్చి, అర్థం చేసుకోలేని చర్యలు మనవి”.

మూఢ విశ్వాసాలు నెరవేర్చే సామాజిక కార్యకలాపాలను గురించి భారతదేశంలో చట్టాలు చేసేవారి నుండి ఇటువంటి చర్చలను మనం వినలేదు. కాని ఈ తాత్విక భావనలను బలపరచటానికి వారు నిరంతరం ప్రయత్నం చేస్తుంటారు. అంటే వారికి ఈ విషయాలన్నీ పూర్తిగా తెలుసునని, వారు మోసపూరితంగా వ్యవహరిస్తున్నారని అర్థం అవుతున్నది. గుత్తపెట్టుబడి, దాని రాజకీయ

**“ గుత్తపెట్టుబడి, దాని రాజకీయ రూపమైన సామ్రాజ్యవాదం కూడా హేతువిరుద్ధతను కోరుకుంటున్నాయి. తార్కికతను మరుగుపరచటం కోసం, ఈ విధాన రక్షణకు పెద్దసంఖ్యలో తత్వశాస్త్ర కార్మికులు గుత్తపెట్టుబడి సృష్టించిన “ సైద్ధాంతిక బీడుభూమి”లో పనిచేస్తున్నారు. భారతదేశంలో చట్టాలు చేసేవారు స్వేచ్ఛా ఆలోచనకు, తర్కబద్ధమైన ఆలోచనకు వ్యతిరేకంగా ఉన్నారు. ”**




రూపమైన సామ్రాజ్యవాదం కూడా హేతువిరుద్ధతను కోరుకుంటున్నాయి. తార్కికతను మరుగుపరచటం కోసం, ఈ విధాన రక్షణకు పెద్దసంఖ్యలో తత్వశాస్త్ర కార్మికులు గుత్తపెట్టుబడి సృష్టించిన “ సైద్ధాంతిక బీడుభూమి”లో పనిచేస్తున్నారు. భారతదేశంలో చట్టాలు చేసేవారు స్వేచ్ఛా ఆలోచనకు, తర్కబద్ధమైన ఆలోచనకు వ్యతిరేకంగా ఉన్నారు. హేతుబద్ధ ఆలోచనలు మూఢత్వాన్ని తగ్గిస్తాయని, సామాజంలో జరుగుతున్న వాస్తవాలను అర్థం చేసుకొనే శక్తిని ప్రజలలో పెంచుతాయని వారు ఆందోళన చెందుతున్నారు. భారతదేశంలో చట్టాలు చేయటంలో ఆద్యుడైన మనువు హేతువాద ఆలోచనలను తీవ్రంగా వ్యతిరేకించాడు. అందుకు వ్యతిరేకంగా కఠినమైన చర్యలు తీసుకోవాలని చెప్పాడు. హేతుబద్ధత భౌతికవాదం వైపుకు తీసుకెళుతుందని, అది దైవం, మరణానంతర జీవితం భావాలను ధ్వంసం చేస్తుందని మనువును సమర్థించేవారు వాదిస్తారు. భారతీయ పరిస్థితులలో తర్కాన్ని వ్యతిరేకించే, హేతుబద్ధతను పట్టించుకోని స్థితి నుండి తర్కంపై ఆధారపడిన శాస్త్రీయ భావాలను అర్థం చేసుకొనేలా చేయటం ఎలా అనే సమస్య ఉంటున్నది. అవసరమైన తాత్విక భావాలను రూపొందించారనటంలో ఏ మాత్రం సందేహం లేదు. కాని తర్కాన్ని దిగజార్చే విధంగా ప్రజలకు వాటిని వివరించారు.

అక్షరాస్యత అతి తక్కువగా ఉన్న భారత్ లాంటి దేశంలో ఈ సమస్య చాలా తీవ్రమైనది. ఈ సమస్యను తత్వవేత్తలు, చట్టాలు చేసేవారు పరిష్కరించలేకపోయారు. కాని ప్రభుత్వ మద్దతు ఉన్న పురాణాలను ప్రచారం చేసేవారు ఈ సమస్యను పరిష్కరించారు. స్వేచ్ఛా ఆలోచనలకు వీరెంత వ్యతిరేకంగా ఉంటారు అన్న విషయం ప్రచారంలో ఉన్న ఒక చిన్నకథ ద్వారా తెలుసుకోవచ్చు. మహా భారతంలో మరణశయ్యపై ఉన్న భీష్ముడు ధర్మరాజుకు నీతిసూత్రాలు బోధిస్తాడు. అందులో ఒకటి ఇంద్రుడు, కశ్యపునికి సంబంధించినది. ఒకసారి బాగా సంపన్నుడైన ఒక వ్యాపారి తన రథాన్ని కశ్యప తెగకు చెందిన ఒక బ్రాహ్మణుని మీదుగా పోనిస్తాడు. తనకు జరిగిన ఈ అన్యాయానికి ఎటువంటి ప్రతీకారం జరగకపోవటంతో ఆ బ్రాహ్మణుడు ఆత్మహత్య చేసుకోవాలని భావిస్తాడు. అతనిని నివారించటం కోసం ఇంద్రుడు నక్కరూపంలో అతని ముందుకు వచ్చి, తక్కువ జాతి జంతువులుగా జీవించటంలో ఉన్న బాధలను గురించి అతనికి వివరిస్తాడు. దీనంతటిలో ఉన్న ముఖ్య విషయం ఏమిటంటే మానవునిగా జన్మించటం, అందులోనూ బ్రాహ్మణునిగా జన్మించటం ఎంతగొప్ప అదృష్టం అన్నది చర్చించటం కోసమే. తర్వాత చెప్పే కథలకు ఇది ప్రారంభంగా ఉన్నది. నక్క తానెప్పుడూ నక్కగా లేనని చెపుతుంది. గతజన్మలో తానొక మనిషినని, ఒక పండితుడినని, తత్వవేత్తనని చెబుతుంది. ఆ జన్మలో తాను చేసిన పెద్దపాపం వలన ఈ




epaper.prajasakti.com

> **❝ మరో పురాణ గ్రంథమైన రామాయణంలో భిన్నమైన తాత్విక ప్రశ్నల ద్వారా నైతిక, సామాజిక విలువలు వ్యక్తం చేయ బడ్డాయి. పురాణాలలో సాంప్రదాయ కంగా ప్రజలలో సులభంగా స్థానం సంపా దించుకొనే కట్టుకథలు అనేకం ప్రచారంలో ఉన్నాయి. తత్వశాస్త్రానికి సంబంధించిన అంశాలను కూడా వీటిలో స్వేచ్ఛగా చర్చిస్తుంటారు. సాంప్రదాయక భారతదేశంలో ఉన్న ప్రజా ప్రసార సాధనాలు టివి, సినిమాలు, పత్రికల ద్వారా తన ప్రయోజనాలకు అనువైన భావాలను సామ్రాజ్యవాదం ప్రచారం చేస్తుంటుంది. ❞**

జన్మలో హీనమైన నక్కగా పుట్టానని చెబుతుంది. గతజన్మలో అతను చేసిన పాపమేమిటి? అతను స్వేచ్ఛగా ఆలోచించే మేధావిగా, హేతువాదిగా, మూఢ విశ్వాసాలను ప్రశ్నించేవాడిగా ఉన్నాడు. ఈ విధమైన మూఢ విశ్వాసాలను ప్రోత్సహించేవారిని బయటపెట్టే వానిగా కూడా అతను ఉన్నాడు. గతజన్మలో నేను తర్కవాదిని, నిరుపయోగమైన వాదనలు చేస్తూ ఉండేవాడిని. సమావేశాలలో వేదాలను పరిహసిస్తూ మాట్లాడేవాడిని. బ్రాహ్మణులు చెప్పేవాటిని ఖండిస్తూ, వారిని వ్యతిరేకిస్తూ మాట్లాడుతుండే వాడిని. ఏ విషయాన్నీ నమ్మకుండా సందేహాలను వ్యక్తం చేసేవాడిని. కాబట్టి నేర్చుకోవటానికి ప్రయత్నించే మూర్ఖునిలా వ్యవహరించేవాడిని. ఓ బ్రాహ్మణుడా, దీనంతటి ఫలితమే నేను జీవిస్తున్న నక్క జీవితం. ఇది మొత్తం కథలోని సారాంశం. వృత్తిరీత్యా ఇటువంటి కథలను బోధించే వారినుండి ఈ నీతిశాస్త్రాలను వినే సుదూరప్రాంత గ్రామాలలోని రైతులపై వీటి ప్రభావం ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలి. తర్కాన్ని మరుగుపరచటానికి ప్రజలలో ఇంతకన్నా బాగా ప్రచారం చేయటం ఉంటుందా? మహాభారతంలోని ఒక కథను మాత్రమే మనం విన్నాం. అందులో ఇటువంటివి అనేక కథలున్నాయి. దీనిలోని అనేక అంశాలు హిందు ఉన్నత తరగతులు తమ మౌలిక తత్వశాస్త్ర గ్రంథంగా భావించే గీతలో కూడా చోటుచేసుకున్నాయి.

మరో పురాణ గ్రంథమైన రామాయణంలో భిన్నమైన తాత్విక ప్రశ్నల ద్వారా నైతిక, సామాజిక విలువలు వ్యక్తం చేయబడ్డాయి. విస్తారంగా ఉన్న పురాణాలలో సాంప్రదాయ కంగా ప్రజలలో సులభంగా స్థానం సంపా దించుకొనే ఇటువంటి కట్టుకథలు అనేకం ప్రచారంలో ఉన్నాయి. తత్వశాస్త్రానికి సంబం ధించిన అంశాలను కూడా వీటిలో స్వేచ్ఛగా చర్చిస్తుంటారు. సాంప్రదాయక భారతదేశంలో




ఉన్న ప్రజా ప్రసార సాధనాలు టివి, సినిమాలు, పత్రికల ద్వారా తన ప్రయోజనాలకు అనువైన భావాలను సామ్రాజ్యవాదం ప్రచారం చేస్తుంటుంది.

### సైద్ధాంతిక వాతావరణం

దీనంతటి నుండి అర్థమయేదేమి టంటే సాంప్రదాయక తాత్విక భావనలు ఇంకా కొనసాగుతున్నాయి. వాటిని ఇష్టపడేవారు, ఇష్టపడనివారు కూడా వాటి ప్రభావానికి గురవుతుంటారు. ఈ ప్రభావం చైతన్య పూరితంగానే జరగాలనేమీ లేదు. దాని ప్రభావానికి గురవుతున్నామని తెలియకుండానే గురవవచ్చు. తెలియకుండా వేసే ప్రభావం ఎక్కువ నష్టదాయకంగా ఉంటుంది. చైతన్యవంతంగా సాధించటానికి పూనుకున్న వారి మౌలిక లక్ష్యాన్ని ఆటంకపరిచే విధంగా కూడా అది ఉంటుంది. ఒక ఉదాహరణను చూద్దాం. ప్రధాని ఈ విధంగా చెప్పారు. "ఈ పరిణామాలన్నీ మన శాస్త్రవేత్తల, విద్యావేత్తల, విధాన నిర్ణాయకవేత్తల చైతన్యంపై కూడా గణనీయమైన ప్రభావం చూపటం లేదని మనం అంగీకరించాల్సి ఉంటుంది. ఇప్పటికి కూడా మనం మానసిక భ్రాంతితో కూడిన జీవితమే గడుపుతున్నాం. మన వ్యక్తిగత భావాలలో సగాన్ని సైన్స్‌కు, శాస్త్రీయ భావాలకు అంకితం చేస్తున్నాం. మిగతా సగం మన గతంలో లోతుగా వేళ్ళూనుకొని ఉంది. శాస్త్రీయరంగంలో పనిచేసే సగం మందిలోనూ ఈ ధోరణిలో ఉన్నవారు ఉన్నారు". ఇది చాలా దురదృష్ట కరమైనది. ఆధునికమైన శాస్త్రీయ ఆలోచనలను మన చైతన్యంలో నుండి వెనక్కునెట్టటానికి, ప్రతీఘాతుక భావజాలం కొనసాగటానికి దారితీస్తుంది. మనదేశంలో ఇదేమీ అసాధారణమైనది కాదు. కేవలం సైన్స్‌రంగంలో పనిచేస్తున్న శాస్త్రవేత్తలకు మాత్రమే పరిమితమైనది కూడాకాదు.

అభివృద్ధి నిరోధకత్వంపై ఉన్న ఈ సానుకూలతను అంతం చేయాలి. దీనిని సాధించాలంటే దానికి మూలమెక్కడుందో మనం అర్థం చేసుకోవాలి. ఈ రోజు సామ్రాజ్య వాదం ఎగుమతి చేస్తున్నదాని ప్రమాదాన్ని నిర్వీర్యం చేయకుండా, ఇతరంగా భారతీయులు ఎదుర్కొనేది సాంప్రదాయక భారతీయ ఆలోచనా విధానంలోని శకలాలు మాత్రమే ఉంటాయన్న విషయాన్ని మనం అర్థం చేసుకోవాలి. ఈ శకలాలను చైతన్యంతో చూడకపోతే మనదేశంలోని మేధావులు కూడా ద్వంద్వ వ్యక్తిత్వం కలవారిగా కనిపిస్తారు. ఒకే సమయంలో సైన్స్‌ను అంగీకరించేవారిగానూ, సైన్స్‌ను వ్యతిరేకించే భావాలకు గౌరవాన్ని ఇచ్చేవారిగానూ ఉంటారు. ఈ శకలాలన్నీ మన సాంప్రదాయక ఆలోచనా విధానంలో ఉన్నవి కాదు. వీటికి ప్రత్యేకమైన ప్రోత్సాహకాలను ఇచ్చే కొన్ని అంశాలను పేర్కొన్నాను. మన తత్వశాస్త్ర వారసత్వంలో ఉన్న కొన్ని ఇతర అంశాలను కూడా మనం చూడాలి.

### భారతీయ సాంప్రదాయంలో సజీవ, నిర్జీవ అంశాలు


ఇప్పటి వరకు మనం చర్చించిన విషయాలపై కొద్దిపాటి నిర్ణయాలకు వద్దాం. ఒక భారతీయుడు తన తాత్విక వారసత్వం నుండి విముక్తి కాగలడు అనుకొంటే అది భ్రమ మాత్రమే. ఒకవ్యక్తి వ్యక్తిగా సాంప్రదాయక భావాలను ప్రతిఘటించటానికి ప్రయత్నం చేయవచ్చు. పట్టణాలలోని పై తరగతులలో కొందరు ఇదే విధంగా చేస్తూ ఆధునికులుగా భావించుకొంటున్నారు. ఈ విధమైన ఆధునికత ద్వారా పశ్చిమదేశాల తరహాలో పైకి ఆధునికంగా కనిపిస్తూ, లోపల అందుకు భిన్నమైన భావాలను దాచిపెడుతున్నారు. ఇక్కడ ముఖ్యమైన అంశం



epaper.prajasakti.com

ఏమిటంటే ఒకవ్యక్తి తన పాత భావాలన్నింటినీ అధిగమించి అభివృద్ధి చెందినప్పటికీ, అతని ఇరుగుపొరుగు వారందరూ అదే భావాలతో ఉండటంతో అతను కూడా వీటితో ప్రభావితం. అందువలన గతంతో పూర్తిగా విముక్తి కావటం సాధ్యంకాని పరిస్థితులలో నిశ్శబ్దంగా దానికి లంగిపోవటం లేదా దానిని సంపూర్ణంగా సర్వనాశనం చేయటానికి తెగించి ప్రయత్నం చేయటం మాత్రమే మనకుండే ప్రత్యామ్నాయాలు అన్న అర్థంలో తీసుకోరాదు. మనకు మరొక అవకాశం కూడా ఉంది. మన ప్రస్తుత తత్వశాస్త్ర అవసరాలకు అనుగుణంగా గత తత్వశాస్త్ర భావాలను మార్చుకోవటమే అందుకు తగినది. అంటే నిర్దిష్టంగా దీనికి అర్థం ఏమిటి? దాని అర్థం ఏమిటంటే మన తత్వశాస్త్ర వారసత్వంలో సజీవంగా ఉన్నవేమిటి, నిర్జీవంగా ఉన్నవేమిటి అన్నదానిని మొదట అర్థం చేసుకోవాలి. రెండవ అంశం ఏమిటంటే సజీవంగా ఉన్నదానిని సమకాలీన విజ్ఞానం, మరింత ఉన్నతమైన సమాజ నిర్మాణం కోసం జరుగుతున్న పోరాటంలో వస్తున్న అనుభవాలను ఆధారం చేసుకొని మరింత సుసంపన్నం చేసి, నిర్జీవంగా ఉన్నదానిని పూర్తిగా తొలగించి వేయాలి. ఈ అంశాల పట్ల స్పష్టంగా ఉండటానికి మనం ప్రయత్నం చేయాలి. సహజంగానే మొదట ఒక ప్రశ్న ఎదురౌతుంది. వీటిని మనం విడదీయటం ఎలా, సాంప్రదాయక తత్వశాస్త్రంలో సజీవమైన ఏవో, నిర్జీవమైనవి ఏవో గుర్తించటం, వేరు చేయటం ఎలా సాధ్యమౌతుంది? దీనికి మనకు తోచిన అర్థం చెప్పుకోవటం కాకుండా ఒక ప్రమాణాన్ని నిర్ణయించుకోవాలి. ఆ ప్రమాణం ఏమిటి? దీనికి ఒకటే సమాధానం ఉంది. అది ప్రస్తుత మన తత్వశాస్త్ర అవసరాలు. ఆ అవసరాలను మనం అర్థం చేసుకోవటం ఎలా? గత తరాలలోని మన తత్వవేత్తలు చెప్పినట్లుగా పురాతన కాలంలో గొప్పవారైన మన రుషులు ఒక అంశాన్ని శాశ్వత సత్యంగా చెపితే దానిని భవిష్యత్‌లో కూడా శాశ్వత సత్యంగానే భావిస్తూ ఉండాలా? అద్భుతంగా అభివృద్ధి అవుతున్న సమకాలీన శాస్త్ర విజ్ఞానమే అటువంటి శాశ్వత సత్యాల కథలను పనికిరాని వాటిగా చేస్తున్నది. సాధారణ తర్కం, విశ్లేషణల ద్వారా మనం ప్రస్తుత మన తత్వశాస్త్ర అవసరాలను నిర్ధారించగలమా? అది మనల్ని మనం మోసం చేసుకోవటం అవుతుంది. ఇటువంటి ప్రయత్నం అసంగతం, అనవసరమైన పాండిత్య ప్రదర్శనకు దారితీస్తుంది. ఇటువంటిది మనకు చాలా ఉంది. ఆ తప్పును తిరిగి మనం చేయకూడదు.

**“ మనం అభివృద్ధి మార్గంలో పయనించటానికి కావలసిన విధానాలను రూపొందించుకొంటే మనకు కావలసిన తత్వశాస్త్ర అవసరాలను ఒక నిర్దిష్టమార్గంలో నిర్ణయించుకోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. అలాకాకపోతే భారతీయ మేధను సాధ్యమైనంత తక్కువ పరిధులకు కుదించివేసే, మూఢ విశ్వాసాలకు ఎటువంటి ప్రతిఘటన లేనిదానిగా, సాంప్రదాయక నిబంధనల మాటున బానిసగా మార్చివేస్తే, దానికున్న గొప్పతనాన్ని, చారిత్రక శక్తిని మార్చివేస్తే మనం ఇలాగే స్థంభించిపోయి ఉంటాం. ”**




ప్రస్తుత మనకు కావలసినది చారిత్రికంగా మన తత్వశాస్త్ర అవసరాలకు తగినదిగా తత్వశాస్త్ర అవసరాలను తీర్చేది ఉండాలి. ప్రస్తుతం మనం ఎక్కడున్నాం, ఏం సాధించటానికి ప్రయత్నం చేస్తున్నామన్న అంశాలపై మనకు అవగాహన ఉండాలి. ఆ విధంగా అది మనం చారిత్రక లక్ష్యాలను నిర్దేశించుకోవటంపై ఆధారపడి ఉంటుంది. మనం భారతీయులం ఈ లక్ష్యాన్ని నిర్దేశించుకోగలమా?

**అభివృద్ధి సాధన కృషి**

మనం అభివృద్ధి మార్గంలో పయనించటానికి కావలసిన విధానాలను రూపొందించుకొంటే మనకు కావలసిన తత్వశాస్త్ర అవసరాలను ఒక నిర్దిష్టమార్గంలో నిర్ణయించుకోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. అలాకాకపోతే భారతీయ మేధను సాధ్యమైనంత తక్కువ పరిధులకు కుదించివేసే, మూఢ విశ్వాసాలకు ఎటువంటి ప్రతిఘటన లేనిదానిగా, సాంప్రదాయక నిబంధనల మాటున బానిసగా మార్చివేస్తే, దానికున్న గొప్పతనాన్ని, చారిత్రక శక్తిని మార్చివేస్తే మనం ఇలాగే స్థంభించిపోయి ఉంటాం. దేశంలో ఎవరైనా ఉద్దేశ్యపూర్వకంగా ఈ రెండో మార్గాన్ని ఎన్నుకుంటే వారు మన తత్వశాస్త్ర అవసరాలను భిన్నమైన మార్గంలో రూపొందించాల్సి ఉంటుంది. కాని దేశంలో ఎవరూ ఈ రెండో మార్గాన్ని ఎన్నుకోరని వాదించవచ్చు. ఈ మధ్యకాలంలోనే రాజకీయ స్వాతంత్ర్యం కోసం తెగించి పోరాడి అనేక బలిదానాలు చేసిన దేశంలో అభివృద్ధి స్థంభించిపోవాలని ఎవరు కోరుకుంటారు? కొద్దిమంది మూర్ఖంగా వ్యవహరించేవారు మాత్రమే అభివృద్ధిని వ్యతిరేకిస్తారు. కాని మనదేశంలోని రాజకీయ నాయకులు, విధాన నిర్ణేతలు, విద్యారంగంలోని నిపుణులు, మొత్తంగా చెప్పాలంటే చారిత్రకంగా అభివృద్ధిని వాంఛిస్తున్నవారందరూ దేశం ముందుకుపోవాలనే కోరుకొంటున్నారు.

ఇది వాస్తవం. అభివృద్ధిని గురించి పెద్ద ఎత్తున ప్రచారం కూడా జరుగుతున్నది. అదే సమయంలో దానిలో ఎదురయే సమస్యలను చర్చించటాన్ని తప్పించుకొనే వ్యక్తులతో పాటు కొందరి వలన ఈ ప్రయత్నాలు చిక్కులలో పడుతున్నాయి. ఈ సమస్యలు ఏమిటి? ఒక అభివృద్ధి చెందుతున్న దేశంలో సమగ్రమైన ప్రణాళిక, ప్రభుత్వరంగ సంస్థలు లేకుండా, సూక్ష్మంగా చెప్పుకోవాలంటే సోషలిజానికి కట్టుబడాలనే చైతన్యం లేకుండా అభివృద్ధి సాధ్యం కాదని చారిత్రక అనుభవం స్పష్టం చేస్తున్నది. అది నకిలీ సోషలిస్టు కార్యక్రమంగా ఉండకూడదు. సోవియట్ యూనియన్‌లో లెనిన్ నాయకత్వంలో సోషలిజాన్ని అర్థం చేసుకొని, అమలు చేయటం ద్వారా సోషలిస్టు ప్రపంచాన్ని ఉనికిలోకి తెచ్చిన విధంగా ఉండాలి. ఈ విధమైన చైతన్యం లేకుండా అమలు జరిపేవి

(మిగతా 33వ పేజీలో)




epaper.prajasakti.com

అధ్యయనం

# మార్క్సిస్టు అధ్యయన కేంద్రాల ప్రాధాన్యత

**తమ్మినేని వీరభద్రం**




రచయిత సిపిఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు

మార్క్సిస్టు అద్యయనకేంద్రాలు కమ్యూనిస్టు పార్టీల నిర్మాణంలో, మార్క్సిస్టు సిద్దాంత వ్యాప్తిలో కీలకపాత్ర నిర్వహిస్తాయి. జారిస్టు రష్యాలో సోషలిస్టు భావాల వ్యాప్తిలో, సోషల్ డెమొక్రటిక్ పార్టీ నిర్మాణంలో స్టడీసర్కిల్స్ పాత్ర చాలా ముఖ్యమైనది. లెనిన్ అధ్యయనం అవసరాన్ని పదే,పదే నొక్కి చెప్పేవాడు.

1887 మే 8న లెనిన్ సోదరుడు అలెగ్జాండర్ అతని సహచరులతోపాటు ఉరితీయబడ్డాడు. ఈ బృందం జార్ చక్రవర్తిని చంపటానికి ప్రయత్నించి పట్టుబడ్డారు. ఈ ఘటన తర్వాత కొద్దినెలలకే లెనిన్ 'కజాన్' విశ్వవిద్యాలయంలో 'విప్లవ విద్యార్ధుల స్టడీ సర్కిల్' కు మొదటిసారిగా హాజరయ్యాడు. అప్పటికే ఆయన ఆ విశ్వవిద్యాలయంలో విద్యార్థిగా చేరాడు. అదే సంవత్సరం డిశంబరు 5న ఒక ర్యాలీలో పాల్గొన్నందుకు పోలీసులు లెనిన్‌ను అరెస్టు చేశారు. కొద్దిరోజులకే ఆయనకు దేశబహిష్కారం శిక్ష విధించి కొకిష్కినో గ్రామానికి పంపారు. 1988 వేసవిలో ఫెడొసాయేవ్ నడుపుతున్న మార్క్సిస్టు స్టడీసర్కిల్‌లో లెనిన్ చేరాడు. 89 జులైలో ఫెడొసాయేవ్‌తో సహా ఆ స్టడీసర్కిల్‌లోని అనేక మంది సభ్యులు పోలీసులచేత అరెస్టు చేయబడ్డారు. అయితే లెనిన్ అరెస్టు కాలేదు. తిరిగి 1990లో 'సమారా'లో మరొక స్టడీసర్కిల్‌లో లెనిన్ చేరాడు. దానిలో ఆయనే కీలకపాత్ర వహించాడు. 1993లో సెంట్‌పీటర్స్‌బర్గు వెళ్లేదాకా ఆ స్టడీసర్కిల్‌లోనే లెనిన్ ఉన్నాడు. సెంట్‌పీటర్స్‌బర్గ్‌లో టెక్నలాజికల్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్దులతో మార్క్సిస్టుస్టడీసర్కిల్ ఏర్పాటు చేశాడు. 1895 డిశంబరు 8న తాను అరెస్టు అయ్యేదాకా సెంట్‌పీటర్స్‌బర్గ్‌లో లెనిన్ విస్తృతంగా స్టడీసర్కిళు నడిపాడు.

ఆవిదంగా సుమారు 7సంవత్సరాలు లెనిన్ "మార్క్సిస్టు స్టడీసర్కిళ్ల" లో విస్తృతంగా పాల్గొనటం, నడపటం చేసాడు. ఈ 7 సంవత్సరాలు లెనిన్ జీవితంలో చాలా కీలకమైనవి. వృత్తి విప్లవకారులను (పూర్తికాలం కార్యకర్తలను) తయారు చేయటంలో ఈ స్టడీసర్కిళ్లు ఎంతకీలకమో ఆయన గ్రహించాడు. లెనిన్‌లోని విశిష్ట లక్షణమేమంటే విప్లవ లక్ష్యసాధనలో ఏరకమైన పనికైనా తనను తాను తేలికగా మల్చుకునేవాడు. అవసరాలకు తగినట్లుగా తన పనిపద్ధతులను మార్చుకునేవాడు. ఎల్లవేళలా ఉత్సాహం ఉరకలు వేస్తుండేది. అధ్యయన బృందాలలో అవసరానికి తగినట్లుగా మేధావులకు మేధావుల స్థాయిలో, సాదారణ కార్మికులకు వారిస్థాయిలో తన సహాయాన్ని అందించేవాడు.

### స్టడీ సర్కిళ్లలో కార్మికులు

కార్మికులు స్టడీసర్కిళ్లలో చేరటానికి, రాజకీయ, సిద్ధాంత విషయాలు నేర్చుకోవటానికి ఎంతగానో ఆసక్తి కనబరిచారు. ప్లెకనోవ్ ఇలా చెప్పాడు. " 10,11 గంటలపాటు ఫ్యాక్టరీలో పనిచేసి అలసిపోయి, ఇంటికొచ్చాక తిరిగి రాత్రి 1గంట వరకూ వాళ్లు స్టడీసర్కిల్స్‌లో చురుకుగా పాల్గొనేవాళ్లు. అంతేకాదు. రాజకీయఅర్థశాస్త్రం, రసాయనశాస్త్రం, సాంఘిక శాస్త్రాలే గాక డార్విన్ సిద్దాంతం ఇంకా ఎన్నో విషయాలపై వాళ్లు ఆసక్తి చూపేవాళ్లు. ఇది నాకు చాలా ఆశ్చర్యమేసింది'' – (విప్లవోద్యమంలో రష్యాకార్మికుడు – ప్లెకనోవ్)

యూదు వర్కర్ల సోషలిస్టు స్టడీసర్కిల్‌లో నాయకులు చాలా లోతైన అంశాలగురించి కార్మికులను . ఎంతో పట్టుదలగా చైతన్యపరిచేవారు. లియాన్ బెర్న్‌స్టెయిన్ 'విల్నా' స్టడీసర్కిల్‌లో తన విధ్యార్థులకు "ప్రారంభంలో ట్రైబల్ జీవితం నుండి ఆదునిక ఇంగ్లీష్ పార్లమెంటు, ట్రేడ్‌యూనియన్ల" దాకా ప్రజల పరిణామం గురించి చెప్పేవాడు. మరో స్టడీసర్కిల్‌లో వర్గాల పుట్టుక, బానిసత్వం, అర్ధబానిసవ్యవస్థ మరియు పెట్టుబడిదారీ విదానం వగైరా చర్చించేవాళు . స్టడీసర్కిల్ సభ్యులు డార్విన్, మిల్ రచనలతోపాటు రష్యన్ సాహిత్యంలోని ఉత్తమగ్రంథాలెన్నింటినో చదివేవాళ్లు." – (పైగ్రంథం)

ఈ స్టడీసర్కిళ్ల గురించి రష్యన్‌కార్మికోద్యమ చరిత్రకారుడు ఒకాయన ఇలా వ్రాసాడు.''ఈ కార్మికులకు తమ నిరాశాపూరిత జీవన పరిస్థితులను అధిగమించటానికి ఈ చదువులో, చైతన్యంలో ఒక మార్గం కనపడింది. అందుకే స్టడీసర్కిళ్లు ఇచ్చిన ఈ అవకాశాలను వారు అందిపుచ్చుకున్నారు. కొంత అవగాహన ఉన్న కార్మికులు నేర్చుకోవటంలోని మెళకువలను చాలా తొందరగా గ్రహించటమేకాక, విజ్ఞానశాస్త్రాలను అవగాహన చేసుకోవటం లోనూ, తమ చుట్టూఉన్న ప్రపంచాన్ని అర్థంచేసుకోవటంలోనూ చాలా ఆసక్తి కనబరిచారు."

ఈ కృషి ఫలితంగా అవగాహనా సామర్థ్యంగల అనేక మంది కార్మికులు అనతికాలంలోనే 'బోధనా సామర్థ్యాన్ని' సాధించారు. సాదారణ ప్రజలకు విశ్వాసం కలగాలంటే విప్లవకారులు అన్నివిషయాలలో విజ్ఞానవంతులుగా, అవగాహనపరులుగా ఉండటం తప్పనిసరి అని లెనిన్ చెప్పేవాడు.

"ఇటువంటి పరిస్థితులలో మనం చేయాల్సిన పని కార్మికులకు విషయపరిజ్ఞానాన్ని అందించటం, నిర్మాణంలోకి తీసుకురావటం. ఎన్ని కష్టాలొచ్చినా, ఇబ్బందులెదురైనా ఈ పని మనం కొనసాగించాలని నేను భావిస్తున్నాను. ఈ పనిలో మనం మంచి ఫలితాలు సాధించాలంటే ముందుగా మనం అభ్యాసకులం



epaper.prajasakti.com

కావాలి. ఇతరులను నైతికంగా,మేధోపరంగా అభివృద్ధిచేయాలి. ఇందుకు శక్తివంతంగా కృషి చేయాలి. ఎందుకంటే ప్రజలు మనల్ని బుద్ధిజీవులుగా, నీతివంతులుగా, ధైర్యశాలురుగా గుర్తించాలి. అపుడు ప్రజలు మనపై విశ్వాసం కలిగి ఉంటారు. ఆదర్శనీయులుగా గుర్తిస్తారు." (ఒక స్టడీసర్కిల్‌లో లెనిన్)

అయితే స్టడీసర్కిల్ లక్ష్యాన్ని సక్రమంగా అర్థంచేసుకోని వారుకూడా ఉన్నారు. ఉదాహరణకు రష్యన్ ప్రథమ మార్క్సిస్టులలో ఒకడు, 'నోవాగార్డ్' స్టడీసర్కిల్ సంస్థాపకుడు అయిన స్కొర్ట్సొవ్ అవగాహన గురించి ఆయన శిష్యుడిలా వ్రాశాడు. " మేము కార్మికోద్యమ భవిష్యత్తు గురించి చాలా దీర్ఘంగా సంభాషించాం. కార్మికోద్యమ భవిష్యత్తురూపాల గురించి మా అవగాహనెంత అస్పష్టంగా ఉందో స్కొర్ట్సొవ్ మాటల్లో చూద్దాం. ఆయనిలా అనేవాడు.." మార్క్సుని చదివే కార్మికుల సంఖ్య క్రమంగా పెరుగుతుంది. వాళ్లు స్టడీ సర్కిళ్లకు ఇంకా ఎక్కువమందిని ఆకర్షించటంద్వారా ఆ సంఖ్యను ఇంకా బాగా పెంచుతారు. ఒక సమయానికి ఈ స్టడీ సర్కిళ్లు రష్యా అంతా వ్యాపిస్తాయి."

అంటే మార్క్సిస్టు సిద్ధాంతాన్ని క్రమంగా మొత్తం ప్రజలకు భోదించటం ద్వారా విప్లవాన్ని సాధించగలమనే పొరపాటు అభిప్రాయంలో ఆనాటి అధ్యయనకేంద్రాల సభ్యులున్నారు. ప్రజల, కార్మికుల రోజువారీ సమస్యలపై ఆందోళన, పోరాటాల అవసరాన్ని వారు గుర్తించలేదు. ప్రజలందరికీ సిద్ధాంత అవగాహన కల్పించలేమనే వాస్తవాన్నికూడా వారు గ్రహించలేకపోయారు.

**ఆందోళన వైపుగా ..**

1891లో రష్యాలో కరువు వచ్చింది. "రష్యాలో కరువు – సోషలిస్టుల పాత్ర" పేర ప్రముఖ మార్క్సిస్టు సిద్ధాంతవేత్త ప్లెకనోవ్ ఒక కరపత్రం ప్రతిపాదించాడు. దానిలో మార్క్సిస్టుల విద్యాబోదన రెండువిదాలుగా జరగాలని ప్రతిపాదించాడు. 1. ప్రచారం 2. ఆందోళన. ప్రచారకార్యకలాపాలు అవసరం. అయితే 'ప్రచారం' చాలా ఎక్కువ విషయాలు కొద్దిమందికే నేర్పుతుంది. 'ఆందోళన' కొద్దివిషయాలే అయినా ఎక్కువమంది ప్రజలకు నేర్పుతుంది. ప్రజలే చరిత్ర నిర్మాతలు. అందువల్ల ప్రజల్లోకి వెళ్లటం అవసరమ" ని ఆయన ప్రతిపాదించాడు.

" ప్రముఖ మార్క్సిస్టు సిద్ధాంతవేత్త ప్లెకనోవ్ ఒక కరపత్రం ప్రతిపాదించాడు. దానిలో మార్క్సిస్టుల విద్యాబోదన రెండువిదాలుగా జరగాలని ప్రతిపాదించాడు. 1. ప్రచారం 2. ఆందోళన. ప్రచారకార్యకలాపాలు అవసరం. అయితే 'ప్రచారం' చాలా ఎక్కువ విషయాలు కొద్దిమందికే నేర్పుతుంది. 'ఆందోళన' కొద్దివిషయాలే అయినా ఎక్కువమంది ప్రజలకు నేర్పుతుంది. ప్రజలే చరిత్ర నిర్మాతలు. అందువల్ల ప్రజల్లోకి వెళ్లటం అవసరమ" ని ఆయన ప్రతిపాదించాడు. "

దీనిని ఆనాటి స్టడీసర్కిల్ సభ్యులంతా ఎక్కువమంది వ్యతిరేకించారు. కీవ్, కారకోవ్ తదితర కేంద్రాలు తమ వ్యతిరేకతను తెలియజేస్తూ ఏకంగా తీర్మానాలే చేసారు. ఇదంతా 'అధ్యయన కేంద్రాలను బలహీనపర్చే కుట్ర' అని కొందరన్నారు. అకినోవ్ అనే ఉద్యమచరిత్రకారుడు ఈ చర్చ సందర్భంగా ఒక కార్యకర్త ఇలా అన్నాడని రాశాడు. " కరపత్రం శుద్ధదండగ. చిన్న కరపత్రంలో నీవు చెప్పగలిగేది శూన్యం. కార్మికుని చేతిలో పెట్టవలసింది గ్రంథం. కరపత్రం కాదు. కార్మికునికి అవసరమైంది భోదన. అతనిని స్టడీసర్కిల్‌కు రప్పించాలి".

ఈ వివాదంలో లెనిన్ 'ఆందోళన' కు అనుకూలంగా ముందుకు వచ్చాడు. సిద్ధాంతప్రచార కృషికి, ఆందోళనకు వైరుధ్యం లేదన్నాడు. తమ సమస్యలపై అసంతృప్తితో రగిలిపోతున్న ప్రజలకు తక్షణం ఆందోళన,పోరాటాలు అవసరమన్నాడు. ప్రజలకు, కార్మికులకు వర్గచైతన్యాన్ని, సంఘ, రాజకీయ చైతన్యాన్ని కల్పించటంలో ఆందోళన, పోరాటాల పాత్రను వివరించాడు. అందువల్ల అప్పటి పరిస్థితిలో వాటిపైనే కేంద్రీకరించాలన్నాడు. ఆ తర్వాత రష్యా అంతటా పోరాటాలు ఉధృతంగా సాగాయి. పెద్ద, పెద్ద సమ్మెలు విజయాలు సాధించబడ్డాయి. అయితే ఆ తర్వాత మరో పెడదోరణి 'ఆర్థికవాదం' ముందుకు వచ్చింది.

సోషలిస్టు చైతన్యం, మార్క్సిస్టు సిద్ధాంత ప్రచారం ప్రాధాన్యతను మరుగున పెట్టే వాదనలు విస్తృతంగా రష్యన్ సోషల్‌డెమొక్రాట్లలో బలంగా ముందుకు వచ్చాయి. 1902లో ఈ పెడదోరణిని విమర్శిస్తూ లెనిన్ "ఏమి చేయాలి" అనే ప్రఖ్యాత రచన చేసారు. పోరాటాల

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520 002**



epaper.prajasakti.com

"నిర్థిష్ట పరిస్థితులను నిర్థిష్టంగా అంచనా వేయటం" గురించి లెనిన్ ఎపుడూ నొక్కి చెప్పేవాడని మనకు తెలుసు. సరిగ్గా ఆ పద్దతే "ప్రచారం - ఆందోళన" ప్రాధాన్యతలు చెప్పటంలో లెనిన్ పాటించాడు. రష్యన్ కమ్యూనిస్టులలో సిద్దాంత ప్రచారం తప్ప ప్రజలలో ఆందోళన, పోరాటాలను గుర్తించని నిర్థిష్టపరిస్థితిలో దానిని నొక్కి చెప్పాడు.

ద్వారానే సోషలిస్టు చైతన్యం అందించలేమని, ఆ చైతన్యాన్ని పోరాటం 'బయట నుండి మాత్రమే' అందించవీలవుతుందని ఆ గ్రంథంలో వివరించారు. ఆ కృషి లేకుండా ఎన్ని ఆందోళనలు, పోరాటాలు చేసినా బూర్జువాలకు "విధేయమైనసేవ" కే ఉపయోగపడతాయని ఘాటుగా విమర్శించాడు.

"నిర్థిష్ట పరిస్థితులను నిర్థిష్టంగా అంచనా వేయటం" గురించి లెనిన్ ఎపుడూ నొక్కి చెప్పేవాడని మనకు తెలుసు. సరిగ్గా ఆ పద్దతే "ప్రచారం – ఆందోళన" ప్రాధాన్యతలు చెప్పటంలో లెనిన్ పాటించాడు. రష్యన్ కమ్యూనిస్టులలో సిద్దాంత ప్రచారం తప్ప ప్రజలలో ఆందోళన, పోరాటాలను గుర్తించని నిర్థిష్టపరిస్థితిలో దానిని నొక్కి చెప్పాడు. తనపనిని ఆందోళనా, పోరాటాలపై కేంద్రీకరించాడు. తరువాత కాలంలో ఆందోళనలు, పోరాటాలే సర్వస్వంగా భావించి సిద్దాంతకృషిని నిర్లక్ష్యం చేసిన నిర్థిష్టపరిస్థితిలో అదెంత తప్పోవివరించి, ఆ కృషిపై తన శక్తినంతా కేంద్రీకరించాడు.

ఇక్కడ ఒక విషయాన్ని మనం నిశితంగా గమనించాల్సిఉంటుంది. సిద్దాంతకృషి, ఆందోళనా,పోరాటాల లక్ష్యాల గురించి కూడా పొరపాటు వాదనలు ముందుకు వచ్చాయి. ప్రజలందరికీ సిద్దాంతాలు నేర్పగలమనుకోవటం, అలాంటి లక్ష్యాలు ఏర్పర్చుకోవటం ఒక పెడదోరణి అయితే, మరోవైపు ప్రజలందరినీ కదిలించగలిగేది ఆందోళన, పోరాటాలేగాబట్టి వాటిపైనే కేంద్రీకరిస్తే సరిపోతుందనే పెడదోరణి మరొకటి. ఈ గందరగోళాలకు మూలమైన అసలు గందరగోళం మరొకటి ఉంది. అదేమంటే ప్రజలను కదిలించటం, కమ్యూనిస్టులను తయారు చేయటం రెండూ వేర్వేరు పనులు. ప్రజలను కదిలించాలంటే ఎపుడైనా అందోళనా, పోరాటాలే శరణ్యం. తక్షణం ఎదురయ్యే మంచినీళ్ల సమస్య అయినా, ప్రభుత్వాన్ని కూల్చటానికి, వ్యవస్థను మార్చటానికి నిర్వహించాల్సిన మహావిప్లవమైనా ప్రజలను కదిలించాలంటే ఆందోళనా, పోరాట పద్దతులే మార్గం. మరోవైపు కమ్యూనిస్టులను తయారు చేయాలంటే సిద్దాంత కృషిలేకుండా సాధ్యంకాదు. ఆందోళనలు, పోరాటాల ద్వారా (అవెంత గొప్పస్థాయిలో చేసినా) కమ్యూనిస్టులను తయారు చేయటం అసంభవం, అసాధ్యం. కమ్యూనిస్టులు (కమ్యూనిస్టుపార్టీ) లేకుండా విప్లవపోరాటాలు, విప్లవాలు అంతే అసంభవం, అసాధ్యం. విప్లవ (వ్యవస్థ మార్పుకోసం) పోరాటాలు కాకుండా, సాదారణ ఆర్థిక, సంస్కరణ పోరాటాలు కమ్యూనిస్టులు లేకుండానే ఎవరైనా చేయవచ్చు.

అందువల్ల కమ్యూనిస్టులను తయారుచేసే సిద్దాంతకృషి చాలా ముఖ్యమైన పని. ఈ పని వల్ల పార్టీ పెరగుతుంది. ఆందోళనా,పోరాటాలు నిర్వహిస్తే దానివల్ల రెండు ప్రయోజనాలున్నాయి. ఒకటి ఆ పోరాటాల వల్ల ఈవ్యవస్థలోనే ప్రజలకు కొన్ని తక్షణ సమస్యల పరిష్కారానికి, తాత్కాలిక ప్రయోజనాలద్వారా జీవనస్థాయి పెరగటానికి అవకాశం ఉంది. రెండవది ఈ పోరాటాల ద్వారా నిరంతరం నూతనంగా మిలిటెంట్లు గుర్తించబడటానికి, తద్వారా కమ్యూనిస్టుల తయారీకి (సిద్దాంత తర్ఫీదుకు), ముడిసరుకు లభించటానికి వీలవుతుంది. అయితే నిపుణులైన కమ్యూనిస్టుల ఆధ్యర్యలో నడిచిన ఆందోళనలు, పోరాటాలు మాత్రమే ఈ విధమైన ఫలితాలు సాదిస్తాయనేది అనుభవం నేర్పుతున్న సత్యం.

**భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమం**

భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమ ప్రత్యేకతలు మనం అర్థం చేసుకోవాలి. ఇందుకు సంభందించిన ముఖ్యవిషయమేమంటే మార్క్సిజం–లెనినిజం అద్యయనం, భాదతదేశ పరిస్థితులకు అన్నయింపు, ఆ తర్వాత ప్రజలలోపని కాకుండా, దాదాపుగా ప్రజలలోపని, అందులో వచ్చిన సమస్యల ఆధారంగా అధ్యయనం అనే పద్దతిలో ఉద్యమ నిర్మాణం జరిగినందువలన కొన్ని లాభాలు, కొన్ని నష్టాలు సహజంగానే సంభవించాయి. ఈ పద్దతి పరిణామక్రమం వల్ల సిద్దాంతమూలాలు బలహీనంగా ఉన్నాయి. బహుశా ఈ కారణం చేతనే కమ్యూనిస్టు ఉద్యమంలో జరిగిన, జరుగుతున్న తప్పొప్పులు, తక్షణ ఫలితాలలో లాభ,నష్టాల ఆదారంగానే ప్రధానంగా నిర్ణయించబడటమో, అర్థంకావటమో జరుగుతోంది. దీనికితోడు ప్రారంభదినాలలో వచ్చిన రైతాంగ ఉద్యమాల కారణంగా పార్టీలో మద్యతరగతి, పెటీ బూర్జువా ప్రభావాలు సహజంగానే ఎక్కువగా ఉన్నాయి. అంటే ఒక వైపు పార్టీలో మద్యతరగతి మనస్తత్వాలు దోరణులు ఎక్కువగా ఉండటం, మరోవైపు ఈ అన్యవర్గదోరణులను నియంత్రించే సిద్దాంతస్థాయి, కృషి తక్కువగా ఉండటం సంభవించింది. కమ్యూనిస్ట ఉద్యమ చీలికలలోనూ, తత్పలితంగా సంభవించిన నష్టాలలోనూ ఈ అంశాల ప్రభావం కూడా ప్రధానమనేది మన గమనంలో ఉండాలి.

అందువల్ల మనఉద్యమంలో ఏ కారణం చేతనైతేనేమి, నిర్లక్ష్యానికి గురైన సిద్దాంత కృషి పట్ల శ్రద్ద వహించటం నేటి మన చారిత్రిక కర్తవ్యం అనేది పార్టీశ్రేణులు

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్థిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520 002**



epaper.prajasakti.com

గమనించటం అవసరం. దిద్దుబాటు ఉద్యమం సందర్భంగా పార్టీలో వెల్లడవుతున్న పొరపాట్లు, పెడదోరణుల గురించి పార్టీ కేంద్రకమిటీ విశ్లేషించిన కారణాలలో కూడా పార్టీలో రాజకీయవిద్యాభోదన బలహీనంగా ఉండటం చాలా ముఖ్యమైనదిగా చెప్పబడింది. ఆ పత్రంలో రాజకీయ విద్యాభోదనలో ఇపుడు జరుగుతున్న కృషి ఎంతమాత్రమూ సరిపోదని పార్టీ చెప్పింది.

కమ్యూనిస్టుల రాజకీయ, సైద్దాంతిక కృషి రెండు రకాలుగా సాగాల్సిఉంటుంది. మొదటిది పార్టీ రాజకీయ, సిద్దాంతమూలాలను కార్యకర్తలు ఎంతగా ఆకళింపు చేసుకోగల్గితే వారి ఆచరణ, ఉద్యమ నిర్మాణం అంత నాణ్యంగా ఉంటుంది. ఈ లక్ష్యంతో కృషి సాగాలి. రెండవదీ, ప్రస్తుత నిర్ధిష్టపరిస్థితిలో మరింత ముఖ్యమైనదీ ఏమంటే బూర్జువా సంస్కృతికి భిన్నంగా ప్రత్యామ్నాయ సంస్కృతిని నిర్మించే కృషి సాగాలి. బూర్జువావిలువలు, సంప్రదాయాలు సమాజమే సహజంగా నేర్పుతోంది. కానీ ప్రత్యామ్నాయ విలువలు పట్టుబట్టి నేర్పితే తప్ప అలవడటం అసాధ్యం. అందుకు మన అధ్యయన కేంద్రాలు ఆలంబన కావాలి. సుదీర్ఘకాలం ఈ అంశాలపై పట్టుబట్టి కృషి సాగితేతప్ప ఫలితాలు రావు. ఉత్తమ కమ్యూనిస్టుల ఉత్పత్తి కేంద్రాలుగా అధ్యయన కేంద్రాలు అభివృద్ధి కావాలంటే స్టడీ సర్కిల్స్‌ను మొక్కుబడిగా కాకుండా, పథకం ప్రకారం జరపాల్సిఉంటుంది. ఎంపిక చేసుకున్న కార్యకర్తలను నిర్ణీతకాలవ్యవధిలో, కనీసస్థాయికి అభివృద్ధి చేసేవిధంగా ప్రణాళికలుండాలి.

❊

**“కమ్యూనిస్టుల రాజకీయ, సైద్దాంతిక కృషి రెండు రకాలుగా సాగాల్సిఉంటుంది. మొదటిది పార్టీ రాజకీయ, సిద్దాంతమూలాలను కార్యకర్తలు ఎంతగా ఆకళింపు చేసుకోగల్గితే వారి ఆచరణ, ఉద్యమ నిర్మాణం అంత నాణ్యంగా ఉంటుంది. ఈ లక్ష్యంతో కృషి సాగాలి. రెండవదీ, ప్రస్తుత నిర్ధిష్టపరిస్థితిలో మరింత ముఖ్యమైనదీ ఏమంటే బూర్జువా సంస్కృతికి భిన్నంగా ప్రత్యామ్నాయ సంస్కృతిని నిర్మించే కృషి సాగాలి.”**

# భారత దేశంలో సైద్ధాంతిక పోరాటం: ప్రత్యేకతలు

(29వ పేజీ తరువాయి)

అభివృద్ధి పట్ల శ్రద్ధ, ఆసక్తి లేకుండా అమలుజరిపే కార్యక్రమాలుగా ఉంటాయి. ప్రస్తుత పరిస్థితులలో ఏమీపట్టకుండా వ్యవహరించటం స్థంభించిపోవటం కన్నా ప్రమాదకరమైనది. నయా సామ్రాజ్యవాద ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నామనే. సామ్రాజ్యవాదం తను బతికివుండటం కోసం చేసే చివరి ప్రయత్నాలలో భాగంగా సైనిక యంత్రాంగం కోసం ప్రతి సంవత్సరం వేల కోట్ల రూపాయల సరుకులు, సేవలను ఉత్పత్తి చేస్తున్నదని అర్ధం చేసుకోవాలి. ప్రపంచంలోని ప్రజలు విప్లవకర సోషలిస్టు మార్గంలో తమ సమస్యలను పరిష్కరించుకోకుండా నిరోధించటం కోసమే ఈ విధంగా చేస్తున్నది. విదేశీ బహుళజాతి సంస్థలు, సామ్రాజ్యవాదంతో తమ సంబంధాలను బలోపేతం చేసుకోవటం ద్వారా స్థానికంగా ఉండే దోపిడీదారుల్లో ఒక భాగం కూడా తమ ఆధిపత్యాన్ని కొనసాగించుకోవటానికి ప్రయత్నం చేస్తున్నారు.

నయా వలసవాదం అత్యంత పమాదకరమైనది. అభివృద్ధి లేమి దానికి అత్యంత ఎక్కువగా ఉపయోగపడుతుంది. అభివృద్ధి కోసం పోరాడకుండా నిరాసక్తంగా ఉండటం అనేది సాధారణంగా కనిపించేదానికన్నా అత్యంత ప్రమాదకరమైనది. సంవత్సరాల పోరాటం ద్వారా సాధించుకున్నదానిని కోల్పోయేలాచేసి, తిరిగి వలసవాద స్థితికి వెళ్ళటానికి కారణమౌతుంది. సాధారణంగా మనం దేశంలోని మితవాద శక్తుల నుండి, అంతర్జాతీయంగా కోరలు చాస్తున్న సామ్రాజ్యవాదం నుండి ఎదురయే జంట ప్రమాదాలను గురించి చర్చిస్తూ ఉంటాం. ఇది వాస్తవం. మొత్తం వాస్తవ పరిస్థితి మనకు అర్ధం కావాలంటే ఈ రెండింటి మధ్య ఉన్న సంబంధాన్ని అర్ధం చేసుకోవటం అవసరం.

ఆర్ధికంగా మనం స్వయం సమృద్ధిని సాధిస్తే సామ్రాజ్యవాదం మనపై ఆధిపత్యం సంపాదించలేదు. విప్లవకరమైన సామాజిక మార్పుల ద్వారా మాత్రమే దానిని మనం సాధించుకోగలం. కాని దీనిని ప్రతిఘటించే శక్తులు దేశంలో ఉన్నాయి. ఈ శక్తులపైనే సామ్రాజ్యవాదం తన ఆశలను పెట్టుకున్నది. ఆ విధంగా సమకాలీన పరిస్థితులలో అభివృద్ధి గురించిన అన్ని భావాలు ఒకచోట కేంద్రీకృతం అవుతున్నాయి. శాస్త్రీయ సోషలిజం కోసం చురుకుగా పోరాడటం కోసం అంకితం కావాలి. ఈ విధమైన అంకితభావానికి అవసరమైన సైద్ధాంతికాంశాలకు సంబంధించి మార్క్స్ తన మొదటి రచనలలోనే ఈ విధంగా పేర్కొన్నాడు. “భౌతికశక్తులను భౌతికశక్తుల ద్వారానే కూలదోయాలి. కాని మనుషులపై ఆధిపత్యం సంపాదించగానే సిద్ధాంతం కూడా భౌతికశక్తిగా మారుతుంది”. **(అనువాదం: ఎ కోటిరెడ్డి)**

# సామ్రాజ్యవాద వ్యతిరేక యుద్ధం

(35వ పేజీ తరువాయి)

గుర్తింపు తెచ్చుకుంది. ఇందుకు కేరళలో మలబార్ ప్రాంతం ఒక ఉదాహరణగా చెప్పవచ్చు. 1943 కరువు రోజుల్లో బెంగాల్‌లో పార్టీ సహాయక చర్యలు చేపట్టింది. అందువలన అనేక తరగతులలో పార్టీ చొరబడ గలిగింది. కమ్యూనిస్టుల పని, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వారు పోరాడిన తీరు, ఆఖరికి క్విట్ ఇండియా ఉద్యమంలో చురుకుగా పాల్గన్నవారిని కూడా ఆకర్షించింది. అరుణా అసఫలీ వంటి నాయకులూ పార్టీలో చేరారు. ఒకానొక సమయంలో తప్పుడు అవగాహన ఉన్నప్పటికీ పార్టీ ఎన్నడూ బ్రిటిష్ పాలకులతో కుమ్మక్కు కాలేదు. 1942 సెప్టెంబర్ 2న అప్పటి గఅహ విభాగం లండన్లోని రాష్ట్ర కార్యదర్శికి వ్రాసిన ఒక లేఖలో “భారత కమ్యూనిస్టు పార్టీలో ఉన్న అనేక మంది సభ్యుల నడవడిక స్పష్టంగా ఒక విషయాన్ని తెలియచేస్తుంది. వారు బ్రిటిష్ వారిని వ్యతిరేకించే విప్లవకారులు”. 1943 సెప్టెంబర్ 20న బ్రిటిష్ ప్రభుత్వం పంపిన మరో రహస్య నివేదికలో “అది (భారత కమ్యూనిస్టు పార్టీ) ప్రధానంగా భారతదేశ స్వాతంత్రం కోసం పనిచేస్తున్న ఒక జాతీయ పార్టీ. అందులో ఎక్కువమంది సభ్యులు ఆ పార్టీలో ఉండడానికి కారణం అది బ్రిటిష్ పాలనను అంతం చేయడానికి కట్టుబడి ఉండడమే.” అని ఉంది.



epaper.prajasakti.com

# సామ్రాజ్యవాద వ్యతిరేక యుద్ధం

(2వ పేజీ తరువాయి)

రిపోర్టులో కమ్యూనిస్టుల కార్యకలాపాల గురించి తెలిపింది.

కమ్యూనిస్టులు యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలకు, కార్మికులు కర్షకులతోపాటు విద్యార్థులనుకూడా సమీకరించడంపై కేంద్రీకరించారు. వీరందరిని దేశవ్యాప్తంగా జరిగే యుద్ధ వ్యతిరేక ఉద్యమాలకి ఆధారంగా మలచాలనుకున్నారు. మిలిటెంట్ కార్యాచరణలను ప్రజలలోకి తీసుకెళ్లడం ద్వారా ప్రజా ఉద్యోమాల విస్తృతిని పెంచి, జాతీయోద్యమంలో వాటిని సింహ భాగం చేయడమే ప్రధాన లక్ష్యం. ఈ చర్యల ఫలితంగా అఖిల భారత విద్యార్థి సంఘం అత్యంత శక్తివంతమైన సంఘంగా రూపొందింది. విద్యార్థులకు నాయకత్వం వహించింది. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడే అన్నిరకాల తీవ్రవాద విద్యార్థి సమూహాలను ఐక్యం చేసింది. ఈ కాలంలో కమ్యూనిస్టుపార్టీ, మతతత్వానికి వ్యతిరేకంగా పోరాడే ప్రయత్నంకూడా చేసింది. యుద్ధం మొదలయిననాటి నుండి బ్రిటిష్ సామ్రాజ్యవాదం, "జాతీయోద్యమాన్ని మతతత్వ తిరుగుబాట్లలో ముంచెత్తి మతతత్వ విచ్ఛిన్నకర శక్తులను ప్రోత్సహిస్తున్నదని" పార్టీ స్పష్టంగా హెచ్చరించింది. "ముస్లిం లీగ్, హిందూ మహాసభ వంటి మతతత్వ సంస్థలు చేస్తున్న పోరాటాలు, బ్రిటిష్ సామ్రాజ్యవాదుల ప్రాపకంతో జరుగుతున్నాయని, మతతత్వ విషం చిమ్మి ప్రజలను వేరుచేసి, తమ వెంట ఉంచుకోవాలని అవి భావిస్తున్నాయని, కేవలం ప్రజలలో, వర్గ పోరాటాల విప్లవ ప్రచారం మాత్రమే ఇటువంటి మతతత్వ విద్వేష విషబీజాలు సమూలంగా తుడిచిపెట్టగలదని" పూర్తిగా వర్గ దృక్పథంతో పార్టీ విశ్లేషించింది.

కమ్యూనిస్టులు చేస్తున్న ఈ ప్రయత్నాలు పాశవికంగా అణచివేయ బడ్డాయి. ప్రభుత్వం దేశభద్రత చట్టాన్ని ప్రయోగించి కమ్యూనిస్టులను నిర్దాక్షిణ్యంగా ఖైదు చేసింది. బహిరంగ సభలు నిషేధించింది. సమాచార స్వేచ్ఛను, ఇతర ప్రచార మాధ్యమాలను మట్టు పెట్టింది. స్వచ్ఛంద సంస్థల నిషేధ చట్టాన్ని అత్యవసరంగా తెచ్చింది. 1941 జూన్‌లో పార్టీ నిషేధించబడింది. ఆ రోజుల్లో మొత్తం ఖైదు చేయబడ్డ 700 మందిలో 480 మంది కమ్యూనిస్టులే. కమ్యూనిస్టులు బహిరంగంగా, రహస్యంగా కూడా సభ్యుల మధ్య సమన్వయము చేసుకుంటూ, 'కొంతమంది లంగిపోయి మరి కొంతమంది ఖైదు చేయబడకుండా తప్పించుకుంటూ' పనిచేసారు. 1934 నుండి పార్టీపై నిషేధం ఉన్నప్పటికీ కమ్యూనిస్టులు కాంగ్రెస్ సోషలిస్టు పార్టీని, లేదా ఇతర వర్గ సంఘాలను ఆసరాచేసుకుని తమ పనులు చేసుకోగలిగారు. ఐక్య సంఘటన ఎత్తుగడ కమ్యూనిస్టుల కార్యకలాపాలు విస్తృతపరచడానికి ఎంతగానో ఉపయోగపడింది. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడుతున్న వారినందరినీ ఐక్యం చేయడంలోని ప్రాధాన్యతని కమ్యూనిస్టుపార్టీ గుర్తించింది. ప్రజలను సామ్రాజ్యవాదానికి, యుద్ధానికి వ్యతిరేకంగా పోరాడడంలో కాంగ్రెస్ నిర్ణయాత్మక పాత్రను పోషించవలసి ఉందని గ్రహించింది. అయితే కాంగ్రెస్ లోని అతి వాదులు, మిత వాదులు, సి ఎస్ పి, ఫార్వర్డ్ బ్లాక్, కమ్యూనిస్టు పార్టీల మధ్య యుద్ధకాలంలో అనుసరించవలసిన వ్యూహాల విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కమ్యూనిస్టు పార్టీ యుద్ధస్వరూపాన్ని, అందులో బ్రిటీష్ వారి పాత్రను, యుద్ధం ఏ పరిస్థితులలో వచ్చిందీ, దాని వలన ఏ ఏ వర్గ శక్తులు ఏర్పడ్డాయి, వాటి మధ్య ఉన్న సంబంధాలలేమిటి అనే విషయాలను దృష్టిలో పెట్టుకుని వస్తుగతంగా అంచనా వేసింది. వీటి ఆధారంగా పార్టీ, రాజకీయాలను, మితవాద కాంగ్రెస్ నాయకత్వాన్ని, సి ఎస్ పి, ఫార్వార్డ్ బ్లాక్‌లను, విమర్శాత్మకంగా పరిశీలించింది. కాంగ్రెస్ నాయకత్వం, ఒక వైపు ఫాసిస్టు వ్యతిరేక ప్రకటనలు చేస్తూనే బ్రిటిష్ వారితో బేరసారాలు ఆడే ప్రయత్నాలు కూడా చేస్తున్నది, సీఎస్ పి నాయకత్వం కాంగ్రెస్ విధానాలతో విభేదిస్తున్నట్టు నటిస్తూనే దాని విధానాలను వాస్తవంలో బలపరుస్తుంది. కమ్యూనిస్టు పార్టీ బ్రిటిష్ పాలకుల ఫాసిస్టు వ్యతిరేక ముసుగును తొలగించి, దాని నిజ స్వరూపాన్ని బహిర్గతం చేయాలని ప్రయత్నిస్తున్నది. భారతదేశంలో విప్లవాన్ని నిర్మించాలని ప్రయత్నిస్తున్న ఫార్వర్డ్ బ్లాక్, అందుకు ఫాసిస్టు శక్తుల సహాయం తీసుకుంటున్నది. ఇటువంటి విబేధాల వలన ఏంతో కష్టపడి నిర్మించిన వామపక్ష ఐక్యత విచ్ఛిన్నమయే స్థితికి చేరుకుంది. 1940 మార్చ్‌లో సి ఎస్ పి, వారి పార్టీలో ఉన్న కమ్యూనిస్టులను బహిష్కరించినట్టు ప్రకటించింది. కమ్యూనిస్టు పార్టీ, లక్షలాది మిలిటెంట్ ప్రజా పోరాటాలకు అక్షరరూపాన్నిచ్చిన 'ప్రొలేటారియాన్ పాత్' (కార్మికవర్గ పంథా) అనే కరపత్రాన్ని **మార్క్సిస్టు**, సి ఎస్ పి, ఫార్వర్డ్ బ్లాక్ విధానాలను పదునుగా విమర్శిస్తున్న 'పార్టీస్ అండ్ పాలిటిక్స్' (పార్టీలు–రాజకీయాలు) అనే చిన్న పుస్తకాన్ని, ప్రచురించింది. ఇవి దేశవ్యాప్తంగా ఉన్న కమ్యూనిస్టులకు సైద్ధాంతిక అవగాహనను కల్పించడానికి తోడ్పడ్డాయి. వారికి మిలిటెంట్ జాతీయవాద శిక్షణ ఇవ్వడానికి, అంతర్జాతీయ వర్గ చైతన్యం కలిగించడానికి ఉపయోగపడ్డాయి. ఈ రెండు డాక్యూమెంట్లు అనేక భాషలలోకి అనువాదం చేయబడ్డాయి. విస్తృతంగా సర్క్యులేట్ చేయబడ్డాయి. ప్రతివారం వెలువడే 'పార్టీ ఉత్తరం' పార్టీ కార్యకర్తలకు సరైన అవగాహన కల్పించడానికి ఎంతగానో ఉపయోగపడింది. 1941 జూన్ 22వ తేదీ సోవియెట్ యూనియన్ పై నాజీల దాడి ప్రారంభమయింది. అది యుద్ధం యొక్క స్వభావాన్ని, ప్రపంచ రాజకీయాలను సమూలంగా మార్చివేసింది. ఇది మన పార్టీ రాజకీయ విధానాన్ని కూడా మార్చింది.

### ప్రజా యుద్ధం, క్విట్ ఇండియా ఉద్యమం

1939లో ప్రారంభమైన రెండో ప్రపంచయుద్ధాన్ని కమ్యూనిస్టు పార్టీ బహిరంగంగా వ్యతిరేకించింది. భారతదేశ ప్రజలను యుద్ధాన్ని వ్యతిరేకించమని, యుద్ధంవలన ఏర్పడ్డ దుర్భర ఆర్థిక పరిస్థితులకు వ్యతిరేకంగా పోరాటాలు చేయడానికి నాయకత్వం వహించమని పిలుపునిచ్చింది. వందలాది కార్మికులు ఖైదు చేయబడినప్పటికీ, పార్టీమీద, పార్టీ పత్రికల మీద నిషేధాలు విధించనప్పటికీ, పార్టీ విపరీతంగా అణచివేతను ఎదుర్కొన్నప్పటికీ పార్టీ సభ్యులు అధిక ధరలకు వ్యతిరేకంగా, ఆహార కొరతకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేసారు. కార్మిక వర్గం అనేక సమ్మెలు చేసింది.

1941 జూన్‌లో హిట్లర్ సోవియెట్ యూనియన్ పై దండయాత్ర చేయడంతోనే యుద్ధం స్వరూపం మారిపోయింది. ఫాసిస్టు శక్తులు సోషలిజం కోటపైనే దాడికి దిగాయి. యుద్ధం ప్రపంచవ్యాపితంగా ఉన్నఫాసిస్టు శక్తులకు ప్రాతినిధ్యం వహిస్తున్న మూడు యాక్సిస్ శక్తులు – జర్మనీ, ఇటలీ, జపాన్ లకు వ్యతిరేకంగా మారిపోయింది. యుద్ధం యొక్క మారిన ఈ స్వభావాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ గుర్తించింది. 1941 జూలై చివరి వరకు సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటానికి మద్దతునిచ్చింది. ఆ యుద్ధాన్ని విప్లవ యుద్ధంగా మార్చమని పొలిట్ బ్యూరో పిలుపునిచ్చింది. ఈ మధ్యలో డియోలి నిర్బంధ కేంద్రంలో నిర్బంధించబడి ఉన్న కమ్యూనిస్టులు యుద్ధంపై



epaper.prajasakti.com

[illegible] ప్రశ్నించారు. బి టి రణదివే నాయకత్వంలో ఈ గ్రూపు పొలిట్ బ్యూరో కి ఒక డాక్యూ మెంటు ని పంపించింది. అందులో యుద్ధంపై పార్టీ వైఖరిలో మార్పు రావాలని, పార్టీ ఎత్తుగడలతో మార్పులు చేయాలనికోరింది. సోవియెట్ యూనియన్ పై నాజీలు దాడి చేయడంతో యుద్ధం స్వభావంలో మార్పు వచ్చిందని, ఇది ఫాసిజంపై ప్రజా యుద్ధంగా మార్పు చెందిందనివారు వ్రాసారు. డియోలిలో నిర్బంధించబడి ఉన్న భారత కమ్యూనిస్టు పార్టీ గ్రూపు నుండి వచ్చిన ఈ డాక్యూ మెంటునే జైలు డాక్యూమెంట్‌గా పిలుస్తుంటారు. అందులో, "ఉన్న ఒకే ఒక్క కార్మిక వర్గ రాజ్యంపై అత్యంత క్రూరంగా దాడి చేసిన ఫాసిజం, అంతర్జాతీయ కార్మిక వర్గ ప్రధాన శత్రువుగా, సామ్రాజ్యవాద కార్మిక వర్గ శత్రువుగా మారింది. కాబట్టి భారతదేశ కార్మిక వర్గ పార్టీ యుద్ధంలో జోక్యం చేసుకోవాలి. దీనిని ప్రజాయుధంగా ప్రకటించాలి. వీలయినంత వేగంగా జయించేందుకు సర్వ శక్తులు ఒడ్డాలి." అని వ్రాసారు. గ్రేట్ బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ కూడా భారత కమ్యూనిస్టు పార్టీకి, మారిన యుద్ధ స్వభావాన్ని గురించి ఒక పత్రాన్ని పంపించింది. ఫలితంగా 1941 డిసెంబర్‌లో పోలిట్ బ్యూరో చర్చించి ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఈ తీర్మానం, హిట్లర్ సోవియెట్ యూనియన్ పై దాడి చేయడంతో యుద్ధ స్వభావం పూర్తిగా మారిపోయిందని గుర్తించింది. ఇప్పుడది సామ్రాజ్యవాద యుద్ధం కాదు. ప్రజా యుద్ధం. దేశంలో "ప్రజా యుద్ధ ఉద్యమం" అభివఅద్ధి చేయాలని పిలుపునిచ్చింది. ఫాసిస్టు శక్తులపై యుద్ధంలో గెలుపు భారతదేశ ప్రజలు స్వాతంత్రం కోసం చేస్తున్న పోరాటానికి సహాయపడుతుందని భావించింది. 1942లో పార్టీ పై నిషేధం ఎత్తివేయబడింది. ఖైదు చేయబడిన నాయకులను అధికారులు క్రమంగా విడుదల చేయడం మొదలు పెట్టారు. అయితే ప్రజా యుద్ధమన్న పిలుపు, భారతదేశ స్వాతంత్ర పోరాటాన్ని ఫాసిజానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంతో జోడించడాన్ని జాతీయవాదులు, వామపక్ష జాతీయవాదులు హర్షించలేదు. కానీ పార్టీ వైఖరి కొంతమంది ఆలోచనాపరులలో మాత్రం మెప్పు పొందింది.

యుద్ధం ముగిసిన తరువాత జరిగిన చర్చలలో, యుద్ధంలో సహకరించినందుకు బదులుగా కాంగ్రెస్ కోరిన కోర్కెలను బ్రిటిష్ ప్రభుత్వం అంగీకరించలేదు. 1940 అక్టోబర్‌లో గాంధీజీ నాయకత్వాన వ్యక్తిగత సత్యాగ్రహాన్ని కాంగ్రెస్ ప్రారంభించింది. బ్రిటిష్ ప్రభుత్వం కేంద్రంలో డొమినియన్ స్టేటస్ (అధినివేశ రాజ్యం) కల్పించే ఏ కొద్దీ మార్పులను కూడా అంగీకరించలేదు. ఒక సంవత్సరం పాటు సత్యాగ్రహం కొనసాగిన తరువాత బ్రిటిష్ ప్రభుత్వం యుద్ధకాలంలో భారతదేశ క్యాబినెట్ సభ్యుడుగా ఉన్న సర్ స్టాఫోర్డ్ క్రిప్స్‌ని భారతదేశ నాయకులతో చర్చలు జరిపమని పంపించింది. క్రిప్స్ భారతదేశ స్వాతంత్ర్యాన్నిచ్చే ఎటువంటి విలువైన ప్రతిపాదనలు చేయలేదు. క్రిప్స్ రాయభారం విఫలమైన తరువాత గాంధీజీ, బ్రిటిష్ వారు చర్చలకు ఆహ్వానించాలంటే ప్రజాపోరాటాలు చేయాలని నిర్ణయించారు. భారత జాతీయ కాంగ్రెస్ తో ఒక అవగాహనకు వచ్చారు. కాంగ్రెస్‌లో కొంతమంది పోరాటాలకు ఇది అనువైన సమయం కాదని అంటున్నప్పటికీ, ఈ ఆలోచనతోనే గాంధీజీ, తన కార్యాచరణను అమలు చేయడానికి కాంగ్రెస్‌ను ఒప్పించారు. ఆగస్టు 9నుండి క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభమవుతుందని 1942లో ఆగస్టు 8న బంబాయిలో కాంగ్రెస్ పిలుపునిచ్చింది. అందుకు ప్రతిగా బ్రిటిష్ ప్రభుత్వం కాంగ్రెస్ నాయకులలో చాలామందిని జైళ్లలో కుక్కింది. గాంధీజీ ఉహించినట్టు బ్రిటిష్ వారు ఏమాత్రం మెట్టుదిగి రాలేదు. ప్రదర్శనలలో పాల్గన్నవారిని అత్యంత క్రూరంగా అణచివేయడం ప్రారంభించారు. దానితో ప్రదర్శకులు రైల్వే లైన్లను, టెలిఫోన్ లైన్లను కత్తిరించారు. పోస్ట్ ఆఫీసులపై, స్థానిక ప్రభుత్వ ఆఫీసులపై దాడులు చేసారు. వేలాది మంది ప్రజలు మిలిటెంట్ ప్రదర్శనలు చేసారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ 'ప్రజా పోరాటాన్ని' చేయాలని నొక్కి చెప్పడానికి కారణం ఫాసిజంపై విజయం సాధించేందుకు చేస్తున్న యుద్ధప్రయత్నాలు బలపడాలని. రాజకీయంగా, పార్టీ కాంగ్రెస్ పార్టీ నాయకులను విడుదల చేయాలని, జాతీయ ప్రభుత్వ ఏర్పాటుకు జాతీయ ఐక్య వేదిక ఏర్పాటుచేయాలని డిమాండ్ చేసింది. జపాన్ బర్మాని గెలిచి, భారతదేశం వైపు అడుగులేస్తున్న సందర్భంలో, యుద్ధ ప్రయత్నాలకు భంగం కల్గించే ఎటువంటి పోరాటాలనయినా భారత కమ్యూనిస్టు పార్టీ వ్యతిరేకించింది. పార్టీ క్విట్ ఇండియా పిలుపును వ్యతిరేకించడానికి కారణం, అది జపాన్‌ను ముందుకు అడుగేయకుండా నిలువరించడానికి జరిపే ఐక్య ప్రయత్నాలకు భంగం కలుగుతుందేమో అన్న అనుమానమే. అయితే పార్టీ, కార్యకర్తల అణచివేతను ఖండించింది. జాతీయ నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేసింది. ఆ నాటి పార్టీ వైఖరి అప్పటికే ప్రజలలో బలంగా ఉన్న సామ్రాజ్యవాద వ్యతిరేకతకు విరుద్ధంగా ఉంది. క్విట్ ఇండియా ఉద్యమాన్ని వ్యతిరేకించడంతో పార్టీ, జాతీయ రాజకీయ పోరాటాలలో ఒంటరిపాటయింది. భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తరువాత పార్టీ తన వైఖరిని పునః సమీక్షించుకుని ఈ కింది నిర్ణయానికి వచ్చింది: పార్టీ అనుసరించిన 'ప్రజాయుద్ధం' అనే రాజకీయ వైఖరి సరైనదే అయినా పార్టీ కొన్ని తీవ్రమైన తప్పులు చేసింది. అందుకనే తగిన మూల్యం చెల్లించుకుంది. ప్రజాయుద్ధాన్ని సమర్థించడం సరైనదే అయినా, అంతర్జాతీయ వైరుధ్యాలను జాతీయ వైరుధ్యాలతో జోడించడంలో పార్టీ విఫలమైయింది. అంతర్జాతీయంగా ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడడం ప్రధాన వైరుధ్యమే అయినా దేశంలో బ్రిటిష్ సామ్రాజ్యా వాదానికి ప్రజలకు మధ్య ప్రధాన వైరుధ్యం ఉంది. అందువలన పార్టీ క్విట్ ఇండియా ఉద్యమాన్ని వ్యతిరేకించకుండా ఉండవలసింది. యుద్ధ ప్రయత్నాలకు భంగం కలుగుతుందని ప్రజాపోరాటాలకు దూరంగా ఉండకుండా ఉండవలసింది. పార్టీ ఇచ్చిన ఈ గైడెన్స్, పోరాటాలు చేస్తున్న శ్రామిక జనానికి, ముఖ్యంగా కార్మిక సంఘాలు, కిసాన్ సభలకు ఒక సూత్రబద్ధ వైఖరికి భంగం కలిగించే సంస్కరణ వాదంగా అనిపించింది. యుద్ధంకోసం పారిశ్రామిక ,వ్యవసాయ ఉత్పత్తులను పెంచడం అంటే శ్రామికజనం చేస్తున్న మిలిటెంట్ పోరాటాలను నిలవరించడమే. పార్టీ వ్యతిరేకులకు, ప్రజాసంఘాల, కార్మిక సంఘాల, కిసాన్ సభల ఐక్యతను భంగం కలిగించే అవకాశాన్ని ఇవ్వడమే. మొట్ట మొదటిసారిగా, ప్రతి ప్రజా సంఘం రాజకీయపార్టీ పంథాలకి అనుగుణంగా విభజించబడింది. స్టాలిన్ గ్రేడ్‌లో ఎర్ర సేన విజయం సాధించగానే యుద్ధం దశ తిరిగిపోయిందన్న విషయాన్ని పార్టీ గమనించలేక పోయింది. భారతదేశానికి ఫాసిస్టు ముప్పు ఇంకా ఉందని భావించింది. స్టాలిన్ గ్రేడ్ వశమైన తరువాత బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాట స్థాయిని పెంచడానికి అనుగుణంగా ఎత్తులు వేయడంలో మరింత మఅదువైన ధోరణిని అవలంభించి ఉండవలసింది.

1945లో యుద్ధం ముగిసిన తరువాత, యుద్ధం తదనంతరం జరిగిన అనేక పోరాటాలలో, ఉవ్వెత్తున ఎగసిపడ్డ అనేక మిలిటెంట్ పోరాటాలకు పార్టీ నాయకత్వం వహించింది. ఈ కాలంలో, మిలిటెంట్ జాతీయ సామ్రాజ్యవాద వ్యతిరేకులలో పార్టీ కొంత ఒంటరిపాటు అయినప్పటికీ, యుద్ధకాలంలో ప్రజలెదుర్కొంటున్న కష్టాలలో వారికి నిరంతరం అండగా ఉండడం వలన పార్టీకి కొత్త తరగతులలో కొత్త ప్రాంతాలలో సంబంధాలు ఏర్పడ్డాయి. అధిక ధరలకు వ్యతిరేకంగా, ఆహార కొరతలకి వ్యతిరేకంగా, నల్లబజారులకి, సరుకులను దాచిపెట్టడానికి వ్యతిరేకంగా, నిత్యావసర వస్తువుల కొరతలకి వ్యతిరేకంగా ప్రజలు చేస్తున్న పోరాటాలలో పార్టీ యూనిట్లు నిరంతరం పాలుపంచుకోవడం వలన ప్రజలలో

(మిగతా 33వ పేజీలో)




epaper.prajasakti.com

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-05-2020 (36 pages) Postal Regd. No D/VJ/172/2018-20



# పెట్టుబడిదారీ విధాన ఆటవికత



– నోమ్ చోమ్‌స్కీ

కోవిడ్ 19 మహమ్మారి రావటానికి, అది మరింత తీవ్రం కావటానికి దారితీసిన పరిస్థితులను మొదట మనం అర్థం చేసుకోవాలి. తమ లాభాల కోసం పరిస్థితులు మరింతగా దిగజారిపోయేలా చేయటానికి పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రయత్నం చేస్తున్నది. ఇతర అంశాలతో పాటు ప్రోత్సాహకాలు ఇస్తూ ప్రవేశపెట్టిన బడ్జెట్ బిల్లులో కూడా మనం ఈ విషయాలు చూడవచ్చు. రెండవ విషయం వీటన్నింటినీ మరుగుపరిచేలా పెరుగుతున్న గ్లోబల్ వార్మింగ్ వలన మనం దీనినుండి కోలుకోవటానికి చాలా మూల్యం చెల్లించాల్సి వుంటుంది. ధృవప్రాంతంలో మంచుకొండలు కరిగిపోవటం నుండి మనం కోలుకోలేం. ప్రస్తుత పెట్టుబడిదారీ వ్యవస్థ దీని పట్ల ఎటువంటి వైఖరి తీసుకుంటున్నదో అర్థం కావాలంటే ట్రంప్ బడ్జెట్‌ను చూడాలి. సాధారణ పెట్టుబడిదారీ విధానం కన్నా ప్రస్తుతం ఉన్నది ఏ మాత్రం హేతుబద్ధత లేనిది. కాబట్టి దీనిని ఉదాహరణగా తీసుకోవటం సరికానప్పటికీ ప్రస్తుతం మనం ఈ వ్యవస్థలోనే బతుకుతున్నాం కాబట్టి దీనినే ప్రాతిపదికగా తీసుకోవాలి.

"ఈ మహమ్మారి మరింత తీవ్రం కానున్న సందర్భంలో ఫిబ్రవరి 10వ తేదీన తన బడ్జెట్ ప్రతిపాదనలను ట్రంప్ ప్రవేశపెట్టాడు. దానిలో ఉన్న దేమిటి? మొదటిది. ప్రభుత్వ వైద్యానికి సంబంధించిన రంగాలకు నిధుల కోత కొనసాగింది. అతని పాలనాకాలం అంతా పెట్టుబడికి, ప్రవేటు శక్తికి, సంపదకు ప్రయోజనం కలిగించని రంగాలన్నింటికీ నిధులలో కోతలు పెట్టాడు. కాబట్టి ప్రభుత్వ ఆరోగ్యరంగానికి సంబంధించిన అన్ని విభాగాలకూ నిధులలో మరింత కోతలు పెట్టాడు. ఫిబ్రవరి 10వ తేదీతోనే మనం కొనసాగిద్దాం. సెంటర్ ఆఫ్ డిసీజజ్ కంట్రోల్–సిడిసి–విభాగానికి, ఇతర ప్రభుత్వ ఆరోగ్య సంబంధమైన రంగాలకు నిధుల కేటాయింపును తగ్గించాడు. బడ్జెట్‌లో ఖనిజ ఇంధన రంగాలకు ఎక్కువ రాయితీలు ఇచ్చాడు. కాబట్టి ఇపుడు సాధ్యమైనంత ఎక్కువ మంది ప్రజలను చంపటమే కాక మొత్తం సమాజాన్నే నాశనం చేయటానికి పూనుకున్నాడు. అతని మాటలకు అర్థం అదే. సైనిక రంగానికి, మెక్సికో సరిహద్దులో గోడ నిర్మాణానికి కేటాయింపులను అధికం చేశాడు. ఈ రెండు అంశాలు నేరపూరిత స్వభావాన్ని తెలుపుతాయి. కోవిడ్ 19 మహమ్మారిపై వ్యవహరిస్తున్న తీరు వైట్‌హౌస్ అమానవీయతకు అద్దం పడుతున్నది. కాని దీనంతటికీ ట్రంప్‌నే నిందించటం సరికాదు. అంతకుముందు నుండే ఇది కొనసాగుతున్నది.

"2003లో సార్స్ మహమ్మారి వచ్చిన తర్వాత మరింత తీవ్రమైన వైరస్‌లు రావచ్చునని శాస్త్రవేత్తలు హెచ్చరించారు. అయితే అర్థం చేసుకోవటమే సరిపోదు. నివారణకు తగిన చర్యలు తీసుకోవాలి. ఇపుడు రెండే అవకాశాలు ఉన్నాయి. ఒకటి మందులు తయారు చేసే కంపెనీలు. అవి పెట్టుబడిదారీ తర్కాన్నే అనుసరిస్తాయి. రేపు లాభాలొస్తాయనుకుంటేనే నేడు పని చేస్తాయి. కాబట్టి మందుల కంపెనీలు చేసేదేమీ ఉండదు. కాని చేయటానికి మార్గాలున్నాయి. రోనాల్డ్ రీగన్‌కు ముందు ఇటువంటివి చేయటానికి ప్రభుత్వాలే ముందుకు వచ్చాయి. ప్రభుత్వాల చొరవ, నిధులు సమకూర్చటంతోనే పోలియోను నిర్మూలించాం. పోలియో వ్యాక్సిన్‌ను కనిపెట్టిన జోనాస్ సాక్ దానికి పేటెంట్ వద్దని చెప్పాడు. సూర్యుని లాగానే ఇదికూడా అందరికీ చెందినది అని ఆయన చెప్పాడు. రోనాల్డ్‌రీగన్ ఈ మొత్తాన్ని ఒక్కదెబ్బతో రద్దుచేశాడు.

ప్రస్తుతం ప్రభుత్వాలే సమస్య. అవి పరిష్కారం చూపవు. పన్ను స్వర్గాలలో రాయితీలు, షేర్ల బైబ్యాక్ తదితరాలకు పన్నుల ద్వారా ప్రజలు చెల్లించిన లక్షల కోట్ల డాలర్లను ఖర్చు చేస్తున్నారు. ప్రైవేటురంగం సమస్యలలో ఉన్నపుడు ప్రభుత్వాలు పరిష్కారం చూయిస్తున్నాయి. ప్రజలు సమస్యలలో ఉన్నపుడు పట్టించుకోవటం లేదు. అంతర్జాతీయంగా ప్రతీఘాతక నాయకులు ఈ విధంగానే వ్యవహరిస్తున్నారు.

భారత ప్రధాని నరేంద్రమోడి మనం చెప్పుకోవటానికి వీలులేనంత ఘోరంగా వ్యవహరిస్తున్నాడు. నాలుగు గంటల వ్యవధితో దేశం మొత్తం లాక్‌డౌన్ విధించాడు. భారతదేశంలో ఎక్కువ మంది అసంఘటితరంగ కార్మికులున్నారు. వారికి ఎక్కడికీ పోయేదారిలేదు. ఇంట్లో ఉండలేరు. వారికి ఇల్లేలేదు. వేలాది మైళ్ళదూరంలో ఉన్న తమ గ్రామాలకు నడుచుకుంటూ వెళుతూ అనేకమంది దారిలోనే చనిపోతున్నారు. ఏం జరగబోతుందో ఊహించటం కష్టం. వారిలో ఎక్కువమంది పేదలు, ముస్లీంలు కావటం వలన వారినెవరు పట్టించుకొంటారు? అంతర్జాతీయ ప్రతీఘాతకులలోని ప్రధానమైన వారిలో మోడి ఒకడు.

మా కుటుంబంలోని పూర్వీకులు శ్రామికులు. ఆనాటి కార్మికవర్గ పరిస్థితులు ఈనాటి కన్నా హీనంగా ఉన్నాయి. కాని నిరాశ లేదు. ప్రపంచం అంతం అయిపోతుందనే భావన లేదు. మనమంతా కలిసి పనిచేయటం ద్వారా దీని నుండి బయటపడగలమనే భావం ఉండేది. వారిలో కొందరు కార్మికసంఘాలు, కమ్యూనిస్టు పార్టీలలో ఉన్నారు. నాకు ఉన్న ఇద్దరు నిరుద్యోగులైన ఆంటీలు ఇంటర్నేషనల్ లేడీస్ గార్మెంట్స్ వర్కర్స్ యూనియన్‌లో ఉండేవారు. ఆ సంఘం వారికి సాంస్కృతిక జీవితాన్నిచ్చింది.

ప్రస్తుత పరిస్థితి నుండి బయటపడటానికి మనం చేయగలిగింది ఉంది. మనం కలిసివున్నాం. దీన్నుండి మనం బయటపడగలం.

**(ఏప్రిల్ 10వ తేదీన కరోనా వైరస్, ప్రభుత్వాల స్పందన గురించి నోమ్‌చోమ్‌స్కీతో క్రిస్‌బ్రూక్స్ జరిపిన ఇంటర్వ్యూలోని కొన్ని భాగాలు)**

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Prajasakti Printers & Publishers private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 9490098977, 9494101091.

 Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.15, No.1. Published on May 1, 2020 

epaper.prajasakti.com